గురువారం
10•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 105
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD











ఫ్రాన్స్‌లో రాఫెల్‌లో ప్రయాణించిన అనంతరం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ (ఇన్‌సెట్) ఆయుధపూజలో భాగంగా రాఫెల్‌పై కొబ్బరికాయపెడుతున్న కేంద్రమంత్రి

## భారత్ చేతికి రాఫెల్

- ఫ్రాన్స్ నుంచి అధికారికంగా తొలి విమానాన్ని స్వీకరించిన రాజ్‌నాథ్
- ఆయుధపూజ అనంతరం రాఫెల్‌లో విహరించిన రక్షణమంత్రి
- అత్యాధునిక ఆయుధాలతో ఏ దేశాన్నీ భయపెట్టే ఉద్దేశం లేదని వెల్లడి
- రక్షణ సామర్థ్యం బలోపేతం కోసమే సమకూర్చుకుంటున్నామని స్పష్టీకరణ

5

భౌతికశాస్త్రం



జేమ్స్ పీబుల్స్ డిడియర్ క్వెలోజ్ మైఖేల్ మేయర్

రసాయనశాస్త్రం



అకిరా యోషినో స్టాన్లీ విట్టింగమ్ జాన్ గుడ్‌ఎనఫ్

## నోబెల్‘త్రయం’

- రసాయనశాస్త్రం, భౌతికశాస్త్ర విభాగాల్లోనూ ముగ్గురు చొప్పున విజేతలు
- లిథియం అయాన్ బ్యాటరీల సృష్టికర్తలకు రసాయన నోబెల్
- విశ్వం పుట్టుక, సౌరకుటుంబం అవతలి గ్రహాల అన్వేషణకు భౌతికశాస్త్ర పురస్కారం
- ప్రకటించిన నోబెల్ కమిటీ
- శాంతి పురస్కారం.. గ్రెటాకేనా?

III

## కేంద్ర ఉద్యోగులకు డీఏ 5%

- జూలై ఒకటి నుంచి పెంపు అమలు
- 17 శాతానికి చేరనున్న కరువు భత్యం
- 49.93 లక్షల మంది ఉద్యోగులకు, 65.26 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి
- కశ్మీర్ నిర్వాసితులకు రూ.5.5 లక్షల చొప్పున పునరావాస ప్యాకేజీ
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**

దీపావళి పండుగను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు తియ్యటి కబురును అందించింది. కరువు భత్యాన్ని (డీఏ) ఐదు శాతం పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో సుమారు 49.93 లక్షల మంది ఉద్యోగులకు, 65.26 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. తాజా పెంపుతో కేంద్ర ఉద్యోగుల డీఏ ప్రస్తుతమున్న 12 శాతం నుంచి 17 శాతానికి పెరుగనుంది. ఈ పెంపుతో ప్రభుత్వ ఖజానాపై రూ.16వేల కోట్ల భారం పడనుంది. కేంద్ర ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్ (డియర్‌నెస్ రిలీఫ్)ను విడుదల చేయాలని ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించిందని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. ఈ పెంపుదల ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని చెప్పారు. నిత్యావసర ధరల పెంపును దృష్టిలో ఉంచుకొని, 7వ పే కమిషన్ సిఫారసులకు అనుగుణంగా ఈ కరువు భత్యాన్ని పెంచినట్టు పేర్కొన్నారు. ఒకేసారి ఐదు శాతం పాయింట్లు పెంచడం ఇదే మొదటిసారి అని మంత్రి చెప్పారు. ఈ ఏడాది జనవరిలో డీఏ/డీఆర్‌ను తొమ్మిది నుంచి 12 శాతానికి పెంచామని ఆయన గుర్తు చేశారు. మరోవైపు, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి వలస వచ్చిన 5,300 నిర్వాసిత కుటుంబాలలో ఒక్కొక్క కుటుంబానికి రూ.5.5 లక్షల

మిగతా 2వ పేజీలో

# రోడ్డుపై రయ్‌రయ్

ఆగని చక్రం.. పండుగ వేళ కనిపించని ఆర్టీసీ సమ్మె ప్రభావం.. ప్రయాణికుల రద్దీని బట్టి వాహనాల ఏర్పాటు

రోజుకు సగటున 8 వేల వాహనాలు తిప్పిన రవాణాశాఖ

- చార్జీలు ఎక్కువ వసూలుచేస్తే కఠిన చర్యలు
- అన్ని బస్సుల్లో ప్రయాణ చార్జీల పట్టిక
- డీఎస్పీస్థాయి అధికారితో కంట్రోల్‌రూం
- 14 నుంచి షెడ్యూలు ప్రకారం నడుపుతాం: ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి పువ్వాడ అజయ్
- పోలీసుల సహాయంతో ప్రయాణికులకు భద్రత: రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌కుమార్
- బస్‌డిపోలు, బస్టాండ్ల వద్ద గట్టి బందోబస్తు: డీజీపీ మహేందర్‌రెడ్డి



బుధవారం ఖమ్మం బస్టాండ్‌లో రద్దీ

**హైదరాబాద్/ఖమ్మం, నమస్తే తెలంగాణ:**

దసరా పండుగ నేపథ్యంలోనూ రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె ప్రభావం అంతంతమాత్రంగానే ఉన్నది. ప్రగతిచక్రం ఆగకుండా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నది. పండుగపూట ప్రయాణించేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకొన్నది. ఆర్టీసీ పరిధిలోని అద్దె బస్సులన్నీ యథావిధిగా నడిచాయి. వీటితోపాటు ఆర్టీసీ సొంత బస్సులు 30% వరకు నడిచాయి. ప్రైవేటు డ్రైవర్లు, కండక్టర్లతో అధికారులు బస్సులను నడిపిస్తున్నారు. లక్షలమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. రాష్ట్రమంతటా ప్రస్తుతం సరిపడా బస్సులు తిరుగుతున్నాయని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ తెలిపారు. చార్జీల వసూళ్లకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై దృష్టి సారించామని, టికెట్ ధరకంటే ఒక్క రూపాయి ఎక్కువ వసూలుచేసినా కఠినచర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్మికుల సమ్మె, రవాణా శాఖ తీసుకున్న చర్యలు, పండుగకు వెళ్లినవారు తిరిగి వచ్చేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రి పువ్వాడ అజయ్ ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం నుంచి బుధవారం అన్ని జిల్లాల ఆర్టీసీ అధికారులు, ఈడీలు, రీజనల్, డివిజనల్ మేనేజర్లు, ఆర్టీవోలతో నాలుగు గంటలకుపైగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ నుంచి రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, రవాణాశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా, డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**తగ్గిన ఇబ్బందులు**

సమ్మె నేపథ్యంలో రవాణావ్యవస్థకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం తీసుకొన్న చర్యలు ఆశించిన ఫలితాలనిస్తున్నాయి. తొలిరోజు నుంచే అవసరమైనంత మేరకు ప్రైవేట్ వాహనాలకు తాత్కాలిక పర్మిట్లు జారీచేశారు. ఆర్టీసీ పరిధిలోని డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరు కాకపోయినా బస్సులను యథావిధిగా తిప్పడంలో ప్రభుత్వం విజయవంతమైంది. తొలిరోజున 2386 ఆర్టీసీ బస్సులతోపాటు అద్దె బస్సులు 1696, ప్రైవేట్ వాహనాలు 5448 కలిపి మొత్తం 9,530 వాహనాలను అందుబాటులో ఉంచారు. తర్వాత ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని, కంట్రోల్ రూంల ద్వారా అంచనావేస్తూ వాహనాలను సమకూరుస్తున్నారు. అన్ని డిపోల్లో రవాణాశాఖ, ఆర్టీసీ అధికారులు కలిసి కంట్రోల్‌రూంలను నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా బస్సుల గురించి ఇబ్బందులు ఎదురవుతున్నాయని

మిగతా 2వ పేజీలో

## పల్లె ప్రగతిపై నేడు కలెక్టర్లతో సీఎం భేటీ

30రోజుల కార్యాచరణపై సమీక్ష



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పల్లె ప్రగతిపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం ప్రగతిభవన్‌లో కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు, అన్నిశాఖల కార్యదర్శులు హాజరుకానున్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 30రోజుల పల్లె ప్రగతి కార్యక్రమంలో చేపట్టిన పనులు ఏమిటి? ఆయా గ్రామాల రూపురేఖలు ఏవిధంగా మారుతున్నాయి? గ్రామాల్లో వాటివల్ల జరిగే అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎలా ఉందన్న దానిపై జిల్లా కలెక్టర్లతో చర్చించనున్నారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో జిల్లాలవారీగా తీసుకున్న ప్రత్యామ్నాయ చర్యలపై కలెక్టర్లను అడిగి తెలుసుకునే అవకాశం ఉన్నది.

## అమల్లోకి వచ్చిన కొత్త మున్సిపల్ చట్టం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త మున్సిపల్ చట్టం– 2019కి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆమోదముద్ర వేశారు. ఈ చట్టానికి ఇటీవల శాసనసభ, శాసనమండలి ఆమోదం తెలిపిన విషయం విదితమే. కొత్త మున్సిపల్ చట్టాన్ని ఆమోదించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గవర్నర్‌కు సమర్పించింది. గవర్నర్ ఆమోదం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు, ఉర్దూ, ఆంగ్లంలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు బుధవారం అధికారవర్గాలు వెల్లడించాయి. దీనితో కొత్త చట్టం అమల్లోకి వచ్చినట్టయింది.

## మహా హరితకుడ్యం!

1400 కి.మీ. పొడవు, 5 కి.మీ. వెడల్పుతో గుజరాత్ నుంచి ఢిల్లీ-హర్యానా సరిహద్దు వరకు కేంద్రం యోచన

5






| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 80.00 | రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్‌డ్ | 148.00 | స్కిన్‌లెస్ | 168.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 410.00 | రంగారెడ్డి | 410.00 |
| మెదక్ | 410.00 | కరీంనగర్ | 413.00 |
| వరంగల్ | 413.00 | చిల్లర ధర | 4.70 |

# ఆరోగ్యశ్రీ ఉత్తమం

ఆయుష్మాన్ భారత్ కంటే మంచిదన్న ఆర్బీఐ

ఆరోగ్యశ్రీకి అదనపు భారం ఉండదు

కేంద్ర పథకానికి ప్రీమియం చెల్లింపులు పెరిగే ప్రమాదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆయుష్మాన్ భారత్ కంటే తెలంగాణలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ పథకం ఉత్తమమైనదని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తన అధ్యయనంలో వెల్లడించింది. ఆరోగ్యశ్రీ పథకం పూర్తిగా ప్రభుత్వ నిధులతో పేదలకు వైద్యం అందిస్తున్నదని, లబ్ధిదారుకు అదనంగా ఎలాంటి ఖర్చు ఉండదని.. కానీ కేంద్రం అమలుచేస్తున్న ఆయుష్మాన్ భారత్‌కు ప్రీమియం చెల్లింపులు పెరిగే ప్రమాదం ఉన్నదని రిజర్వ్‌బ్యాంక్ పేర్కొన్నది. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ ప్రీమియం చెల్లింపుల కంటే క్లెయిమ్స్ వందశాతం దాటాయని తెలిపింది. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీలు బెయిలవుట్ అవుతాయని, ఈ ప్రమాదాన్ని తప్పించి ప్రజలకు వైద్యసేవలు కొనసాగించాలంటే ప్రీమియం చెల్లింపులు పెంచాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిమితుల్లేకుండా రాష్ట్రంలో పేదలందరికీ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితవైద్యం అందిస్తున్నది. ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌లతో కలిపి మొత్తం 85.34 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. బడ్జెట్‌లో 1,336 కోట్ల రూపాయలు కేటాయించి.. పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నది. ఈ నిధులను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రాష్ట్రప్రభుత్వం నేరుగా

మిగతా 2వ పేజీలో

# మాంద్యం భారత్‌కే ఎక్కువ

ప్రపంచవ్యాప్తంగా 90 శాతం దేశాల్లో వృద్ధి మందగమనం

దశాబ్దకాలంలో ఈసారే అతితక్కువ వృద్ధిరేటు.. ఐఎంఎఫ్ అధిపతి క్రిస్టలినా జార్జివా వెల్లడి

**వాషింగ్టన్, అక్టోబర్ 9:**

ప్రపంచ ఆర్థిక మందగమనం ప్రభావం భారత్ వంటి అతి పెద్ద వర్ధమాన దేశాల్లో మరింత ఎక్కువగా కనిపిస్తున్నదని ప్రపంచ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నూతన మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జివా అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ‘ఏకకాల మందగమనాన్ని’ చవిచూస్తున్నదని, దీని ఫలితంగా ఈ ఏడాది ప్రపంచంలోని 90 శాతం దేశాల్లో వృద్ధి మందగించనున్నదని హెచ్చరించారు. ఈ విస్తృత మందగమనం కారణంగా ఈ దశాబ్ద ప్రారంభం నుంచి ఈ ఏడాదే అతి తక్కువగా వృద్ధిరేటు నమోదుకానుందని వివరించారు. ‘వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్’ నివేదికను వచ్చే వారం విడుదల చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. వచ్చే వారం ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంకు వార్షిక సమావేశాన్ని పురస్కరించుకుని ఆమె బుధవారం మాట్లాడారు. గణాంకాలు క్లిష్ట పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థిక మందగమనం కొనసాగుతున్నప్పటికీ, 40 వర్ధమాన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) వృద్ధిరేటు 5 శాతానికిపైగా నమోదు కానుందని పేర్కొన్నారు. ఇందులో 19 దేశాలు సబ్‌సహారన్ ఆఫ్రికా ప్రాంతానికి చెందినవని తెలిపారు. అమెరికా, జర్మనీలో నిరుద్యోగిత కనిష్ఠస్థాయికి దిగివచ్చిందని చెప్పారు. ‘భారత్, బ్రెజిల్ వంటి అతిపెద్ద వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లో ఈ ఏడాది మందగమనం ప్రభావం మరింత ఎక్కువగా ఉండనుంది. చాలా ఏండ్లపాటు గణనీయ వృద్ధిని కొనసాగించిన చైనాలోనూ వృద్ధిరేటు



క్రమంగా దిగివస్తున్నది’ అని ఆమె వివరించారు. ఆర్థిక మందగమనం కారణంగా భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఈ ఆర్థిక సంవత్సరానికిగాను దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనాను గత శుక్రవారం పరపతి విధాన సమీక్ష సందర్భంగా గణనీయంగా తగ్గించింది. ఇంతకుముందు 6.9 శాతంగా అంచనావేయగా, తాజాగా దాన్ని 6.1 శాతానికి

మిగతా 9వ పేజీలో

## పిడుగుపాటుకు పదిమంది మృతి

6

ఖమ్మం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో బీభత్సం.. పలువురికి తీవ్ర గాయాలు.. మూగజీవాలు మృత్యువాత

గ్రేటర్‌లో మూడురోజులు అప్రమత్తం.. మొదలైన రుతుపవనాల తిరోగమనం.. నెలాఖరుదాకా నైరుతి ప్రభావం!






ప్రగతిభవన్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న సీఎం కేసీఆర్ దంపతులు



దసరా వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్, కేసీఆర్ సతీమణి శోభ, కుమారుడు, మంత్రి కేటీఆర్, కోడలు శైలిమ, మనుమడు హిమాన్షు, కేసీఆర్ కూతురు, మాజీ ఎంపీ కవిత, అల్లుడు అనిల్‌కుమార్, మనుమలు, మనుమరాండ్లు, ఇతర కుటుంబసభ్యులు తదితరులు

## ప్రగతిభవన్‌లో ఘనంగా దసరా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీఎం కే చంద్రశేఖర్‌రావు తన అధికారిక నివాసంలో వాహనపూజ, ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రగతిభవన్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. వాహన పూజచేశారు. అనంతరం ఆయుధపూజ నిర్వహించి, పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, కుటుంబసభ్యులకు సీఎం కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పూజాకార్యక్రమంలో కేసీఆర్ సతీమణి శోభ, కుమారుడు, మంత్రి కేటీఆర్, కోడలు శైలిమ, మనుమడు హిమాన్షు, కేసీఆర్ కూతురు, మాజీ ఎంపీ కవిత, అల్లుడు అనిల్‌కుమార్, మనుమలు, ఇతర కుటుంబసభ్యులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్‌రూల్స్ పంపండి

అన్నిశాఖల కార్యదర్శులకు పీఆర్సీ చైర్మన్ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్‌రూల్స్‌ను పంపించాలని అన్నిశాఖల కార్యదర్శులను పీఆర్సీ చైర్మన్ బిశ్వాల్ కోరారు. ప్రస్తుతం ఉన్న సాధారణ, ప్రత్యేక, అడ్‌హక్ ఉద్యోగుల సర్వీస్‌రూల్స్‌ను శాఖలవారీగా అందజేయాలని ఇటీవల రాసిన లేఖలో పేర్కొన్నారు. సర్వీస్‌రూల్స్ ఒరిజినల్ జీవో కాపీలు, రాష్ట్ర విభజనకు ముందున్న జీవో కాపీలు, అమెండ్‌మెంట్లు వివరాలను రాష్ట్ర, రిజినల్, జిల్లా, డివిజనల్, మండలస్థాయి వివరాలను సమగ్రంగా పంపించాలన్నారు. 33 జిల్లాలవారీగా స్టాఫింగ్ ప్యాటర్న్, స్టాఫ్‌స్ట్రెంత్, మొత్తం ఉద్యోగాలు, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు, ఖాళీల వివరాలతోపాటు హెచ్‌వోడీల్లోని ఉద్యోగుల వివరాలు తెలియజేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన అగ్రిమెంట్ కాపీలను కూడా ఇవ్వాలని ఆదేశించారు.



## నేటినుంచి లాసెట్ కౌన్సెలింగ్

లా కాలేజీలకు ఆలస్యంగా అనుమతించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని లా కాలేజీలలో 2019-20 విద్యాసంవత్సరానికి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. అందుకు సంబంధించి లాసెట్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. లాసెట్ ద్వారా ఎల్ఎల్‌బీ (మూడు సంవత్సరాలు/ఐదు సంవత్సరాలు), ఎల్ఎల్ఎం కోర్సులో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. లాసెట్ కౌన్సెలింగ్ నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్‌లో మూడు, వరంగల్‌లో ఒక్కటి చొప్పున సహాయకేంద్రాలను ఏర్పాటుచేశామని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో జేఎన్టీయూహెచ్, నిజాం కాలేజీ, కేశవ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేఎంఐటీ), వరంగల్‌లో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, కేయూలో సహాయకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అడ్మిషన్ వివరాలకు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ కోసం లాసెట్-2019 అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కన్వీనర్ తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి లా కాలేజీలకు అనుమతి ఇవ్వడంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఆలస్యం చేసిందని, అందువల్ల కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఆలస్యమైందని కన్వీనర్ పేర్కొన్నారు.

## ఆరోగ్యశ్రీ ఉత్తమం

మొదటిపేజీ తరువాయి...

ఖర్చుచేస్తున్నది. ఆరోగ్యశ్రీ పథకంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఎలాంటి భాగస్వామ్యం లేదు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పూర్తిగా ప్రభుత్వ నిధులతో నడుస్తున్నది. కేంద్రం తీసుకువచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం నిబంధనల ప్రకారం రాష్ట్రంలో కేవలం 26.11 లక్షల కుటుంబాలకు మాత్రమే లబ్ధిచేకూరుతుంది. ఈ పథకం కింద రూ.2లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వైద్యసేవల ఖర్చును మాత్రమే కేంద్రం భరిస్తుంది. మిగిలినది రోగి కుటుంబమే భరించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నేరుగా చెల్లింపులు చేసే ప్రక్రియ ఆరోగ్యశ్రీలో ఉండటంతో చెల్లింపులు పెరిగే అవకాశం లేదు. కనుక అదనపు భారం ఉండదని ఆర్బీఐ పేర్కొన్నది. ఆయుష్మాన్ భారత్ పథకంలో ఇన్సూరెన్స్ కంపెనీలు భాగస్వామ్యం కావడంతో ప్రీమియం దాటి చెల్లింపులు చేయాల్సి వస్తే అవి కుప్పకూలే అవకాశం ఉన్నదని తెలిపింది. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీలు సేవలు అందించాలంటే ప్రీమియం చెల్లింపులు పెంచాల్సి ఉంటుందని పేర్కొన్నది. ఆ రీత్యా చూసినప్పుడు ఆయుష్మాన్ భారత్ పథకం కంటే తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం చాలా మంచిదని రిజర్వ్‌బ్యాంక్ విశ్లేషించింది.

### ముహూర్తం

సూర్యోదయం: 6.08 గంటలకు

సూర్యాస్తమయం: 5.54 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, ద్వాదశి సాయంత్రం 7.51 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: శతభిషం అర్ధరాత్రి 2.13 వరకు, తదుపరి పూర్వాభాద్ర, అమృతఘడియలు: సాయంత్రం 6.07 నుంచి రాత్రి 7.55 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.29 నుంచి మధ్యాహ్నం 2.58 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 10.04 నుంచి 10.51 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.46 నుంచి 3.33 వరకు, వర్జ్యం: ఉదయం 7.18 నుంచి 9.06 వరకు.

### లోకం పోకడ



పచ్చి పులుసుకు పోపు ఇత్తులు, జిలుకర కావాల్నా? వుండు.. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తా?

# అధిక చార్జీలు వద్దు

### సమ్మెనెపంతో ప్రయాణికులపై భారం మోపొద్దు

మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్

- సిరిసిల్లలో ఆకస్మిక పర్యటన.. అధికారులతో సమీక్ష
- సొంత ఖర్చుతో పంచాయతీ సిబ్బందికి బీమా
- రూ.4లక్షల చెక్కు జిల్లా కలెక్టర్‌కు అందజేత

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె నెపంతో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేయొద్దని, ఆదేశాలను ధిక్కరిస్తే కఠినచర్యలు తప్పవని ప్రైవేట్ బస్సు సర్వీసుల యజమానులను ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు వెంటనే కంట్రోల్ రూం ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కేటీఆర్ బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత బైపాస్‌రోడ్డులోని ఎమ్మెల్యే అతిథిగృహంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 30 రోజుల ప్రణాళికను విజయవంతం చేసినందుకు అధికారులను, సహకరించిన ప్రజలను, ప్రజాప్రతినిధులను అభినందించారు. జిల్లావ్యాప్తంగా 1,200 మంది పంచాయతీ సిబ్బంది, కార్మికులకు సొంత ఖర్చులతో బీమా చేయిస్తున్నట్టు ప్రకటించిన మంత్రి, ఏడాది బీమా ప్రీమియం రూ.4 లక్షల చెక్కును కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు అందజేశారు. ప్రణాళికను నిరంతరం కొనసాగించాలని, అప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అందుకు మహిళలు, కులసంఘాల సభ్యులు, యువతను సంఘటిత పరచాలని, గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటుచేసి ఘనవ్యర్థాల నిర్వహణ చేపట్టాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వపరంగా సహకారం అందించి పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామని, తద్వారా వారు ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. చెత్త సేకరణ, తరలింపు కోసం జిల్లావ్యాప్తంగా వాహనాలు ఎన్ని అవసరమో అంచనాలు సిద్ధంచేయాలని, స్వచ్ఛ పల్లెల కోసం ఏడాది క్యాలెండర్‌ను రూపొందించాలని ఆదేశించారు.



బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లిలో 30 రోజుల ప్రణాళిక పనులను సర్పంచ్ శివజ్యోతిని అడిగి తెలుసుకొంటున్న మంత్రి కేటీఆర్

#### మరుగుదొడ్లపై స్పెషల్ డ్రైవ్

ఇంకుడుగుంత, మరుగుదొడ్డి లేని ఇల్లంటూ ఉండకూడదని, అదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. ప్రతి ఇంట్లో వాటిని నిర్మించుకొనేలా అవగాహన కల్పించాలని, అందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎగువ మానేరు నుంచి సిరిసిల్ల వరకు ఉన్న మానేరుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. వారంరోజుల్లో సరిహద్దు గ్రామాల ప్రజలంతా కలిసి హరితహారంలో పాల్గొనేలా చూడాలని, తర్వాత చెరువులు, వాగులు, కాల్వల వెంట మొక్కలు నాటాలని ఆదేశించారు. నెలలో ఒక వారం పారిశుద్ధ్యం, ఇంకుడుగుంతలు, శిథిలమైన ఇండ్లు తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మిషన్ భగీరథను 99 శాతం పూర్తిచేసిందని, అయినా ప్రజలు బబుల్ వాటర్ తాగడానికి మొగ్గు చూపుతున్నారని, భగీరథ నీరు ఎంత స్వచ్ఛమైనదో, ఆరోగ్యానికి ఎంత మేలో ప్రజలకు కళాజాతాల ద్వారా వివరించాలని సూచించారు. అనంతరం తంగళ్లపల్లికి చెందిన ఆకుల వెంకటేశం, నేరెళ్లకు చెందిన చందర్‌కు రూ.80వేల విలువైన జూపిటర్ ట్రైవీలర్ వాహనాలను సొంత ఖర్చులతో అందజేసిన మంత్రి కేటీఆర్ మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

### బతుకమ్మ చీరలు మంచిగున్నయ్

సమీక్ష అనంతరం మంత్రి కేటీఆర్ తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామాన్ని సందర్శించారు. 30 రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. 'ఎల్లయ్య నీ ఆరోగ్యం బాగుందా.. ఊరు సాపయిందా' అంటూ స్థానికులను ఆప్యాయంగా పలుకరించారు. గ్రామస్థులతో ముచ్చటించి ప్రణాళికపై వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. ఊరిలో గటార్లు, రోడ్లు, వాడలను శుభ్రం చేసుకున్నామని పలువురు తెలుపగా మంత్రి సంతోషం వ్యక్తంచేశారు. 'ఈ ఏడాది బతుకమ్మ చీరలు ఎట్లున్నయ్' అంటూ మహిళలను మంత్రి అడుగగా, అందుకు నక్క అమృత ముందుకు వచ్చి మరీ 'సర్కారు ఇచ్చిన చీరలు మంచిగున్నయ్. వాటిని కట్టుకొనే బతుకమ్మ ఆడుకున్నం' అంటూ మురిసిపోయారు.

### డోంట్ వర్రీ నేనున్నా..

మండేపల్లిని సందర్శించిన మంత్రి కేటీఆర్‌ను గ్రామస్థుడు దారవేణి చంద్రయ్య కలిసి తన గోడు వెళ్లబోసుకొన్నారు. రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతిన్నదని, చికిత్స చేయించుకొనే ఆర్థిక స్తోమత లేదని, పని చేసుకొంటనే పొట్ట గడుస్తున్నదని విన్నవించుకొన్నారు. కేటీఆర్ బాధితుడిని దగ్గరకు తీసుకొని 'డోంట్ వర్రీ నీకు నేనున్నా' అంటూ భరోసా ఇచ్చారు. చికిత్స చేయించి ఆదుకొంటానని హామీ ఇచ్చారు.

## ఎగువన ఎండమావేనా?

- ఈ ఏడాదీ గోదావరి నీటికోసం తప్పని ఎదురుచూపులు
- జైక్వాడ్‌కు 121, ఎస్సారెస్పీలోకి 75 టీఎంసీలు మాత్రమే ఇన్‌ఫ్లో
- దిగువన లక్షల క్యూసెక్కులు సముద్రం పాలు
- కృష్ణా బేసిన్‌లో మళ్లీ మొదలైన ఇన్‌ఫ్లోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ ఏడాది అంచనాలకుమించి కురుస్తున్న వర్షాలతో దేశవ్యాప్తంగా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. కృష్ణాబేసిన్‌కు దశాబ్దం తర్వాత జలకళ వచ్చింది. గోదావరి ఉపనదుల్లోనూ భారీఇన్‌ఫ్లోలు నమోదవుతున్నాయి. ఇంతటి అనుకూల పరిస్థితుల్లోనూ ప్రధానగోదావరిలో వరద ఎండమావిగానే మారింది. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీనుంచి ఇప్పటివరకు ప్రధాన గోదావరి మొదలు దిగువన ధవళేశ్వరం వరకు నమోదైన ఇన్‌ఫ్లోలు పరిశీలిస్తే విచిత్రమైన పరిస్థితి కనిపిస్తున్నది. ప్రధాన గోదావరిపై మహారాష్ట్ర నిర్మించిన జైక్వాడ్ ప్రాజెక్టుకు ఈ ఏడాది ఇప్పటివరకు వచ్చిన వరద 121 టీఎంసీలు మాత్రమే. శ్రీరాంసాగర్‌కు వచ్చింది 75 టీఎంసీలే. శ్రీరాంసాగర్ దిగువన కడెం నుంచి కొంత ఆశాజనకమైన వరద ఉండగా.. ప్రాణహిత కలిసిన తర్వాత గోదావరి ప్రాణం వచ్చింది. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా కాళేశ్వరం మీదుగా వేల టీఎంసీల వరద ఉన్నది. ఆపై ఇంద్రావతి, దిగువన శబరి వంటి ప్రధాన ఉపనదులు తోడై మరింత ఉగ్రరూపం దాల్చింది. ఈ క్రమంలోనే తాజా నీటి సంవత్సరంలో ఇప్పటివరకు ఏకంగా 3,522.34 టీఎంసీల గోదావరిజలాలు సముద్రంలో కలిశాయి. ఇందులో ప్రధానంగా ప్రాణహిత నుంచి అత్యధికంగా వచ్చాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు. బుధవారం కూడా శ్రీరాంసాగర్‌కు కేవలం 8170 క్యూసెక్కుల వరద మాత్రమే నమోదవగా... పేరూరు దగ్గర ఏకంగా లక్షన్నర క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం ఉంది.

#### శ్రీశైలానికి పెరిగిన వరద

కృష్ణాబేసిన్‌లో మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి, నారాయణపుర జలాశయాలకు 20 వేల నుంచి 25 వేల క్యూసెక్కుల వరద ఉండగా.. తుంగభద్ర నుంచి కూడా 25-30 వేల క్యూసెక్కులు నమోదవుతున్నది. జూరాల జలాశయం నుంచి దిగువకు 50-60వేల క్యూసెక్కుల వరకు వస్తుండగా.. తుంగభద్ర నుంచి క్యూసెక్కుల వరకు తోడవుతుంది. దీంతో శ్రీశైలం జలాశయానికి బుధవారం లక్ష క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో నమోదయింది. సాగర్ ప్రస్తుతం పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉండటంతో బుధవారం అధికారులు రెండు గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా దిగువకు నీటిని విడుదలచేశారు.

## నేడు కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లో తెలుగు రాష్ట్రాల నీటి వినియోగం లెక్కల్ని తేల్చేందుకు కృష్ణాబోర్డు రెండురాష్ట్రాల ఇంజినీర్లతో సమావేశం కానుంది. ఈ మేరకు గురువారం జలసౌధలోని బోర్డు కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు రెండు రాష్ట్రాలు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి ఇండెంట్లు సమర్పించడం, బోర్డు నీటి విడుదల ఉత్తర్వులు జారీ చేయడం.. అవసరానికి అనుగుణంగా రాష్ట్రాలు నీటిని వినియోగించుకుంటున్నాయి. అయితే ఏ ప్రాజెక్టు నుంచి ఎంతమేర వాడుకున్నారు? ముఖ్యంగా వాస్తవ డిశ్చార్జి, అధికారిక లెక్కల్లో నమోదవుతున్న వాటి మధ్య తేడా ఎందుకొస్తుంది? అనే అంశాలపై చర్చించనున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న కాంగ్రెస్

- హుజూర్‌నగర్‌లో దేవాలయాలు, చర్చిల్లో ఎన్నికల ప్రచారం
- కాంగ్రెస్‌పై ఎన్నికల సంఘానికి టీఆర్ఎస్ ఫిర్యాదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నదని ఎన్నికల సంఘానికి టీఆర్ఎస్ ఫిర్యాదు చేసింది. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రజత్‌కుమార్‌కు టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు దండె విఠల్‌లు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ దేవాలయాలు, చర్చిలో ప్రచారం చేస్తున్నారని, ఇతర పార్టీ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని వారు ఫిర్యాదు చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని రేవూరు ముదిరాజ్ దేవాలయానికి పీసీసీ అధ్యక్షులు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెయిన్ సిమెంట్ కంపెనీ ద్వారా రూ.3లక్షల చెక్కు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మఠంపల్లి మండలం బీమలత తండాలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పద్మావతి రెడ్డి ఎన్నికల ప్రచారం చేశారని, ఇతర పార్టీలకు చెందిన వ్యక్తులకు కాంగ్రెస్ కండువా కప్పారని ఫిర్యాదు చేశారు. నేరేడుచర్ల మండలం దర్శించెర్ల గ్రామంలోని తెలుగు బాపిస్టు చర్చిలో పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారంచేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్చి ప్రాంగణంలో ఫాదర్లు, చర్చి సభ్యులతో ఉత్తమ్ సమావేశమై పలు హామీలు ఇచ్చారని తెలిపారు.

## అటవీశాఖ అధికారుల బదిలీలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** అటవీశాఖలో పలువురు అధికారులను బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కవ్వాల్ అభయారణ్యం పరిధి కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ ఎం రాజారమణారెడ్డిని హైదరాబాద్‌లోని విజిలెన్స్ డీఎఫ్‌వోగా బదిలీచేశారు. ఆయన స్థానంలో ఉట్నూరు ఎఫ్‌డీవో ఎం విజయ్‌కుమార్‌ను నియమించారు. ఖానాపూర్ ఎఫ్‌డీవో తిరుమలరావును పాల్వంచకు, పాల్వంచలోని ఎఫ్‌డీవో ఎస్ సుజాతను వరంగల్ జెనెటిస్ట్ విభాగానికి బదిలీ చేశారు.

# యాసంగికి 7.77 లక్షల టన్నుల యూరియా!

- సరఫరా కోసం కేంద్రానికి మంత్రి నిరంజన్‌రెడ్డి వినతి
- అక్టోబర్‌లో కేటాయించిన యూరియాను 20లోగా పంపాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాసంగి సీజన్‌లో రైతుల అవసరాలు తీర్చడానికి 7.77 లక్షల టన్నుల యూరియాను కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రి సదానంద గౌడను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది వానకాలం సీజన్ ఆలస్యమైందని.. ఆ తర్వాత వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగునీటి ప్రాజెక్టులు నిండి సాగువిస్తీర్ణం పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 1.10 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని వివరించారు. వరి, ఇతర ప్రధాన పంటలు సాధారణం కం టే.. 132 శాతం వరకు సాగు నమోదయినట్లు చెప్పారు. యాసంగిలో ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. ప్రాజెక్టులు, చెరువులు బాగా నిండటంతో యాసంగి సీజన్‌లో ఎరువుల వినియోగం మరింత ఎక్కువగా ఉండవచ్చని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గతంలో విజ్ఞప్తి చేసిన మేరకు 7.7 లక్షల టన్నుల యూరియా కేటాయించాలని కోరారు. దీంతోపాటు అక్టోబర్ నెలకు కేటాయించిన 1.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఈనెల 20 లోగా పంపించాలని విజ్ఞప్తిచేశారు. సెప్టెంబర్ నెలకు సరిపడా ఎరువులను సరఫరాచేసినందుకు కేంద్రమంత్రికి నిరంజన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



బుధవారం ఢిల్లీలో కేంద్ర ఎరువులశాఖ మంత్రి సదానంద గౌడను సన్మానిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఆ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఉన్నారు.

7.7 లక్షల టన్నుల యూరియా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం స్పందించి ఇప్పటివరకు ఏడు లక్షల టన్నుల యూరియాను కేటాయించింది. దిగుమతి చేసుకొన్న యూరియా కాకుండా.. స్థానికంగా తయారైన యూరియా సరఫరాచేయాలని మంత్రి కేంద్ర మంత్రి సదానందగౌడను కోరారు.

#### 2020 నాటికి రామగుండం ట్రయల్‌రన్ ప్రారంభం: కేంద్రమంత్రి సదానందగౌడ

మార్చి 2020 వరకు రామగుండం ఎరువుల కర్మాగారం ట్రయల్‌రన్ అవుతుందని.. ఆ తర్వాత వానకాలం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు అక్కడి నుంచే ఎరువులు సరఫరా చేస్తామని కేంద్రమంత్రి సదానందగౌడ హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రప్రభుత్వం ఎరువులను సరఫరాచేసేందుకు సిద్ధంగా ఉన్నదని చెప్పారు. కేంద్రమంత్రిని కలిసినవారిలో వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, అదనపు సంచాలకుడు విజయ్‌కుమార్ ఉన్నారు.

# రోడ్డుపై రయ్.. రయ్

మొదటిపేజీ తరువాయి...

సమాచారమిస్తే అక్కడికి మరో వాహనాన్ని పంపిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ఆర్టీసీ అద్దె బస్సులకు డ్రైవర్లను నియమించడంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అనుభవం, హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నవారికి బస్సులు అప్పగిస్తున్నారు. దీంతో ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతున్నారు. పండుగ సమయంలో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగినా.. ప్రభుత్వం కావాల్సిన మేరకు వాహనాలను తిప్పడంతో రవాణాకు ఆటంకం కలుగలేదు. దసరా రోజు కూడా 1448 ఆర్టీసీ బస్సులు డిపోల నుంచి బయటకు వచ్చాయి. బుధవారం 3 వేలకుపైగా బస్సులు నడిపించారు. పండుగల అనంతరం తిరుగుప్రయాణమయ్యేవారి కోసం కూడా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లను చేసింది. హైదరాబాద్‌తో పాటు ఆయా ప్రాంతాలకు వచ్చేవారి కోసం జిల్లా, డివిజన్ల నుంచి మరిన్ని వాహనాలను ఏర్పాటుచేస్తున్నారు. ఆర్టీసీ నడిపే బస్సులకు రెండింతలుగా ప్రైవేట్ వాహనాలను నడిపించనున్నారు.

### రోజువారీగా తిరిగిన వాహనాలు

| తేదీ | ఆర్టీసీ బస్సులు | ఇతర వాహనాలు | మొత్తం |
|---|---|---|---|
| అక్టోబర్ 5 | 2,386 | 7,144 | 9,530 |
| అక్టోబర్ 6 | 3,284 | 7,754 | 11,038 |
| అక్టోబర్ 7 | 2,746 | 5,055 | 7,801 |
| అక్టోబర్ 8 | 1,448 | 3,447 | 4,895 |
| అక్టోబర్ 9 | 3,013 | 5,137 | 8,150 |



వరంగల్ హన్మకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

## ప్రతి బస్సులో టికెట్ ధరల పట్టిక

- అన్ని డిపోల్లో డీఎస్పీ ఇంచార్జిగా కంట్రోల్ రూం
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పువ్వాడ, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా వాహనాలను నడుపుతున్నామని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ స్పష్టంచేశారు. బుధవారం సాయంత్రం రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మతోపాటు డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. సమ్మె జరుగుతున్నప్పటికీ 50% నుంచి 60% బస్సులు నడుస్తున్నాయన్నారు. కొన్ని చోట్ల టికెట్ రేట్ కంటే ఎక్కువ ధర తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, టికెట్ కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువ ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు. దీన్ని నియంత్రించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నామని, ప్రతి బస్సులో ఆయా రూట్లలో ఉండే చార్జీల పట్టికను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రతి డిపోలో కంట్రోల్ రూం ఏర్పాటుచేసి డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారిని ఇంచార్జీగా నియమిస్తున్నట్లు చెప్పారు. బస్సుల్లో డ్రైవర్ సీటు వెనుకాల చార్జీల పట్టిక.. దాని కింద ఆయా కంట్రోల్ రూంల నంబర్లను కూడా ప్రదర్శిస్తామన్నారు. టికెట్ ధర కంటే ఎక్కువ చార్జీ తీసుకుంటే ఆ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి పువ్వాడ వివరించారు. ఈ నెల 14 నుంచి విద్యాసంస్థలు కూడా ప్రారంభం కానుండటంతో.. షెడ్యూల్ ప్రకారం బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. ప్రతి డిపోలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ముందు ఎలాంటి టూర్ షెడ్యూల్ ఉండేదో అదే షెడ్యూల్‌ను శుక్రవారం నుంచి అమలుచేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ బస్సులన్నింటా విద్యార్థులు, వికలాంగులు, పాత్రికేయులు, ఉద్యోగులతో పాటు బస్‌పాసులన్నీ అనుమతించాలని మంత్రి ఆదేశించారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశంతో ఆయా శాఖల అధికారులు సంయుక్తంగా ప్రజారవాణా స్థితిగతులన్నీ పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకొంటున్నారని చెప్పారు. రైల్వే అధికారులు కూడా ప్రత్యేకంగా మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలను పెంచారని, అన్ని శాఖల సహకారంతో సమ్మె ప్రభావం లేకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి పువ్వాడ వివరించారు. పోలీస్ శాఖ సహాయంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నామని రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ తెలిపారు. ప్రభుత్వం విధించిన గడువులోగా విధుల్లోకి చేరని సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులతో సమన్వయం చేసుకొంటూ బస్‌డిపోలు, బస్టాండ్ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీసు అధికారులను డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. ప్రయాణికుల రక్షణకు సంబంధించి ఏ చిన్న ఘటన జరిగినా ఎఫ్ఐఆర్‌నమోదుచేయాలని పేర్కొన్నారు.



ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

## సమ్మె జీతాల కోసం కాదు

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమ్మె ముఖ్య ఉద్దేశం జీతభత్యాలు కాదని, ఆర్టీసీని బతికించుకోవడమే లక్ష్యమని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. తాము చేస్తున్న సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలతోపాటు, ఉద్యోగసంఘాల నేతలు కూడా మద్దతునివ్వాలని కోరారు. ఆర్టీసీ సమ్మెలో భాగంగా త్వరలో తెలంగాణ బంద్‌కు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మె భవిష్యత్ కార్యాచరణపై బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా సమ్మె నోటీస్ ఇచ్చి నిబంధనల ప్రకారమే సమ్మె చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, బీసీ నేత ఆర్ కృష్ణయ్య, ఆయా రాజకీయపార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## 'సైరా'కు గవర్నర్ అభినందనలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితచరిత్ర ఆధారంగా నిర్మించిన 'సైరా' చిత్రాన్ని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తిలకించారు. సినిమా హీరో మెగాస్టార్ చిరంజీవి కోరిక మేరకు గవర్నర్ తన కుటుంబసభ్యులతో సినిమా చూశారు. గవర్నర్ కోసం ప్రసాద్‌ల్యాబ్‌లో ప్రత్యేకషోను ఏర్పాటు చేశారు. గవర్నర్‌తోపాటు చిరంజీవి, కాస్ట్యూమ్ డిజైనర్ సుష్మిత హాజరయ్యారు. గొప్ప చరిత్రకారుడు, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను వెలుగులోకి తెచ్చి నేటితరానికి అందించిన చిత్రబృందాన్ని గవర్నర్ అభినందించారు. చిరంజీవి నటన బాగుందని, నరసింహారెడ్డి పాత్రకు జీవం పోశారని అన్నారు. సినిమాను తిలకించినందుకు చిరంజీవి గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రసాద్‌ల్యాబ్‌లో సైరా సినిమాను చూసేందుకు వచ్చిన గవర్నర్ తమిళిసై కుటుంబసభ్యులతో సినీనటుడు చిరంజీవి

## చట్టసభల కంప్యూటరీకరణపై స్పీకర్ల కమిటీ

- ఏడుగురు సభ్యులతో ఏర్పాటుచేసిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా
- సభ్యుడిగా తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- కమిటీ చైర్మన్‌గా అసోం స్పీకర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చట్టసభల కంప్యూటరీకరణపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఏడుగురు అసెంబ్లీ స్పీకర్లతో కమిటీని నియమించారు. ఈ కమిటీలో తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి స్థానం కల్పించారు. అసోం స్పీకర్ హితేంద్రనాథ్ గోస్వామి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో.. పోచారంతోపాటు ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా, పాండిచ్చేరి స్పీకర్లు సభ్యులుగా ఉన్నారు. కమిటీ త్వరలో ఢిల్లీలో లేదా అసోంలో సమావేశమవుతుందని తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నర్సింహాచార్యులు తెలిపారు. ఇప్పటికే అన్ని చట్టసభల కంప్యూటరీకరణ జరిగినప్పటికీ ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు ఈ కమిటీ నివేదిక దోహదం చేయనున్నది. శాసనసభల పనితీరును ఏ విధంగా మెరుగుపర్చవచ్చు, సభ్యులకు ఏవిధంగా మెరుగైన సేవలు అందించవచ్చు అనే అంశాలను ఈ కమిటీ అధ్యయనం చేయనున్నది. దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని రూపొందించేందుకు ఈ కమిటీ తగిన సలహాలు, సూచనలు ఇవ్వనున్నది. ఈ సూచనలను అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు, పార్లమెంట్ ఉభయసభల్లోనూ అమలుచేయనున్నారు. సభ్యులకు ప్రశ్నలకు సమాధానాలు, చర్చలు, సభ్యులకు అవసరమైన సమాచారాన్ని మొత్తాన్ని ఐటీ ద్వారా అందించడంతో వారి సమయాన్ని ఆదా చేయవచ్చని నిర్ణయించారు. కమిటీ దేశవ్యాప్తంగా పర్యటించి అసెంబ్లీ ప్రత్యక్షప్రసారాలు, బులెటిన్ విడుదల, ప్రశ్నలకు సమాధానాలు తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వనున్నారు.



# పాతబట్టలతో కొత్త సంచులు

- మోడ్రన్ డిజైన్లతో ఆకర్షణ
- ప్లాస్టిక్ నియంత్రణకు 'చేతి సంచి'
- ఉచితంగా కుట్టించేందుకు బాధ్యత ఫౌండేషన్, నిర్మాణ్ సంస్థలు సిద్ధం

**శిరందాస్ ప్రవీణ్‌కుమార్. హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**



డ్రెస్సులతో సంచులు కుడుతున్న సంస్థ సభ్యులు

సాధారణంగా ఇంట్లో పాతబట్టలుంటే ఏంచేస్తాం.. నిన్నమొన్నటి కాలంలో అయితే.. ఇంటిముందుకు వచ్చి.. కొత్త గిన్నెలిచ్చి.. పాతబట్టలు తీసుకుపోయేవారు. ఇప్పుడు అలా వచ్చేవాళ్లు కరువయ్యారు. సగటు ఉన్నత మధ్యతరగతి, సంపన్న వర్గాల ఇండ్లల్లో గుట్టలు గుట్టలుగా పాతబట్టలు పేరుకుపోతూ ఉంటాయి. వీటిని ఏం చేయాలో తోచదు. బయట పడేయడానికి మనసొప్పదు. ఎవరికైనా ఇద్దామన్నా తీసుకొనే వాళ్లు దాదాపుగా ఉండరు. ఇలాంటి బట్టలను వృథాచేయకుండా.. పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా.. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే లక్ష్యంతో బాధ్యత ఫౌండేషన్, నిర్మాణ్ సంస్థలు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇంట్లో పాతబట్టలతో కొత్త సంచులను కొత్త నమూనాలతో తయారుచేసి ఇచ్చే కార్యక్రమాన్ని ఈ రెండు సంస్థలు ప్రారంభించాయి. బట్ట సంచులను వాడటం ద్వారా సమాజానికి ఎంతోమేలుచేయగలమని ఈ సంస్థల ప్రతినిధులు చెప్తున్నారు.



డ్రెస్సులతో కుట్టిన సంచులు

### పర్యావరణ రక్షణ

ఇండ్లలో ఉండే పాత శాలువాలు, చీరెలు, డ్రెస్‌లు, టీషర్టులు, ప్యాంట్లు ఏవైనా సరే.. వాటిని తీసుకొస్తే వాటితో కొత్త సంచులను కుట్టి ఇచ్చే పనిని బాధ్యతా ఫౌండేషన్, నిర్మాణ్ సంస్థలు చేపట్టాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్ (బాధ్యత ఫౌండేషన్ చంద్రశేఖర్–8008424344, నిర్మాణ్ సంస్థ (ప్రసాద్ 9100444093) చేసి సమయాన్ని రిజర్వ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం సికింద్రాబాద్ అడ్డగుట్ట, బోరబండ ప్రాంతాల్లో ఇందుకోసం ఏర్పాట్లుచేశారు. త్వరలోనే మరిన్ని కేంద్రాలను నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నారు. డ్రెస్సులతో అందమైన సంచులుగా తయారుచేస్తున్నారు. పాత వస్త్రాలని ఎవరూ గుర్తించరు. కొత్త నమూనాలతో సంచులకు సరికొత్త రూపు తీసుకొస్తున్నారు. వాటిని పట్టుకొని మార్కెట్‌కి వెళ్తే స్పెషల్ అట్రాక్షన్‌గా ఉంటున్నాయి. మొదటి సంచిని మాత్రం ఉచితంగానే కుట్టిస్తారు. రెండోసంచీ నుంచి రూ.20 వరకు చార్జీ చేస్తున్నారు. సమాజంలో బట్ట సంచీ విలువను తెలిపేందుకే ఈ ప్రక్రియకు శ్రీకారంచుట్టారు.

### వినియోగమే గొప్ప

20 ఏండ్ల క్రితం.. కిరాణా సామానుకెళ్తే ఓ సంచి.. వంటనూనె కోసం వెళ్తే స్టీలు క్యాను.. మటన్/చికెన్‌కు వెళ్తే గిన్నె, బాక్సు.. బియ్యానికి వెళ్తే బస్తా.. ఇలా ఎక్కడికి వెళ్లినా చేతిలో సంచి ఉండేది. ఇప్పుడేమో అది నామోషీగా మారింది. భుజాన సంచి వేసుకెళ్తే పాతకాలం మనుషులనుకుంటారన్న కలవరం. ఎక్కడికి వెళ్లినా చేతులు ఊపుకుంటూ వెళ్తున్నారు. ఇంటికి వస్తూ ప్లాస్టిక్ కవర్లను మోసుకొస్తున్నారు. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు.. చాక్లెట్ నుంచి హోటల్ నుంచి తెచ్చే పార్శిళ్ల వరకు ఎన్ని ప్లాస్టిక్ కవర్లు తీసుకొస్తున్నారో లెక్కించండి. ఏదైనా ఊరికెళ్తే.. ఎన్ని నీళ్ల ప్యాకెట్లు/బాటిళ్లు కొంటున్నాం? వాటిని ఎక్కడ పడేస్తున్నాం? వాటి వల్ల పర్యావరణానికి ఎంత హాని కలుగుతున్నది? ఇవి నాలాల్లో, కాల్వల్లో చిక్కుకొని ఎంతటి ప్రమాదానికి కారణమవుతున్నాయి! వాటిని తింటూ ఎన్ని ప్రాణులు విలవిల్లాడుతున్నాయి? యాంత్రిక జీవనంలో ఒక్క చేతి సంచిని మర్చిపోవడం వల్ల చేజేతులా అనర్థాన్ని 'కొని'తెచ్చుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ఎన్ని కార్యక్రమాలు అమలుచేసినా మనలో మార్పు రాకుంటే ప్రయోజనం శూన్యం.

### ఇలా చేద్దాం!

- ప్రపంచంలో నిమిషానికి 10 లక్షల ప్లాస్టిక్ బాటిళ్లు కొంటున్నారు. సంచిలో ఒక రాగి బాటిల్ ఉంటే బయట ప్లాస్టిక్ బాటిల్ కొనే బాధ తప్పుతుంది.
- చాట్, టిఫిన్ వంటి చిరుతిండి కోసం ప్లాస్టిక్ చెంచాలనే వినియోగిస్తున్నారు. సంచిలో ఓ చెంచా ఉంటే బాగుంటుంది.
- పండ్ల రసాలు తాగేందుకు స్ట్రాలు, ప్లాస్టిక్ గ్లాసులు. కొబ్బరిబోండాలు తాగాలంటే ప్లాస్టిక్ స్ట్రాలే వాడుతున్నారు. ఏటా దేశంలో 4 వేల కోట్ల స్ట్రాలు వృథాగా పడేస్తున్నారు. చేతి సంచిలో ఒక గ్లాసు ఉంటే వృథాను అరికట్టొచ్చు.
- ప్రపంచవ్యాప్తంగా నిమిషానికి పది లక్షల ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. చేతిలో సంచి ఉంటే ఈ వృథాను నియంత్రించవచ్చు.
- ఎవరైనా ఇంటికొస్తే ఓ బట్ట సంచిని బహుకరించాలి. ఆ సమయంలోనే కుట్టినట్లుగా కనిపిస్తే కష్టపడి కుట్టిచ్చారన్న కృతజ్ఞత వ్యక్తమవుతుంది. దాంతో తప్పక వినియోగిస్తారు.
- ఇంటికి దంపతులు లేదా మహిళలొస్తే పసుపు, కుంకుమ ఇవ్వడం ఆనవాయితీ. అలాగే బ్లౌజ్‌పీసు పెడతారు. దానికి బదులుగా బట్ట సంచిని ఇవ్వాలి.
- ఇంట్లో పాత దుస్తులను పడేయకుండా వాటితో సంచులను కుట్టించి పంచి పెట్టాలి. కాస్త డిజైన్‌తో కుట్టిస్తే అద్భుతంగా ఉన్నాయంటూ స్వీకరిస్తారు.
- ప్రకృతిని బాధించి పూజించడం ద్వారా పుణ్యంరాదు. మంచి సమాజం కోసం ప్లాస్టిక్‌ను నియంత్రించాలని ప్రచారం చేయాలి.
- పుట్టిన రోజుకు చాక్లెట్లకు బదులుగా సంచులే పంపిణీ చేయండి. ప్రకృతిని కాపాడుకునేందుకు మంచిని ప్రబోధించే కొత్త ఆచారాన్ని ప్రారంభించాలి.

### వస్త్రాల్లోనూ సింథటిక్



చాలా వస్త్రాలు సింథటిక్‌తో తయారైనవే. వాటితోనూ డేంజరే. వాటిని పునర్వియోగిస్తే మనకు, సమాజానికి మేలు కలుగుతుంది. బట్ట సంచీ చాలా ఏండ్లు వాడొచ్చు. ఒక్కో సంచి దాదాపు ఐదేండ్లు ఉంటుంది. తద్వారా ప్లాస్టిక్ కవర్లకు చేసే ఖర్చును సుమారు రూ.5 వేలు ఆదా చేయొచ్చు. ఒక్క సంచీని ఉచితంగా కుట్టించుకోవడం ద్వారా ఎంతో మేలు కలుగుతుంది. సమాజానికి మేలుకొలుపు పలికినట్లు అవుతుంది. బహుమతులుగా పంపిణీ చేయడం ద్వారా ఉన్నతంగా నిలవొచ్చు. ప్రస్తుతం ఏది ధరిస్తే అదే ఫ్యాషన్‌గా నిలుస్తుంది. యువత కూడా వారి డ్రెస్సులకు తగ్గట్లుగా మోడ్రన్ బ్యాగులను ధరించి తోటివారికి స్ఫూర్తిదాయకంగా నిలవొచ్చు. స్కూళ్లు, కాలేజీలు, కార్యాలయాలు, కంపెనీలు, ఐటీ కంపెనీలు ఈ మోడ్రన్ బ్యాగుల వినియోగానికి ముందుకు రావాలి. ఎన్జీవోలు కూడా పాత డ్రెస్సులను సంచులుగా కుట్టించేందుకు ముందుకు రావాలి.

- పైడిమర్రి చంద్రశేఖర్, బాధ్యతా ఫౌండేషన్

### ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్‌గా చేపట్టాం



ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడేందుకు మా వంతు కృషి. పాత డ్రెస్సులతో సంచులు కుట్టించే ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. మేం ఎంటర్‌ప్రెన్యూర్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద చేపట్టాం. ప్రజల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడటం వల్ల వచ్చే అనర్థాలను ప్రచారంచేస్తూనే ఈ మోడ్రన్ ఫ్యాషన్ వైపు అడుగేయాలని కోరుతున్నాం. మొదటి సంచీని ఉచితంగా కుట్టిస్తున్నాం. ఆ తర్వాత సంచులు కుట్టేందుకు రూ.20 వంతున తీసుకుంటాం. సంపన్న వర్గాలు, ఎగువ మధ్య తరగతి వర్గాల ఇళ్లల్లో చాలా డ్రెస్సులు వృథాగా ఉంటాయి. వాటితో సమాజ సేవకు శ్రీకారం చుట్టొచ్చు. కాస్త సమయం, డబ్బు ఖర్చుచేస్తే సంచులుగా మారుతాయి. ఏ మార్కెట్లలోనైనా ఉచితంగా పంపిణీ చేయొచ్చు.

- ప్రసాద్, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ



బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర పసుపు రైతుల సంఘం ప్రతినిధులు

## కేంద్రం దృష్టికి పసుపు రైతుల సమస్య

- పరిష్కారానికి కృషిచేస్తా
- రాష్ట్ర పసుపు రైతుల సంఘం ప్రతినిధులతో గవర్నర్ తమిళిసై

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** రాష్ట్రంలో పసుపు రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. బుధవారం రాజ్‌భవన్‌లో పసుపు రైతుల సంఘం ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా ఆమెను పసుపురైతు సంఘం ప్రతినిధులు సత్కరించారు. కనీస మద్దతుధర, పసుపు బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని కోరినట్లు పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు కోటపాటి నరసింహంనాయుడు అనంతరం మీడియాకు తెలిపారు. పసుపు రైతులు, గల్ఫ్ బాధితులపై ప్రచురించిన పుస్తకాలను గవర్నర్‌కు అందజేశామని వివరించారు. పసుపు రైతుల సమస్యలు తమకు తెలుసునని వాటి పరిష్కారానికి తాను కృషిచేస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు నరసింహంనాయుడు వెల్లడించారు. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే పసుపులో 80 శాతం భారతదేశంలోనే పండుతుందని.. అందులోనూ తెలంగాణ, ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో అత్యధికంగా పండుతుందని గవర్నర్‌కు వివరించామని పేర్కొన్నారు. 2010 డిసెంబర్‌లో క్వింటాల్‌కు రూ.18వేల ధర పలికిన పసుపు 2019లో రూ.4,500 కు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్‌ను కలిసినవారిలో నిజామాబాద్ జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షులు పీ తిరుపతిరెడ్డి, నందిపేట పసుపు రైతుల సంఘం అధ్యక్షుడు నాగలింగం, ఆర్మూర్ పసుపు రైతుల సంఘం అధ్యక్షులు నక్కల చిన్నారెడ్డి, పసుపు రైతుల సంఘం రాష్ట్ర సలహాదారు హన్మాండ్లు , ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమసంఘం సలహాదారులు బాలయ్య , ప్రభాకర్, సామేందర్ ఉన్నారు.

## కొనసాగిన ఆర్మీ ర్యాలీ

**కరీంనగర్ స్పోర్ట్స్:** కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కొనసాగుతున్నది. మూడోరోజైన బుధవారం జనరల్ డ్యూటీ విభాగంలో యువకులకు అర్హత పరీక్షలు నిర్వహించారు. తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రారంభమైన నియామక ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. జనరల్ డ్యూటీ విభాగంలో ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో 4,620 మంది దరఖాస్తుచేసుకోగా.. సుమారు 3,500 మంది యువకులు ర్యాలీకి హాజరయ్యారు. తొలుత అడ్మిట్ కార్డులను పరిశీలించిన ఆర్మీ సిబ్బంది యువకులకు 1.6 కిలోమీటర్ల పరుగుపందెం, అందులో అర్హత సాధించినవారికి ఇతర శారీరకసామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ధ్రువపత్రాలను పరిశీలించారు. అన్ని అంశాల్లో అర్హత సాధించిన అభ్యర్థులను వైద్యపరీక్షలకు ఎంపికచేశారు.



పుల్‌అప్స్ చేస్తున్న యువకులు

## జాతీయ వెదురు మిషన్ కమిటీలో మార్పు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జాతీయ వెదురుమిషన్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలుచేసేందుకు నెలకొల్పిన రాష్ట్రస్థాయి కమిటీ లో ప్రభుత్వం మార్పులుచేసింది. ఈ మేరకు బుధవారం వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి ఉత్తర్వులు జారీచేశారు. వీటి ప్రకారం.. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, ఉద్యానశాఖ కమిషనర్ సెక్రటరీగా, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమల, గిరిజన సంక్షేమశాఖల కమిషనర్లు, అటవీశాఖశాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, ఫైనాన్స్ డి ప్యూటీ సెక్రటరీ, కేంద్ర వ్యవసాయశాఖ నామినీ, మరో ఇద్దరు వస్తు ఉత్పత్తి నిపుణులు, వెదురు సొసైటీ తెలంగాణ, ఏపీ చాప్టర్ల చైర్మన్లు ఆర్కే మిత్రా, కే విజయకుమార్ సభ్యులుగా వ్యవహరించనున్నారు.

## మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మద్యం దుకాణాల టెండర్లకు బుధవారం నుం చి దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో సర్కార్ నూతన మద్యం విధానం ప్రకటించిన విషయం తెలిసిందే. నూతన మద్యం పాలసీపై బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 16 వరకు కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు వారు ఏ ప్రాంతంలో మద్యం దుకాణానికి టెండర్ వేయాలనుకుంటున్నారో ఆ పరిధిలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం లేదా డివిజినల్ కార్యాలయంలో పూర్తిచేసిన దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. నాన్ రిఫండబుల్ ఫీజు కింద రూ.2లక్షలు డీడీ చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తు సమర్పించినవారికి ఒక టోకెన్ నంబర్ కేటాయిస్తారు. లక్కీడ్రాలో ఎవ రి నంబర్ వస్తే వారికి టెండర్ వచ్చినట్టుగా ప్రకటిస్తారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన తర్వాత ఈ నెల 18న ఆయా జిల్లాల కలెక్టర్ల సమక్షంలో లక్కీడ్రా తీయనున్నట్టు అధికారులు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో తొలిరోజైన బుధవారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్‌శాఖ అధికారులు చెప్పారు.

### రాష్ట్రంలో 34 రిటైల్ అప్లికేషన్ సెంటర్లు: సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 34 రిటైల్ వైన్‌షాప్‌ల అప్లికేషన్ సెంటర్లు ఏర్పాటుచేసినట్టు ఆబ్కారీశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆబ్కారీ భవన్‌లో ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రిటైల్‌షాప్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో దరఖాస్తులను తీసుకోవడానికి ఏర్పాటుచేసిన సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్లతో ఫోన్‌లో మాట్లాడారు. టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆబ్కారి భవన్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్‌ను మంత్రి పరిశీలించారు. ఆబ్కారి శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తగా ఉండాలని, పారదర్శకంగా సేవలు అందించాలని మంత్రి అధికారులను కోరారు.



బుధవారం అబ్కారీభవన్‌లో ఎక్సైజ్‌శాఖ అధికారులతో సమావేశమైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## పామాయిల్ నర్సరీలు.. యూనిట్లు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పామాయిల్ రైతులకు శిక్షణకోసం పామ్‌నర్సరీ, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. నిర్మల్ జిల్లా కడెంలోని వ్యవసాయ విత్తనక్షేత్రం, మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని ఉద్యానక్షేత్రాన్ని తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ ఆయిల్ సీడ్ గ్రోయర్స్ ఫెడరేషన్‌కు అప్పగిస్తూ బుధవారం వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. కడెంలో ఆయిల్ పామ్‌నర్సరీ, జైపూర్‌లో పామ్‌నర్సరీ, ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేయనున్నారు.

## పండగ వేళ విషాదం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 9 మంది దుర్మరణం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** పండుగ వేళ పలు జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు విషాదం నింపాయి. మంగళ, బుధవారాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో రాష్ట్రంలో 9మంది దుర్మరణం పాలయ్యారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పామనగుండ్ల వద్ద బైకును కారు ఢీకొనడంతో చెర్వుగట్టుకు చెందిన కోకా పరమేశ్(30), భార్య అనిత(28) దుర్మరణం పాలయ్యారు. వీరి కుమారుడు మున్నా, అల్లుడు కల్యాణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. చిట్యాలకు చెందిన పందిరి యాదయ్య (65), భార్య కళమ్మ ఇనుపాముల వద్ద కారును పక్కకు ఆపి కాలకృత్యాలు తీర్చుకుంటుండగా అదే దారిలో (హైదరాబాద్ వైపు) వెళుతున్న లారీ పక్కకు ఆపిన కారును ఢీకొట్టి అతడి శరీరంపైకి దూసుకెళ్లింది. యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా ఆయన భార్య కళమ్మ తీవ్రంగా గాయపడింది. ఇదే గ్రామ శివారులో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో నకిరేకల్ మండలం చందుపట్లకు చెందిన జిల్లా బాబు కుమారుడు విశాల్ (10) మృతిచెందగా బాబుతో పాటు ఆయన భార్య వెన్నెల, కూతురు పుష్ప తీవ్రంగా గాయపడ్డారు. ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం వద్ద కారు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన కొతి దేవేందర్‌రెడ్డి(44), ఆయన భార్య నూతన(40) అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైటర్‌బస్తీగొల్లగూడానికి చెందిన మేడిపల్లి సునీల్(25), అనిశెట్టిపల్లికి కాకెల్లి దిలీప్(23) మృత్యువాత పడ్డారు.

## అనేక కోణాల్లో ఆరా

- ఐఎంఎస్ స్కాం నిందితులపై ప్రశ్నల వర్షం
- ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి సహా ఏడుగురి విచారణ
- నేడు మరోమారు ప్రశ్నించనున్న ఏసీబీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) మందుల కుంభకోణంలో నిందితులపై ఏసీబీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో మొత్తం 13 మందిని ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరిలో కీలక సూత్రధారులుగా భావిస్తున్న ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, వరంగల్ జేడీ డాక్టర్ కే పద్మతోపాటు ఐఎంఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్టోర్స్) డాక్టర్ కే వసంత ఇందిర, శంషాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీ గ్రేడ్– 2 ఫార్మసిస్టు ఎం రాధిక, ఎంఐఎస్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హర్షవర్ధన్, ఓమ్నీ మెడి ఎండీ కే శ్రీహరిబాబు అలియాస్ బాబ్జి, ఓమ్నీ మెడి రిప్రెజెంటేటివ్ నాగరాజును బుధ, గురువారాల్లో రెండురోజులపాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం వీరిని చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఈ స్కాంలో ముఖ్య సూత్రధారి అయిన ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తున్నట్టు సమాచారం.

### పక్కా ఆధారాలు చూపుతూ ప్రశ్నలు

సోదాల్లో పట్టుబడిన కీలక పత్రాలు, సాంకేతిక ఆధారాలను ఇప్పటికే విశ్లేషించుకున్న ఏసీబీ.. నిందితులకు వాటిని చూపుతూ ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా డిస్పెన్సరీల నుంచి సేకరించిన పలు పత్రాలను సైతం వీటిలో చేర్చినట్టు సమాచారం. స్కాంలో ఎవరి స్థాయిలోవారు అందినకాడికి దోచుకున్న దానికి ప్రాథమికంగా ఆధారాలు ఇప్పటికే సేకరించిన అధికారులు వాటిపై మరింత లోతైన సమాచారాన్ని నిందితుల నుంచి రాబడుతున్నారు. మొత్తం ఏడుగురు నిందితులకు వేర్వేరు ప్రశ్నావళిని రూపొందించికొని మరీ ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. ఒకే అంశానికి సంబంధించి వారు చెప్తున్న సమాధానాలను రికార్డు చేస్తున్నట్టు సమాచారం. గురువారం మరికొన్ని అంశాలపై ప్రశ్నించనున్నట్టు తెలిసింది.

## 'ఏపీ భవన్'పై కలిసి పరిష్కారం

- షెడ్యూల్ 9లోని 14 సంస్థల విభజనపై సందిగ్ధత
- సంస్థలవారీగా విశ్లేషించి నిర్ణయించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయం
- విభజన అంశాలపై ఢిల్లీలో కీలక సమావేశం
- హాజరైన రెండు రాష్ట్రాల సీఎస్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన అంశాన్ని తామే పరిష్కరించుకొంటామని రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు కేంద్రానికి తెలియజేశారు. గత ఏప్రిల్ 28న రెండు రాష్ట్రాల సీఎంల మధ్య ఈ అంశంపై చర్చ జరిగిందని, భవిష్యత్తులో కూడా ఇద్దరు సీఎంలు సమాలోచనలు జరిపి నిర్ణయం తీసుకొంటారని కేంద్ర హోంశాఖకు వివరించారు. విభజన అంశాలపై చర్చించడానికి బుధవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా నేతృత్వంలో రెండు రాష్ట్రాల అధికారుల సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు ఎస్కే జోషి, ఎల్వీ సుబ్రహ్మణ్యంతోపాటు ఇతర ఉన్నతాధికారులు రామకృష్ణారావు, ప్రేమచంద్రారెడ్డి హాజరయ్యారు. ఢిల్లీలోని ఏపీ భవన్ విభజనతోపాటు 9,10 షెడ్యూలు సంస్థల విభజన, ఉద్యోగులు, ఆస్తుల పంపకాల వంటి 9 అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. పునర్విభజన చట్టం షెడ్యూలు 9లోని 14 సంస్థల విభజనపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సందిగ్ధత వీడలేదు. హెడ్‌క్వార్టర్ నిర్వచనంపై స్పష్టత లేదంటూ ఏపీ పెట్టిన పేచీ కారణంగా ఈ సంస్థల విభజన సందిగ్ధంలో పడటంతో.. ఒక్కో సంస్థపై పూర్తిస్థాయిలో అధ్యయనంచేసి నిర్ణయం తీసుకోవాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. అనంతరం 9,10 షెడ్యూలు సంస్థల విభజనకు సంబంధించి ఇప్పటికే షీలాభిడే రూపొందించిన మార్గదర్శకాల మేరకు 68 సంస్థల విభజనకు సమ్మతం తెలిపినట్లు తెలంగాణ అధికారులు తెలిపారు. 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న కారణంగా ఆప్మెల్, సింగరేణి సంస్థల విభజన కూడా 42:58 దామాషాలో జరుగాలని ఏపీ పట్టుబట్టింది. కానీ, ఏపీ పునర్విభజనచట్టం 2014లోని షెడ్యూలు 12 సెక్షన్ 90 ప్రకారం ఏపీ డిమాండ్ పూర్తిగా చట్ట విరుద్ధమని తెలంగాణ కరాఖండిగా తేల్చిచెప్పింది. షీలాభిడే కమిటీ కూడా అదే విషయాన్ని తేల్చి చెప్పిందని తెలంగాణ అధికారులు గుర్తుచేశారు.



ఢిల్లీలో విభజన అంశాలపై భేటీలో పాల్గొన్న తెలంగాణ, ఏపీ సీఎస్‌లు ఎస్కే జోషి, ఎల్వీ సుబ్రహ్మణ్యం


NATIONAL SMALL INDUSTRIES CORPORATION
(A Govt. of India Enterprises)
NSIC-TECHNICAL SERVICES CENTRE
Kushaiguda, Near Radhika Movieplex, Hyderabad - 500 062

INDUSTRIAL TRAINING for Diploma Students

For Diploma in Mechanical, Automobile, Metallurgical, Civil, Computers/Computer & Commercial Practice/IT, Architectural Assistantship, EEE, ECE/Industrial Electronics, Engineering

Duration: 6 months, Batch starting Date 15/11/2019

INTERSHIPS / PROJECTS
B.E/B.Tech/M.E/M.Tech/MBA/MCA/BBA etc.,

Placement Assistance Through Jobmela

MECHANICAL/CIVIL: 8447768944 | EEE: 9908032577
Computers - 9490356226 | ECE: 8789406069



గత సాధారణ ఎన్నికల్లో ఓటమి తర్వాత అధినాయకత్వం అంతాకలిసి ఓటమిపై సమీక్షించుకోలేకపోయాం. ఇప్పుడు ముఖ్య సమస్య ఏమంటే.. అధినేతనే బాధ్యతల నుంచి దూరంగా పారిపోచూడటం.

**సల్మాన్ ఖుర్షీద్, సీనియర్ కాంగ్రెస్ నేత**

స్వదేశీ అంటే కొంతమంది మిగతా ప్రపంచంతో సంబంధాలను తెంచుకోవటంగా భావిస్తున్నారు. అలా కానే కాదు. ప్రపంచంతో బలమైన ఆర్థిక సంబంధాలను ఏర్పర్చుకున్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని గత చరిత్ర చెబుతున్నది. స్వయం సమృద్ధి దిశగా అడుగిడాలంటే, ఎఫ్‌డీఐలను ఆహ్వానించాల్సిందే.

**మోహన్ భగవత్, ఆర్‌ఎస్సెస్ చీఫ్**



**చరిత్రలో నేడు**



1899

సైకిల్‌ను తయారుచేసిన ఆఫ్రో అమెరికన్ శాస్త్రవేత్త ఐసాక్ ఆర్.జాన్సన్.

1911

చైనాలో సన్ యెట్ సేన్ నేతృత్వంలో ఆధునిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటు.





1954

ఫ్రెంచి సేనల ఉపసంహరణ తర్వాత వియెత్నాం చేరుకున్న హోచిమిన్.

ప్రపంచ బ్యాంక్ ఈ నెల 7న విడుదల చేసిన 'బంగ్లాదేశ్ పేదరిక అంచనా నివేదిక' ప్రకారం రోహింగ్యాల వలస ఉన్న కాక్స్ బజార్‌లో స్థానిక పేదరికం 52 శాతం పెరిగింది. సగటు దినసరి కూలీ 2017-2018 మే మధ్యకాలంలో 24 శాతం పడిపోయింది. టెక్నాఫ్, ఉఖియా ఉప జిల్లాలకు దాదాపు ఆరున్నర లక్షల మంది రోహింగ్యా శరణార్థులు రావడంతో ఈ రెండు ప్రాంతాల్లో జనాభా రెట్టింపైంది. వీరి రాకవల్ల స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితులు ఇంకా ముదరకముందే బంగ్లాదేశ్ ప్రభుత్వం పరిష్కారాన్ని అన్వేషించాలె.

**ది డైలీ స్టార్**

ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్ రాష్ట్రం ప్రవేశపెట్టిన కొత్త గర్భస్రావ బిల్లును గమనిస్తే విస్తృత సమాజ ప్రయోజనాల కోసం ఛాందసవాదుల ఒత్తిడికి తట్టుకొని నిలబడటం సాధ్యమే అనిపిస్తున్నది. దీనివల్ల కేంద్రం వివాదాస్పద మత స్వాతంత్ర్య పరిరక్షణ బిల్లు విషయంలో కొంత వ్యవధి తీసుకోవడానికి అవకాశం ఏర్పడ్డది. స్వలింగ వివాహాలను అనుమతించడం వల్ల ఆగ్రహానికి గురైన మతవాదులను సంతృప్తిపరుచడానికి ఈ బిల్లును ప్రభుత్వం తెస్తున్నదనే అభిప్రాయం కూడా ఉన్నది.

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# సద్విమర్శ తప్పుకాదు

దేశంలో విద్వేషదాడులను అరికట్టాలంటూ ప్రధానిని కోరుతూ లేఖ రాసిన ప్రముఖులపైనే రాజద్రోహం కేసు నమోదు చేయడం దిగ్భ్రాంతికరం. దేశ ప్రధానికి లేదా బాధ్యతాయుత స్థానాలలో ఉన్నవారికి చైతన్యవంతులైన ప్రజలు తమ అభిప్రాయాలను లేదా అసమ్మతిని వ్యక్తం చేస్తూ లేఖ రాయడం ఇవాళ కొత్త కాదు. ప్రజాస్వామ్య దేశాల్లో ఇటువంటి భిన్నాభిప్రాయాలను పాలకులు ఆహ్వానిస్తారు కూడా. కానీ ఈ మాత్రం అభిప్రాయ వ్యక్తీకరణే రాజద్రోహమంటూ లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై కేసు దాఖలు కావడం ప్రజాస్వామ్యంలో అవాంఛనీయ పోకడ. కొన్నినెలల కిందట రామచంద్రగుహ, మణిరత్నం, అపర్ణ సేన్, శ్యామ్ బెనగల్, శుభా ముద్గల్, అనురాగ్ కశ్యప్, సౌమిత్ర చటర్జీ వంటి ప్రముఖులు అల్పసంఖ్యాక ప్రజలపై, బలహీనవర్గాలపై సాగుతున్న విద్వేషదాడుల పట్ల తమ ఆందోళన వెలిబుచ్చుతూ ప్రధానికి లేఖ రాశారు. అసమ్మతిని వెలిబుచ్చే అవకాశం లేకపోతే ప్రజాస్వామ్యమేలేదని వారు తమ లేఖలో పేర్కొన్నారు. ప్రముఖులు ఈ లేఖ ద్వారా తమ ఆందోళనను ప్రధాని దృష్టికి తెచ్చారే తప్ప మరే దురుద్దేశం వారికి లేదనేది స్పష్టం. వారు దేశ ప్రధానికి లేఖ రాశారే తప్ప విదేశీయులకు కాదు. దేశ ప్రధానికి ప్రముఖులు రాసిన లేఖపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ రెండునెలల కిందట ఒక న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. దీని ఆధారంగా చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆగస్టు 20న ఇచ్చిన ఆదేశం మేరకు బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఈ నెల మూడవ తేదీన కేసు నమోదయింది.

> **ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను కాపాడటంలో మన దేశంలో న్యాయవ్యవస్థ ఎంతో కీలకపాత్రను పోషిస్తున్నది. మన దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో న్యాయస్థానాలు పోషించిన పాత్ర విస్మరించలేనిది. తాజా ఉదంతంలో కూడా పట్నా ఉన్నత న్యాయస్థానం స్వతహాగా చొరవ చూపి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలె. రాజద్రోహం చట్టమే వలసవాదుల పాలన నాటి కాలం చెల్లిన చట్టమని, దీనిని రద్దుచేయాలని ఎంతో కాలంగా ఒక బలమైన వాదన ఉన్నది. ఈ చట్టం దుర్వినియోగం అవుతున్న నేపథ్యంలో న్యాయస్థానాలు ఈ చట్ట రాజ్యాంగబద్ధతను సమీక్షించాలె.**

ప్రధానికి లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై రాజద్రోహం, శాంతికి భగ్నం కలిగించే ఉద్దేశంతో మత భావనలను గాయపరుచడం, అవమానించడం మొదలైన ఆరోపణలు చేస్తూ ప్రాథమిక దర్యాప్తు నివేదిక దాఖలైంది. లేఖ రాసిన ప్రముఖులు దేశ ప్రతిష్ఠకు చెరుపు తెస్తున్నారనీ, మెప్పించే రీతిలో సాగుతున్న ప్రధాని పాలనను లోకువ చేస్తున్నారని, వేర్పాటువాద పోకడలకు మద్దతు ఇస్తున్నారని ఈ ఫిర్యాదుదారు పిటిషన్‌లో ఆరోపించడమే సమంజసంగా లేదు. కాగా దీనిపై చీఫ్ జుడీషియ్ మెజిస్ట్రేట్ అనుకూలంగా స్పందించడం మరింత ఆందోళనకరం. ఈ విమర్శను సహృదయంతో అర్థం చేసుకోకుండా సమాజంలో సామరస్యం నెలకొనాలని కోరుతున్న వారిపైనే శాంతికి భంగం కలిగిస్తున్నారని నిందలు వేసి వేధించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కొన్నేండ్లుగా మతవిద్వేషాలు పెరుగుతున్నవనేది తెలిసిందే. అల్పసంఖ్యాకవర్గాలపై మూకదాడులు సాగుతున్నాయి. బలహీనవర్గాలపై కూడా దాడులు చేసి హతమార్చిన దుర్ఘటనలు ఉన్నా, వీరిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకొని శిక్షించిన ఉదంతాలు లేవు. ఈ దాడుల మూలంగా మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రపంచంలో ఉన్న పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటున్నాయి. ఈ దాడులను అరికట్టాలని కోరినవారిపైనే దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపించడమేమిటి? 49 మంది ప్రముఖులపై రాజద్రోహం కేసు పెట్టడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. ప్రధానికి లేఖ రాసిన 49 మందికి మద్దతుగా ఈ నెల ఏడవ తేదీన మరో 180 మంది ప్రముఖులు మరో లేఖ రాశారు. నసీరుద్దీన్ షా, రొమిలా థాపర్ తదితరులు మద్దతు లేఖ రాసిన వారిలో ఉన్నారు. తాజాగా మరికొన్ని వందల మంది ప్రముఖులు సౌహార్ద్రత ప్రకటించారు. లేఖలోని అభిప్రాయాలకు మద్దతు ప్రకటించిన ప్రముఖుల సంఖ్య పదమూడు వందలు దాటింది. మేం రోజూ గళం విప్పుతూనే ఉంటాం అని వారు ప్రకటించారు. కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాలు కూడా ప్రముఖులకు మద్దతు ప్రకటించాయి.

రాజద్రోహం కేసు పెట్టడానికి సుప్రీంకోర్టు అనేక పరిమితులు నిర్దేశించింది. అల్పమైన అంశాలపై ఇటువంటి కేసులు పెట్టడం సరికాదు. ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం కూడా అంత అల్పమైన విషయం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యలే స్పష్టం చేశాయి. పౌరులు వాక్‌స్వాతంత్ర్యాన్ని హరించడానికి చట్టాలను ఉపయోగించుకోకూడదు. ఎవరో వ్యక్తి చేసిన ఫిర్యాదు అంటూ బీజేపీ పెద్దలు వ్యాఖ్యానించి చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమే. జాతీయ రాజకీయ పక్షంగా అందులోనూ అధికార పక్షంగా ఇటువంటి పోకడలను అరికట్టవలసిన బాధ్యత బీజేపీ నాయకుల మీద ఉన్నది. ప్రధాని మోదీ కూడా తనకు రాసిన లేఖపై జరిగిన రాద్ధాంతం కనుక దీనిపై వెంటనే స్పందించాలె. ఈ విషయంలో ముజఫర్‌పూర్ న్యాయస్థానం చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ నిర్ణయం విమర్శలకు తావిస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను కాపాడటంలో మన దేశంలో న్యాయవ్యవస్థ ఎంతో కీలకపాత్రను పోషిస్తున్నది. మన దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో న్యాయస్థానాలు పోషించిన పాత్ర విస్మరించలేనిది. తాజా ఉదంతంలో కూడా పట్నా ఉన్నత న్యాయస్థానం స్వతహాగా చొరవ చూపి, ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలె. రాజద్రోహం చట్టమే వలసవాదుల పాలన నాటి కాలం చెల్లిన చట్టమని, దీనిని రద్దుచేయాలని ఎంతో కాలంగా ఒక బలమైన వాదన ఉన్నది. ఈ చట్టం దుర్వినియోగం అవుతున్న నేపథ్యంలో న్యాయస్థానాలు ఈ చట్ట రాజ్యాంగబద్ధతను సమీక్షించాలె.

**జనగళం**

### సమ్మె సమంజసం కాదు

ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనాల దోపిడీ పక్కనపెడితే, ఆర్టీసీ బస్సులను నడుపుతున్నవారు కూడా ఇష్టానుసారంగా ఛార్జీలు వసూలు చేయటం గర్హనీయం. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా యాజమాన్యం బస్సులు నడుపాలన్న నిర్ణయం హర్షణీయమైనదే. అయితే ఆ బస్సులు నడుపుతున్న వారు ఏవిధమైన జవాబుదారీతనం లేకుండా ఇష్టారీతిన ఛార్జీలు వసూలు చేస్తున్నారు. కనీసంగా ఛార్జీలకు రెండు రెట్లు వసూలు చేస్తున్నారు. ఏమైనా అడిగితే దిగిపోండని చీదరించుకుంటున్నారు. కోడెలు కోడెలు కొట్లాడితే లేగదూడలకు ప్రాణం మీదికి వచ్చినట్లుగా ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. బస్సుల్లో తగురీతిన ఛార్జీలు వసూలు చేయటానికి ప్రభుత్వం తగు సూచనలు చేయాలి. ఏదేమైనా పండుగ పూట ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగడం సమంజసం అనిపించుకోదు.

**- ఉప్పల ఉదయ్‌కుమార్, భువనగిరి**

### ఆరోగ్య సేవలు విస్తృతపరుచాలె

గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటిల్లిపాది జ్వరాల బారిన పడిన ఉదంతాలుంటున్నాయి. దీంతో పాటు డెంగ్యూ వ్యాధి కూడా విస్తరిస్తున్నది. మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ దవాఖానలన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. మౌలిక వసతులు, సౌకర్యాలు లేక రోగులు నేలపైనే వైద్య సేవలు పొందాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ మధ్యన కురుస్తున్న వర్షాలతో కూడా విషజ్వరాలు మరింత ఎక్కువయ్యే అవకాశాలున్నాయి. కాబట్టి ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రాలను బలోపేతం చేసి సాధారణ విషజ్వరాలకు తగిన చికిత్స ప్రజలకు ఇంటిదగ్గరే అందించే ఏర్పాటుచేయాలి. ఇలా చేసినప్పుడే జిల్లా కేంద్రంలోని దవాఖానలకు రోగుల తాకిడి తగ్గుతుంది. డెంగ్యూ జ్వరానికి కూడా తగు చికిత్సలు అందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- డి.వాసు, లోయపల్లి, ఇబ్రాహీంపట్నం**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# తెలంగాణ కమ్యూనిస్టుల మార్గం

**హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌ను బలపరిచేందుకు నిర్ణయించిన సీపీఐ సరైన వైఖరి తీసుకున్నది. తమ పోటీకి అవకాశం లేకుండాపోయిన సీపీఎం కూడా బయటకు ప్రకటించినా, ప్రకటించకున్నా ఇదే వైఖరి తీసుకోవటం మంచిదవుతుంది. ఇది కేవలం టీఆర్‌ఎస్ గెలుపు ఓటముల ప్రశ్న కాదు. తమ సిట్టింగ్ స్థానం కానిచోట ఒకవేళ ఓడినా టీఆర్‌ఎస్‌కు కలిగే నికరమైన నష్టం ఏమీ లేదు. కానీ తెలంగాణ బయటగల బీజేపీ ఉధృతి ఇక్కడ వ్యాపించకుండా నిలువరించే శక్తి కాంగ్రెస్‌కు లేనప్పుడు, టీఆర్‌ఎస్‌తో చేతులు కలిపి ఆ పని చేయటమే వామపక్షాల కర్తవ్యమవుతుంది.**

దేశంలో రాజకీయాలకు, తెలంగాణ రాజకీయాలకు సంబంధం లేదని వామపక్షాలు అనలేవు. ఇంకా చెప్పాలంటే దేశ రాజకీయాలతో దేశంలోని ప్రతి ఒక్క రాష్ట్ర రాజకీయానికి సంబంధం ఉంటుంది. ఈ మాట ఇతర పార్టీలకన్న వామపక్షాలకు ఎక్కువ తెలుసు. మన దేశంలో కాంగ్రెస్, బీజేపీ, లెఫ్ట్ జాతీయ పార్టీలు కాగా, తక్కినవి అన్నీ ప్రాంతీయ పార్టీలు. తక్కిన వాటిలో రెండు మూడు తమనుతాము జాతీయపార్టీలుగా చెప్పుకున్నప్పటికీ వాటికి నిజమైన విధంగా జాతీయవ్యాప్తి లేదు. ఇక మూడు జాతీయ పార్టీలకు సంబంధించి అవి అన్ని రాష్ట్రాలలో వీలైంతనగా వ్యాపించి వీలైనన్ని సీట్లు గెలిచే రాజకీయ వ్యూహంతో మొదటినుంచి పనిచేస్తూ వస్తున్నాయి. ఇది కొంతకాలం సజావుగానే సాగింది. కాని ఒక దశ తర్వాత స్వీయ వైఫల్యాల వల్ల కాంగ్రెస్, కమ్యూనిస్టులకు క్షీణదశ ఆరంభమైంది. కాంగ్రెస్‌వి మౌలిక వైఫల్యాలు అయినందున పునాదులు, వాటిపైని నిర్మాణం కూడా బలహీనపడసాగింది. మరొక ప్రత్యామ్నాయం స్థిరమైన రూపంలో ఏర్పడలేదు గనుక జయాపజయాలు కొంత కాలం పాటు పెండ్యులం వలె ఊగిసలాడినా, మౌలిక బలహీనతను ఆపలేకపోయాయి. అటువంటిస్థితిలో బీజేపీ ఉధృతి మొదలైన తర్వాత కాంగ్రెస్‌కు ఇక రక్షణ లేకుండాపోయింది. ఇది వర్తమాన దశ. ఆ పార్టీ విధానాలను, నాయకత్వపు తీరుతెన్నులను, పార్టీ యంత్రాంగపు బలహీనతలను గమనించినప్పుడు, వారు బీజేపీని ఎదుర్కొనగల అవకాశం సమీ ప భవిష్యత్తులో కన్పించటం లేదు.

వామపక్షాల విషయానికి వస్తే, అవి జాతీయపక్షాలు కావటం నిజమే అయినా కాంగ్రెస్, బీజేపీలతో పోల్చినప్పుడు వారి వ్యాప్తి, బలం ఎప్పుడూ పరిమితమైనవే. అంతకుమించి వ్యాపించలేకపోవటానికి, బలం పెంచుకోలేకపోవటానికి పూర్తిగా వారి వైఫల్యాలే కారణం. దేశంలోని ఆర్థిక–సామాజిక–రాజకీయ పరిస్థితుల దృష్ట్యా చూసినప్పుడు, సరైన విధంగా వ్యవహరించి ఉన్నట్లయితే వారు ఎంతగానో వ్యాపించి బలపడవలసింది. కానీ అది జరుగుకపోగా క్షీణతలు మొదలయ్యాయి. తమ పరిమితులు తమకు బాగానే తెలిసివచ్చాయి. ఆ పరిస్థితుల్లో రకరకాల అయోమయాలకు గురైన కమ్యూనిస్టులు, దేశంలో బీజేపీ ఉధృతి అనదగ్గది ఇంకా మొదలుకాకముందే కాంగ్రెస్‌కు, వివిధ ప్రాంతీయ పార్టీలకు మధ్య చిత్రవిచిత్రమైన రాజకీయ విన్యాసాలను సాగించారు. సొంత సిద్ధాంతాలు, కార్యక్రమాల ఆధారంగా పెంచుకొనలేకపోయిన బలం ఈ విన్యాసాల ద్వారా లభించవచ్చునని ఆశలు పెట్టుకున్నారు. ఆ మార్గంలో లభించిన సోకాల్డ్ విజయాలు, లేదా గెలిచిన రెండో, నాలుగో సీట్లు తమ నిజమైన విజయమని భ్రమపడ్డారు. ఓడినప్పుడు కుంగిపోయారు తప్ప ఆత్మవిమర్శలతో దిద్దుబాట్లు ఏమీ చేసుకోలేదు. తమకు తాము చెప్పుకున్నవి కుంటిసాకులయ్యాయి. కనీసం ఆ కుంటిసాకులు కూడా కొత్త మార్పులను తేలేదు. స్వయంగా తమ పునాదులు బలహీనపడుతుండిన స్థితిలో ఇతర పార్టీలతో జరిపిన విన్యాసాలు కూడా నిరుపయోగంగా మారుతుండగా వీరికి దిక్కుతోచని స్థితి ఏర్పడింది. పులి మీద పుట్ర వలె బీజేపీ ఉధృతి మొదలైంది.

వర్తమాన దృశ్యం కాంగ్రెస్, కమ్యూనిస్టులు అనే రెండు జాతీయపక్షాలకు సంబంధించి కూడా ఒకే విధంగా ఉంది. ఇరువురూ ఎడారి మధ్యన నిలుచొని ఉన్నారు. దానినుంచి బయటపడే మార్గాలు లేకపోలేదు గాని అది ప్రస్తుత చర్చలోకి రాగల విషయం కాదు గనుక వదిలివేద్దాము. ఈ రెండు జాతీయపార్టీల పరిస్థితి ఈ విధంగా ఉండగా, వారు ఇరువురూ వేర్వేరు దశలలో అప్పటి తమ ఎన్నికల ఎత్తుగడలను బట్టి ప్రేమించిన లేదా ద్వేషించిన ప్రాంతీయ పార్టీల పరిస్థితి ఏమిటి? విషయానికి నేరుగా రావాలంటే, ఆ పార్టీల ఒకప్పటి 'స్వర్ణయుగం' అంతరించింది. ఇప్పటికీ వారు కొన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉన్నారు. వారిలో కొందరు జాతీయపార్టీలు అన్నింటిని, ప్రస్తుత బీజేపీ ఉధృతిని కూడా తట్టుకోగలిగినంత బలంగానే ఉన్నారు. అదివేరు. కానీ భారతదేశంలో ఫిలసాఫికల్‌గా వారికి ఒకప్పుడు ఉండిన 'స్వర్ణయుగం' ఇప్పుడు లేదు. అందుకు కారణం వారి వైఫల్యాలే. స్వీయ వైఫల్యాల వల్ల కాంగ్రెస్, కమ్యూనిస్టులు బలహీనపడినట్లుగానే ప్రాంతీయ పార్టీలలోనూ అనేకం బలహీనపడ్డాయి. ఈ మూడు శక్తులకు సంబంధించిన ఈ క్రమం ఇంకా కొనసాగుతున్నది. అనగా కమ్యూనిస్టులకు ఒకవైపు కాంగ్రెస్ ఆధారం, మరొకవైపు ప్రాంతీయ పార్టీల ఆధారం రెండూ బలహీనపడ్డాయి, పడుతున్నాయి. తమ సొంతకాళ్ల బలం ఎట్లాగూ తమను నిలబెట్టడం లేదు.

> **తెలంగాణలో ఒక బలమైన ప్రాంతీయపార్టీ టీఆర్‌ఎస్ రూపంలో ఉన్నది. అదికొన్ని తడబాట్లు ఉన్నప్పటికీ నానాటికి ప్రజాదరణను పెంచుకుంటున్నది. పలు విధాలుగా అభివృద్ధిని, సంక్షేమాన్ని మౌలికమైన విధంగా సాధిస్తున్నది. సెక్యులరిజం భద్రంగా ఉన్నది. ఆ కారణంగా రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు బలపడలేకపోతున్నాయి. మరొక ప్రాంతీయ పార్టీకి అవకాశమే కన్పించటం లేదు. మొత్తం దేశాన్ని ఒకసారి తేరిపార జూస్తే ఈ స్థాయిలో నిలదొక్కుకుని కొనసాగుతున్న ఫెడరల్ పార్టీలు అరుదుగా తప్ప లేవు. అటువంటప్పుడు, ఇన్ని పరిణామాల నేపథ్యం నుంచి ప్రస్తుత దశకు చేరిన తెలంగాణ వామపక్షాలు ఎంచుకోవలసిన మార్గం ఏమిటి?**

ఇటువంటి సుదీర్ఘమైన గతకాలపు, వర్తమానపు నేపథ్యంలో తెలంగాణ కమ్యూనిస్టులు ఉన్నారు. వారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్ర కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతర స్థితికి వస్తే, ఇది ఇటీవలి చరిత్ర గనుక అందరికీ తెలిసిందే. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలు అదేవిధంగా కొనసాగితే పరిస్థితులు చివరికి రాష్ట్ర విభజనకు దారితీయవచ్చునని 1969 ఉద్యమకాలంలో సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉండిన చంద్ర రాజేశ్వరరావు తమ అధికార పత్రిక న్యూ ఏజ్‌లో బహిరంగంగా హెచ్చరించారు. అయినప్పటికీ సీపీఐ ఆ తర్వాత సుమారు 40 సంవత్సరాలకు గాని ప్రత్యేక రాష్ట్రాన్ని బలపరుచలేదు. ఇక సీపీఎం అయితే స్టాలిన్ వంటి సిద్ధాంతకర్త స్వయంగా తిరస్కరించిన లింగ్విస్టిక్ డిటర్మినిజం (భాషనే నిర్ణయాత్మక పాత్ర) సిద్ధాంతాన్ని సీమాంధ్ర ధనికవర్గాల ప్రయోజనం కోసం భుజాన వేసుకొని తెలంగాణ ప్రజలకే గాన తనకు తాను కూడా తీరని హాని చేసుకున్నది. దానిని వదులుకునేందుకు నేటికీ సిద్ధపడటం లేదు. సమస్యలు–పోరాటాలు అంటూ చమత్కారపు ఎత్తుగడలు వేసి, తమ తెలంగాణ వ్యతిరేకతా దోషాన్ని దాని మాటున కప్పిపుచ్చుకునేందుకు యాతనలు పడుతున్నది. తమ ఎత్తుగడలతో ప్రజలు తమ తెలంగాణ వ్యతిరేకతను నిజంగానే మరిచిపోతున్నారంటూ భ్రమపడి ఆ మేరకు నల్లగొండలో ఒక తీర్మానాన్నే చేసింది. ఇది కమ్యూనిస్టులు అయినవారు పాల్పడగూడని ఆత్మవంచన, పరవంచన అని ఆ పార్టీ నాయకత్వపు సంకుచిత దృష్టికి తోచలేదు.

వామపక్షాల విషయంలో ఇవేవీ పనిచేయటం లేదని 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. సీపీఐ కొంతకాలం కాంగ్రెస్ తదితరులతో కలిసిచేసిన ప్రయోగాలు ఫలితాలనివ్వలేదు. స్వయంగా కాంగ్రెసే నానాటికి తీసికట్టు అవుతున్నది. ఇక వామపక్షాలు అన్నీ కలసి ప్రత్యామ్నాయంగా ఎదుగాలంటూ 2014 చివరలో చెప్పుకున్న సంకల్పం ఈ ఐదేండ్ల తర్వాత చీలికలు పేలికలుగా మారిపోయింది. వారికి ఇతరులతో పొత్తులు కుదురుతాయిగాని తమలో తమకు సరిపడకపోవటం ఒక విచిత్రం.

మొత్తానికి వారికి సంబంధించిన పరిస్థితులు ఈ విధంగా ఉండగా, తెలంగాణలో ఒక బలమైన ప్రాంతీయపార్టీ టీఆర్‌ఎస్ రూపంలో ఉన్నది. అదికొన్ని తడబాట్లు ఉన్నప్పటికీ నానాటికి ప్రజాదరణను పెంచుకుంటున్నది. పలు విధాలుగా అభివృద్ధిని, సంక్షేమాన్ని మౌలికమైన విధంగా సాధిస్తున్నది. సెక్యులరిజం భద్రంగా ఉన్నది. ఆ కారణంగా రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు బలపడలేకపోతున్నాయి. మరొక ప్రాంతీయ పార్టీకి అవకాశమే కన్పించటం లేదు. మొత్తం దేశాన్ని ఒకసారి తేరిపార జూస్తే ఈ స్థాయిలో నిలదొక్కుకుని కొనసాగుతున్న ఫెడరల్ పార్టీలు అరుదుగా తప్పలేవు. అటువంటప్పుడు, ఇన్ని పరిణామాల నేపథ్యం నుంచి ప్రస్తుత దశకు చేరిన తెలంగాణ వామపక్షాలు ఎంచుకోవలసిన మార్గం ఏమిటి? ఈ మాట అంటున్నది కేవలం హుజూర్‌నగర్ అసెంబ్లీ ఎన్నికకు పరిమితమై కాదు.

# తెగేదాకా లాగొద్దు

**విశ్లేషణ**



**ఇలపావులూరి మురళీమోహనరావు**

అన్నం పెట్టే చేతిని నరికేసుకోవడంలో ఆర్టీసీ సిద్ధహస్తురాలు. ఆర్టీసీ అనేది ప్రజా రవాణా సంస్థ. లాభాపేక్ష లేకుండా ప్రజలను గమ్యానికి చేర్చడం ఆర్టీసీ ప్రథమ కర్తవ్యం. ఏ ముహూర్తంలో ఆర్టీసీని ప్రారంభించారో కానీ, ఆ సంస్థ ఎప్పుడూ నష్టాల్లోనే మునిగితేలుతున్నది. ప్రైవేట్ రవాణాతో పోలిస్తే ఆర్టీసీ ఛార్జీలు తక్కువ. భద్రత ఎక్కువ. బస్సులకు సారథులైన కండక్టర్లు, డ్రైవర్లు సంస్థకు ఆదాయం తెచ్చిపెట్టే ప్రధాన వనరులు. వీరి నిజాయితీ, చిత్తశుద్ధి మీద ఆర్టీసీకి లాభాలు వస్తుంటాయి. బస్సులను సమయానికి నడుపడం, ప్రయాణికులు ఎక్కడ ఆపమంటే అక్కడ బస్సును ఆపడం, క్షేమంగా గమ్యానికి చేర్చడం ఈ ఉద్యోగుల విధి. ప్రైవేట్ రవాణా సంస్థల వారు ఎక్కడ ఎవరు చేతులు ఎత్తినా బస్సులను ఆపుతారు. కానీ, ఆర్టీసీలో ఆ లక్షణం కనిపించదు. నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే ఆపుతారు. ప్రయాణీకుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. వారిలో వినయవిధేయతలు, తమను పోషించేప్రయాణికుల పట్ల గౌరవం కనిపించదు. అందరూ అలాగే ఉండరనుకోండి అది వేరే విషయం.

ఆర్టీసీకి పండుగల సమయంలో ఆదాయం అధికంగా వస్తుంది. ముఖ్యంగా సంక్రాతి, దసరా పండుగలకు సెలవులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఆ సమయంలో సొంత గ్రామాలకు కుటుంబాలతో సహా వెళ్తారు. అదే అదనుగా ఆర్టీసీ ఛార్జీలను పెంచుతుంది. అయినా సరే, ప్రైవేటు రవాణాతో పోలిస్తే ఆర్టీసీ ఛార్జీలు తక్కువగా ఉంటాయి కాబట్టి ఎక్కువమంది ప్రభుత్వ రవాణానే ఆశ్రయిస్తారు. సరిగ్గా అలాంటి పండుగ సమయంలో ఆర్టీసీ కార్మికులు ప్రయాణికుల ఆశల మీద చావుదెబ్బ కొట్టారు. హైదరాబాద్ నుంచి, ఇతర పట్టణాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులను వంచిస్తూ హటాత్తుగా సమ్మెకు దిగారు. రోజుకు ఐదు కోట్ల రూపాయల ఆదాయం ఈ పండుగల సమయాల్లో సంస్థకు వస్తుంది. అదేమంటే మేము నెల రోజుల కిందటే ప్రభుత్వానికి నోటీసు ఇచ్చామని యూనియన్ల వారు వాదిస్తారు. నిజమే కావచ్చు. వారికి డిమాండ్లు ఉండవచ్చు. జీతాలు పెంచమని అడుగడానికి వారికి అన్ని హక్కులూ ఉన్నాయి. కార్మికచట్టాలు వారికీ వర్తిస్తాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనేది వారి ప్రధాన డిమాండ్. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, చేయకపోవడమనేది యాజమాన్యానికి సంబంధించిన విషయం. సంస్థ యాజమాన్యం, ప్రభుత్వం కలిసి చర్చించుకోవాల్సిన నిర్ణయం అది. కార్మికులు ఎలా డిమాండ్ చేస్తారో నాకు అర్థం కావడం లేదు. ఒకవేళ రేపు తమను పోలీస్ శాఖలోనో, రెవెన్యూ శాఖలోనో కలిపేయాలంటే కలిపేయాల్సిందేనా?

ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? గతేడాది వెయ్యి కోట్ల నష్టాలను చూసిందట. నగరాల్లో ఎప్పుడుచూసినా బస్సులు కిటకిటలాడుతుంటాయి. దూరప్రాంతాలకు వెళ్లాలన్నా ఐదారు రోజుల ముందు రిజర్వ్ చేయించుకోవాలి. ఒక ప్రైవేట్ బస్సు కొన్న వ్యక్తి ఏడాది తిరిగేసరికి మరో రెండు బస్సులు కొంటున్నాడు. అనేక ప్రైవేట్ ట్రావెల్స్ వారు వందలాది బస్సులను నడుపగలుగుతున్నారు. ఆర్టీసీ బస్సులతో పోలిస్తే ప్రైవేట్ బస్సులు ఇంద్రభవనాల్లా ఉంటాయి. వేగం కూడా ఎక్కువ. ఛార్జీలు కూడా ఎక్కువే. అయినప్పటికీ, ప్రయాణీకులు ప్రైవేట్ బస్సులను ఎందుకు ఆశ్రయిస్తున్నారో కార్మికులు ఎప్పుడైనా ఆత్మవిమర్శ చేసుకున్నారా? ప్రైవేట్ బస్సుల్లో ఎంతదూరం ప్రయాణమైనా డ్రైవర్ ఒక్కడే ఉంటాడు. నైట్ హాల్ట్ అయితే బస్సులోనే పడుకుంటారు సిబ్బంది. ఆర్టీసీకి దూరప్రాంతాలకు ఇద్దరు డ్రైవర్లుంటారు. వారికి డిపోల్లోనే నిద్రించడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వసతి కల్పిస్తుంది యాజమాన్యం. అలాగే ప్రైవేట్ రవాణాలో పనిచేసే కార్మికులతో పోల్చినప్పుడు ఆర్టీసీ కార్మికులకు జీతభత్యాలు, ఇతర సదుపాయాలు అధికమే. అంగట్లో అన్నీఉన్నా, అల్లుడి నోట్లో శని అన్నట్లు, ఎన్ని సదుపాయాలు సమకూర్చినా, సంస్థ మాత్రం ఎప్పుడూ నష్టాల్లోనే కునారిల్లుతుంది. మనకు తిండి పెట్టే సంస్థకు లాభాలు చేకూర్చిపెట్టాలి. దానిలో మన వాటా దబాయించి అడుగాలని కార్మికులు ఆలోచిస్తే బాగుంటుంది. పది వేలకు పైగా బస్సులున్న సంస్థ ఎందుకు ఏటా నష్టాల్లో కూరుకుపోతుందని చర్చించుకోవాలి. తప్పు అధికారులదా? ప్రభుత్వ విధానానిదా అని తేల్చుకొని తప్పులు దిద్దుకోవచ్చు.

ఇక సమ్మె చట్టబద్ధం అని, చట్టవిరుద్ధం అని పరస్పరం ఆరోపించుకుంటారు. ఇదెప్పుడూ జరిగేదే. ఇప్పుడు సుమారు 48 వేల మం ది కార్మికులు తమంత తామే స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకున్నారని ప్రభుత్వం ప్రకటించింది. అంటే ఇప్పుడు వారు ఆర్టీసీ ఉద్యోగులు కాదని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఇప్పుడేం జరుగుతుంది? వారు కోర్టుకు వెళ్లకతప్పదు. కోర్టు ఒకవేళ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తే కార్మికులకు అంతకన్నా పెద్ద పరాభవం ఉండదు. సమర్థించకుండా, ఉద్యోగులను క్షమాపణ లేఖ ఇస్తే తిరిగి విధుల్లోకి తీసుకోమని కోర్టు ఆదేశిస్తే ప్రభుత్వం అంగీకరించకతప్పదు. అప్పటికీ కార్మికులు మొండిపట్టుతో మేము ఉద్యోగాల్లో చేరమని భీష్మిస్తే వారిని అధికారికంగా డిస్మిస్ చేయడానికి ప్రభుత్వానికి సంపూర్ణమై న హక్కు లభిస్తుంది. అప్పుడై నా నష్టపోయేది కార్మికులే. పదహారేండ్ల కింద తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఒకేసారి దాదాపు రెండు లక్షల మంది ఉద్యోగులను ఒక్క కలంపోటుతో డిస్మి స్ చేసినప్పుడు పైన చెప్పినట్లే జరిగింది. ఆ దెబ్బతో మళ్లీ సమ్మె అంటే ప్రభుత్వోద్యోగులు వణికిపోయారు. అటు ప్రభుత్వం, ఇటు కార్మిక సం ఘాలు ఇద్దరూ మొండిపట్టు పడితే జరుగబోయేది ఇదే కావచ్చు.

> **ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ప్రజా మద్దతు లేదు. పండుగల సమయాల్లో తమను తీవ్రంగా ఇబ్బందుల పాలుచేసిన కార్మిక సంఘాల పట్ల ప్రయాణికులు ఆగ్రహంగా ఉన్నారు. వంద రూపాయలతో చెయ్యాల్సిన ప్రయాణం సమ్మె మూలంగా మూడు వందలు పెట్టి చేయాల్సివచ్చిందని రగిలిపోతున్నారు. ప్రజా మద్దతులేని ఏ సమ్మె కూడా విజయం సాధించదు. తమ సమస్యలను సరైన సమయంలో యాజమాన్యంతో, ప్రభుత్వంతో కూర్చొని చర్చించుకోవాలి తప్ప ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఆర్టీసీ పట్ల ప్రజలకు విశ్వాసం సడలుతుంది.**

ప్రస్తుతం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ప్రజా మద్దతు లేదు. పండుగల సమయాల్లో తమను తీవ్రంగా ఇబ్బందుల పాలుచేసిన కార్మిక సంఘాల పట్ల ప్రయాణికులు ఆగ్రహంగా ఉన్నారు. వంద రూపాయలతో చెయ్యాల్సిన ప్రయాణం సమ్మె మూలంగా మూడు వందలు పెట్టి చేయాల్సివచ్చిందని రగిలిపోతున్నారు. ప్రజా మద్దతులేని ఏ సమ్మె కూడా విజయం సాధించదు. తమ సమస్యలను సరైన సమయంలో యాజమాన్యంతో, ప్రభుత్వంతో కూర్చొని చర్చించుకోవాలి తప్ప ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఆర్టీసీ పట్ల ప్రజలకు విశ్వాసం సడలుతుంది. వారు ప్రత్యామ్నాయ మార్గాలకు అలవాటుపడితే, ఆర్టీసీ దివాలా తీసి ఆల్విన్, రిపబ్లిక్ ఫోర్జ్ లాంటి అనేక ప్రభుత్వరంగ సంస్థల మాదిరిగా శాశ్వతంగా మూతపడుతుంది. అప్పుడు సంస్థను నమ్ముకున్నవారంతా రోడ్డుమీద పడక తప్పదు. బంగారుబాతు నుంచి రోజుకో గుడ్డు తీసుకోవాలి తప్ప ఒకేసారి పొదుగు కొస్తే ఏమవుతుంది?

(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com




ఢిల్లీలో మంగళవారం వివిధ ఉత్సవ సమితులు నిర్వహించిన దసరా సంబురాలలో రావణుడి దిష్టిబొమ్మలపైకి బాణాలను సంధిస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా, దహనమవుతున్న రావణుడి దిష్టిబొమ్మ

## మొదలైన రుతుపవనాల తిరోగమనం

నెల రోజులు ఆలస్యం: ఐఎండీ

**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాల తిరోగమనం బుధవారం మొదలైందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రికార్డుస్థాయిలో దాదాపు నెల రోజులు ఆలస్యంగా రుతుపవనాలు వెనుదిరినట్టు వెల్లడించింది. 'నైరుతి భారతదేశం వ్యాప్తంగా వాతావరణ పైపొరల్లో నిలకడగా కొనసాగుతున్న తుఫాను వ్యతిరేక ప్రసరణము, కిందిపొరల్లో తేమశాతం క్రమంగా తగ్గడం, వర్షపాతం తగ్గిపోవడాన్ని బట్టి బుధవారం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైనట్టు గుర్తించాం. పంజాబ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాలు, ఉత్తర రాజస్థాన్ నుంచి రుతువపనాలు వెనక్కి మళ్లాయి' అని ఐఎండీ ఒక ప్రకటనలో పేర్కొన్నది. మరో రెండు రోజుల్లో నైరుతి భారతదేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో తిరోగమన అనుకూల వాతావరణం ఏర్పడుతుందని, ఆ తర్వాత రెండుమూడురోజుల్లో మిగతా ప్రాంతాలతోపాటు మధ్యభారత్‌లో అనుకూలత ఏర్పడుతుందని వివరించింది. సాధారణంగా సెప్టెంబర్ 1న రుతుపవనాల తిరోగమనం ప్రారంభమవుతుందని, ఈసారి దాదాపు నెల రోజులు ఆలస్యమైనట్టు వెల్లడించింది.





# భారత్ చేతికి రాఫెల్

- ఫ్రాన్స్ నుంచి అధికారికంగా తొలి విమానాన్ని స్వీకరించిన రాజ్‌నాథ్
- ఆయుధ పూజ అనంతరం రాఫెల్‌లో విహరించిన రక్షణమంత్రి
- అత్యాధునిక ఆయుధాలతో ఏ దేశాన్ని భయపెట్టే ఉద్దేశం లేదని వెల్లడి
- రక్షణ సామర్థ్యం బలోపేతం కోసమే సమకూర్చుకుంటున్నామని స్పష్టీకరణ





ఫ్రాన్స్‌లోని మెరిగ్నాక్‌లో రాఫెల్‌ను స్వీకరించిన అనంతరం అందులోకి వెళ్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత్ చేతికందిన తొలి రాఫెల్ యుద్ధ విమానం

**మెరిగ్నాక్ (ఫ్రాన్స్), అక్టోబర్ 9:** భారత వాయుసేన అమ్ములపొదిలోకి అధునాతన అస్త్రం చేరింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రాఫెల్ యుద్ధ విమానం భారత్ చేతికందింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం ఫ్రాన్స్ నుంచి అధికారికంగా తొలి రాఫెల్ యుద్ధ విమానాన్ని స్వీకరించారు. నైరుతి ఫ్రాన్స్‌లోని మెరిగ్నాక్‌లో ఉన్న దసాల్ట్ ఏవియేషన్ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫ్రాన్స్ రక్షణ మంత్రి ఫ్లోరెన్స్ పార్లె కూడా పాల్గొన్నారు. రూ.59,000 కోట్లతో మొత్తం 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ ఏవియేషన్ సంస్థతో భారత్ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. అందులో తొలి విమానం తాజాగా భారత్ చేతికందింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని రాజ్‌నాథ్ మంగళవారం ఫ్రాన్స్‌లో ఆ విమానానికి ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం అందులో దాదాపు 25 నిమిషాలపాటు విహరించారు. రాఫెల్ రాకతో భారత వైమానిక సామర్థ్యం బలోపేతమైందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకుని ఏ దేశాన్నీ భయపెట్టే ఉద్దేశం భారత్‌కు లేదని, కేవలం తమ రక్షణ సామర్థ్యాలను పెంచుకోవడమే లక్ష్యమని స్పష్టంచేశారు. 'సూపర్‌సోనిక్ (ధ్వనివేగాన్ని మించిన) వేగంతో ప్రయాణిస్తానని నేనెప్పుడూ ఊహించలేదు. రాఫెల్‌లో ప్రయాణించడం సౌకర్యంగా ఉంది. ఈ అనుభూతి మరిచిపోలేనిది. జీవితంలో ఒక్కసారే ఇలాంటి అవకాశం వస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ 19న ఆయన బెంగళూరులోని హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్ట్ నుంచి తేజస్ విమానంలో ప్రయాణించిన విషయం తెలిసిందే. తద్వారా ఆ విమానంలో ప్రయాణించిన తొలి రక్షణ మంత్రిగా ఆయన ఘనత సాధించారు.

**భారత్-ఫ్రాన్స్ సంబంధాల్లో సరికొత్త మైలురాయి**

'మన వాయుసేన ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉంది. రాఫెల్ రాకతో మరింత బలం చేకూరుతుంది. ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఇది తోడ్పడుతుంది. రాఫెల్ అన్న ఫ్రెంచ్ పదానికి అర్థం తుఫాన్ అని నేను విన్నా. ఆ పేరుకు తగినట్లుగా రాఫెల్ పనిచేస్తుందని నాకు విశ్వాసం ఉంది. భారత్-ఫ్రాన్స్ వ్యూహాత్మక సంబంధాల్లో ఈ రోజు ఒక మైలురాయి. రక్షణ సంబంధాల్లో సరికొత్త శిఖరానికి చేరుకున్నాం. ఈ రోజు (మంగళవారం) విజయదశమి. అలాగే 87వ వాయుసేన దినోత్సవం కూడా. ఇలా ఈరోజుకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఫ్రాన్స్ రక్షణ మంత్రి పార్లే మాట్లాడుతూ.. దసరా, భారత వాయుసేన దినోత్సవం రోజున ఈ కార్యక్రమం నిర్వహించడం యాధృచ్ఛికం కాదని, భారత్‌తో సంబంధాలకు తాము ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనం అని చెప్పారు. 'భారత్‌లో తయారీ'కి (మేకిన్ ఇండియా) తాము కట్టుబడి ఉన్నామన్నారు. కాగా, తొలి విడుతలో నాలుగు రాఫెల్ విమానాలు 2020 మే నాటికి భారత్‌కు చేరనున్నాయి. 2022 సెప్టెంబర్ నాటికి 36 విమానాలూ అందుతాయి.

**పన్నులతో మమ్మల్ని భయపెట్టకండి**

భారత్ తమకు వాణిజ్య అనుకూల వాతావరణం కల్పించాలని, పన్నులతో భయపెట్టకూడదని రాఫెల్ యుద్ధ విమాన ఇంజిన్ తయారీ కంపెనీ సఫ్రాన్ సీఈవో ఓలీవియర్ ఆండ్రీస్.. రాజ్‌నాథ్‌ను కోరారు. భారత్‌లో తమ కంపెనీ 150 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పారిస్‌లోని ఆ కంపెనీ కర్మాగారాన్ని రాజ్‌నాథ్ బుధవారం సందర్శించారు.

### ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు

రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఫ్రాన్స్ రక్షణమంత్రి పార్లేతో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాల బలోపేతానికి విస్తృత చర్చలు జరిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు రెండు దేశాలు మరింత సహకారం అందించుకోవాలని నిర్ణయించారు. ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఇరుదేశాల సంయుక్త సైనిక విన్యాసాలను (శక్తి, వరుణ, గరుడ విన్యాసాలు) విస్తృత పరచాలని నేతలు నిర్ణయించారు. మరోవైపు, ఫ్రెంచ్ వాణిజ్య, పారిశ్రామిక దిగ్గజాలతో రాజ్‌నాథ్ సమావేశం కానున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5-8 మధ్య లక్నోలో నిర్వహించబోయే డిఫెన్స్ ఎక్స్‌పోకు వారిని ఆహ్వానించనున్నారు.

## ఆ 49 మందికి ఊరట

'రాజద్రోహం' కేసును ఉపసంహరించిన పోలీసులు

**పాట్నా/ముజఫర్‌పూర్:** ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై నమోదైన 'రాజద్రోహం' కేసును బీహార్ పోలీసులు ఉపసంహరించుకున్నారు. అవన్నీ తప్పుడు అభియోగాలు అని తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. దేశంలో మూకదాడులు, హత్యలు పెరుగడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రముఖ సినీ దర్శకులు అదూర్ గోపాలకృష్ణన్, మణిరత్నం, చరిత్రకారుడు రామచంద్రగుహతోపాటు వివిధ రంగాలకు చెందిన 49 మంది ప్రముఖులు లోక్‌సభ ఎన్నికల సమయంలో మోదీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీనిపై ఓ న్యాయవాది ముజఫర్‌పూర్ జిల్లా కోర్టును ఆశ్రయించగా, జడ్జి ఆదేశాల మేరకు గత వారం వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. 'న్యాయమూర్తి ఆదేశాలతో కేసు నమోదు చేశాం. అయితే వారి నేరాన్ని రుజువు చేసే ఆధారాలను ఫిర్యాదుదారు మాకు చూపలేదు. కనీసం వారు రాసిన లేఖను కూడా సమర్పించలేదు. దీంతోపాటు వివిధ కోణాల్లో దర్యాప్తు చేయగా వారిపై మోపినవన్నీ తప్పుడు ఆరోపణలని తేలింది. దీంతో కేసును మూసివేశాం' అని అదనపు డీజీపీ జితేంద్రకుమార్ బుధవారం తెలిపారు.

## భారత్ హిందూ దేశమే!



భారతీయులందరూ హిందువులే: మోహన్ భాగవత్

**నాగ్‌పూర్, అక్టోబర్ 8:** భారత్ హిందూ దేశమేనని, ఈ విషయంలో ఆరెస్సెస్ కృతనిశ్చయంతో ఉన్నదని ఆ సంస్థ అధిపతి మోహన్ భాగవత్ పేర్కొన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నగరంలోని రేషిమ్‌భాగ్ మైదానంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో భాగవత్ పాల్గొని మాట్లాడారు. 'దేశ గుర్తింపు, మనందరి సామాజిక గుర్తింపు.. వీటన్నింటికి సంబంధించి సంఘ్ ఆలోచనాధోరణి స్పష్టంగా, నిశ్చయంగా ఉన్నది. అది భారత్ హిందూస్థాన్.. హిందూదేశం' అని పేర్కొన్నారు. దేశంలో శాంతి నెలకొనేందుకు కృషి చేస్తున్న ప్రతి భారతీయుడూ హిందువేనని చెప్పారు. దేశంలో మూకహత్యలు పెరిగిపోతున్నాయన్న ప్రతిపక్షాల ఆందోళనపై స్పందిస్తూ.. 'ఇది (మూకహత్యలు) పశ్చిమ దేశాలకు, అక్కడి మతాలకు చెందిన భావజాలం. మనది సోదరభావంతో నిండిన దేశం. భారత్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ఇలాంటి పదాలు ఉపయోగించొద్దు' అని సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నదంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భాగవత్ మండిపడ్డారు.

## ఆసిమ్ ఉమర్ హతం



**ఇస్లామాబాద్:** అల్‌ఖైదా ఉగ్రసంస్థ కీలక నేత ఆసిమ్ ఉమర్ హతమయ్యాడు. భారత్‌కు చెందిన ఆసిమ్ అల్‌ఖైదా భారత ఉపఖండ విభాగానికి చీఫ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌లోని హెల్మాండ్ రాష్ట్రంలో అమెరికా-ఆఫ్ఘనిస్థాన్ సంకీర్ణ బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఆసిమ్ హతమైనట్టు మంగళవారం అధికారిక ప్రకటన వెలువడింది. గత నెల 23న హెల్మాండ్ రాష్ట్రంలోని ముసా కాలా జిల్లాలో ఉన్న అల్‌ఖైదా స్థావరంపై జరిపిన దాడిలో ఆసిమ్‌తోపాటు మరో ఆరుగురు ఉగ్రవాదులు హతమైనట్టు ఆఫ్ఘనిస్థాన్ రక్షణశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

## రాజ్‌నాథ్ ఆయుధ పూజ డ్రామా

- కాంగ్రెస్ పార్టీ విమర్శలు
- తిప్పికొట్టిన బీజేపీ

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్‌లో తొలి రాఫెల్ యుద్ధ విమానాన్ని స్వీకరించిన అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆయుధ పూజ నిర్వహించడం.. కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధానికి తెరతీసింది. ఆయుధ పూజ ఒక డ్రామా అని, రక్షణ సముపార్జనను బీజేపీ రాజకీయం చేస్తున్నదని కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నేత రషీద్ అల్వీ మాట్లాడుతూ.. 'ఇది డ్రామాల ప్రభుత్వం. మీరు ఫ్రాన్స్‌కు వెళ్లి, ఆయుధ పూజ నిర్వహిస్తున్నారు. లేకపోతే రాఫెల్ జెట్ భారత్‌కు రాదా? విదేశాలకు వెళ్లి మీరు ఈ డ్రామాలు ఆడుతున్నారు' అని విమర్శించారు. రాజ్‌నాథ్ ఆయుధ పూజ తమాషాగా ఉందని తాను చేసిన వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే స్పందించారు. ఆయుధ పూజను విమర్శించడం తన ఉద్దేశం కాదని, అయితే రాఫెల్ అందజేత, ఇతర సాంకేతిక అంశాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. రాఫెల్ భారత్‌కు రావడానికి 6-8 నెలల సమయం పడుతుందని, అలాంటప్పుడు వారు అక్కడ పూజ చేయడం ఎందుకుని, భారత్‌కు వచ్చాక చేయొచ్చు కదా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తీవ్రంగా మండిపడ్డారు. గతంలో ఖత్రోచీ సేవలో మునిగిన వారికి ప్రస్తుతం ఆయుధ పూజ సమస్యగా మారిందని ఎద్దేవా చేశారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలో బోఫోర్స్ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందంలో ఖత్రోచీ మధ్యవర్తిగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. బుధవారం హర్యానా ఎన్నికల సభలో అమిత్‌షా మాట్లాడుతూ.. విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించడం మన సంప్రదాయం అని చెప్పారు. అందుకే రాఫెల్‌కు పూజచేశామని, ఇది కాంగ్రెస్‌కు తమాషాగా కనిపిస్తున్నదని విమర్శించారు.

## మలేరియా నియంత్రణలో ఆదర్శం

మాతా, శిశు మరణాలు తగ్గాయి: కేంద్రం

**న్యూఢిల్లీ:** మలేరియా నియంత్రణలో భారత్ గొప్ప విజయం సాధించిందని, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. 2013తో పోల్చితే 2017 నాటికి మలేరియా మరణాలు గణనీయంగా తగ్గాయని బుధవారం వెల్లడించింది. మొత్తం మరణాల్లో మలేరియా మరణాలు 2013లో 50.52 శాతం ఉండగా, 2017 నాటికి 49.09 శాతానికి తగ్గిపోయాయి. జాతీయ ఆరోగ్య మిషన్ కింద చేపట్టిన కార్యక్రమాల అమలు, ఫలితాలపై బుధవారం కేంద్ర క్యాబినెట్ చర్చించింది. అనంతరం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 2005-2013 మధ్యకాలాన్ని ప్రస్తుత గణాంకాలతో పోల్చితే ప్రసవ సమయంలో మాతృ మరణాలు, శిశు మరణాల రేటు, ఐదేండ్లలోపు వయసున్న బాలల మరణాల రేటు క్రమంగా తగ్గుతున్నదని తెలిపింది. ప్రతి వెయ్యి మంది బాలల్లో మరణాల సంఖ్య 2008లో 69 ఉండగా, 2017 నాటికి 37కు తగ్గింది. ఇదే సమయంలో ప్రతి వెయ్యి జననాల్లో మరణించే శిశువుల సంఖ్య 53 నుంచి 33కు పడిపోయింది. ప్రతి లక్ష మంది బాలింతల్లో మరణాల సంఖ్య 2004లో 254 ఉండగా, 2016 నాటికి 136కు పరిమితమైంది.

## మలేరియా నాశకి.. టీసీఎండీసీ-135051

- వ్యాధి నియంత్రణకు సరికొత్త విధానాన్ని ఆవిష్కరించిన పరిశోధకులు



**న్యూఢిల్లీ:** మలేరియా నియంత్రణలో అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం సరికొత్త విధానాన్ని ఆవిష్కరించింది. దోమల్లో నివసించే ప్లాస్మోడియం పాల్సీపారమ్ అనే పరాన్న జీవి.. దోమకాటు ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించి మలేరియా వ్యాధిని కలుగజేస్తుంది. తాజాగా ఈ పరాన్నజీవులు మన శరీరంలోకి చేరిన తర్వాత ఎదుగకుండా అడ్డుకునే రసాయన మిశ్రమాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. దీనిని టీసీఎండీసీ-135051 అని పిలుస్తున్నారు. సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన వీరి పరిశోధన వ్యాసం ప్రకారం.. సాధారణంగా దోమకాటు ద్వారా ప్లాస్మోడియం పాల్సీపారమ్ పరాన్నజీవులు మానవ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రక్తంలోని ఎర్ర కణాల్లోకి ప్రవేశిస్తాయి. అలైంగిక ప్రత్యుత్పత్తి, లైంగిక ప్రత్యుత్పత్తి అనే రెండు విధానాల ద్వారా వాటి సంఖ్యను విపరీతంగా పెంచుకుంటాయి. అలైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా పరాన్నజీవులు ఉత్పత్తి అయ్యి రక్తంలోకి చేరి వ్యాధిని కలుగజేస్తాయి. లైంగిక ప్రత్యుత్పత్తి ద్వారా 'జైగోమాట్స్' అనే కణాలు వెలువడి రక్తంలో నిల్వ ఉంటాయి. దోమ కరిచినప్పుడు అవి మానవుడి నుంచి దోమ శరీరంలోకి వెళ్తాయి. ఈ రెండు విధానాల్లోనూ 'ఆర్‌ఎన్‌ఏ'లో జరిగే మార్పులే కీలకం. దీనికి 'ప్రొటీన్ కైనేజ్(పీఎఫ్‌సీఎల్కే-3)' అనే ఎంజైమ్ సమక్షంలోనే ఆర్‌ఎన్‌ఏలో మార్పులు జరుగుతాయి. శాస్త్రవేత్తలు అనేక ప్రయోగాల అనంతరం టీసీఎండీసీ-135051 రసాయన మిశ్రమం ప్రొటీన్ కైనేజ్‌ను నియంత్రిస్తున్నట్టు గుర్తించారు. 'మనం ప్రొటీన్ కైనేజ్‌ను నియంత్రించగలిగితే ఆర్‌ఎన్‌ఏలో మార్పులు కలుగవు. కాబట్టి ప్లాస్మోడియం కణాల సంఖ్య పెరగదు. ఫలితంగా మన శరీరంలోకి పరాన్న జీవులు చేరినా.. వ్యాధి వచ్చే అవకాశం ఉండదు' అని పరిశోధక బృంద సభ్యుడు పౌలో గోడియో పేర్కొన్నారు. తాము దాదాపు 25వేల మిశ్రమాలను ప్రయత్నించి చివరగా టీసీఎండీసీ-135051ను గుర్తించామని చెప్పారు. మలేరియా కారణంగా ఏటా ప్రపంచవ్యాప్తంగా ఐదు లక్షల మంది మరణిస్తున్నారు.

### ఏప్రిల్ నుంచి వాహనాలకు బీఎస్-4 ఇంధనం

కేంద్రమంత్రి జవదేకర్ వెల్లడి

**జైపూర్:** వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి దేశంలోని పెద్ద నగరాలలో భారత్ స్టేజ్ (బీఎస్)-4 ఇంధనం అందుబాటులోకి రానుందని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ చెప్పారు. దీంతో వాహనాల ద్వారా కలిగే కాలుష్యం 80-90 శాతం తగ్గిపోతుందని తెలిపారు. ఇందుకోసం రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని చెప్పారు. రాజస్థాన్‌లోని మాలవీయ జాతీయ సాంకేతిక సంస్థలో మంగళవారం మొక్కను నాటిన అనంతరం జవదేకర్ మాట్లాడారు. దేశంలోని 122 నగరాల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించడం కోసం ప్రభుత్వం జాతీయ స్వచ్ఛ వాయువు కార్యక్రమాన్ని రూపొందించిందని తెలిపారు. బీఎస్-4 ఇంధనానికి అనుగుణమైన వాహనాల అమ్మకాలు వచ్చే ఏడాది ప్రారంభమవుతాయన్నారు.

## ఏ ఒక్కరినీ వదలం



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోగా ప్రతి అక్రమ వలసదారుడిని వెళ్లగొడతాం: అమిత్ షా

**కైతల్/లోహరు/మెహెం(హర్యానా):** దేశంలో అక్రమంగా నివసిస్తున్న ఏ ఒక్కరినీ వదులబోమని, వారిని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోగా సొంతదేశాలకు తిరిగి పంపిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. హర్యానాలోని కైతల్, లోహరు, మెహెం ప్రాంతాల్లో బుధవారం జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభల్లో అమిత్‌షా పాల్గొని మాట్లాడారు. 'దేశమంతా ఎన్నార్సీ'.. బీజేపీ తదుపరి ప్రాధాన్య అంశమని చెప్పారు. బీజేపీ చేసే ప్రతిపనిని కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నదని, ఇప్పుడు దేశమంతా ఎన్నార్సీని సైతం వద్దంటున్నదని చెప్పారు. 'మేము 2024లో మళ్లీ ఓట్లు అడిగేందుకు వచ్చేముందే దేశంలోని ప్రతి అక్రమవలసదారుడిని వెళ్లగొడతాం' అని పేర్కొన్నారు. అసోం ఎన్నార్సీని ప్రస్తావిస్తూ.. 'చొరబాటుదారులు 70 ఏండ్లుగా దేశ భద్రతకు ముప్పుగా పరిణమించారు. అలాంటివారిని తరిమేయాలా? వద్దా?' అని ప్రశ్నించారు.




### ముస్లింలను బెదిరించడానికే 'ఎన్నార్సీ'

మహారాష్ట్ర ఎన్నికల సభలో అసదుద్దీన్ ధ్వజం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముస్లింలను బెదిరించడానికి, భయపెట్టడానికే దేశంలో జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)ను అమలు చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. అసోంలో చేపట్టిన ఎన్నార్సీ విఫలమైందని, ఇప్పుడు దేశవ్యాప్తంగా ఎన్నార్సీ పేరుతో మరో నాటకానికి తెరలేపుతున్నదని విమర్శించారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అసోంలో ఎన్నార్సీ సర్వేలో పేర్లు గల్లంతైన వారిలో ముస్లింలు తక్కువగా ఉండటంతో బీజేపీ నెత్తిపట్టుకున్నదన్నారు. ఎన్నార్సీ వల్ల ఒరిగేదేమీ లేదన్నారు.

### బీజేపీ-శివసేనను ఓడించాకే విశ్రాంతి: పవార్

**ముంబై:** మహారాష్ట్రలో బీజేపీ-శివసేనను ఓడించే వరకు విశ్రాంతి తీసుకోనని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ చెప్పారు. మరో రెండు నెలల్లో 79వ వసంతంలోకి అడుగుపెట్టనున్న ఆయన ఇప్పటికీ తాను యువకుడినేనని అన్నారు. బుధవారం మహారాష్ట్రలోని బాలాపూర్‌లో ఎన్నికల సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ-శివసేన ప్రభుత్వాన్ని ఇంటికి పంపిన తర్వాతే తాను విశ్రాంతి తీసుకుంటానన్నారు.

### నిందితుడికి శివసేన టికెట్

హర్యానా నుంచి ఎన్నికల బరిలోకి..

**బహదూర్‌గఢ్:** జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)విద్యార్థి సంఘం మాజీ నేత ఉమర్ ఖాలిద్‌పై దాడి చేసిన నిందితుడు నవీన్ దలాల్ హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. శివసేన టికెట్‌పై బహదూర్‌గఢ్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. బుధవారం నవీన్ దలాల్ మాట్లాడుతూ గోవులు, రైతులు, అమరవీరులు, పేదల పేరుతో బీజేపీ, కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. శివసేన ఇలాంటి రాజకీయాలు చేయదన్నారు.

# మహా హరితకుడ్యం!

- 1400 కి.మీ. పొడవు, 5 కి.మీ. వెడల్పుతో ఏర్పాటు
- గుజరాత్ నుంచి ఢిల్లీ-హర్యానా సరిహద్దు వరకు గ్రీన్‌బెల్ట్‌ను నిర్మించేందుకు కేంద్రం కసరత్తు
- పర్యావరణ మార్పులు, ఎడారీకరణను ఎదుర్కొనేందుకు బృహత్ ప్రణాళిక






**న్యూఢిల్లీ:** పర్యావరణ మార్పులు, ఎడారీకరణను ఎదుర్కొనేందుకు కేంద్రం బృహత్ ప్రణాళికను రచిస్తున్నది. ఆఫ్రికాలో సెనెగల్ నుంచి జిబౌతీ వరకు నిర్మించనున్న మహా హరితకుడ్యం (గ్రేట్ గ్రీన్ వాల్) తరహాలో గుజరాత్ నుంచి ఢిల్లీ-హర్యానా సరిహద్దుల వరకు 1,400 కి.మీ. పొడవు, 5 కి.మీ. వెడల్పుతో 'గ్రీన్ బెల్ట్' ఏర్పాటుచేసేందుకు కసరత్తు చేస్తున్నది. ప్రస్తుతం ఇది ప్రాథమిక దశలోనే ఉన్నప్పటికీ, వివిధ మంత్రిత్వ శాఖల అధికారుల్లో ఇది తీవ్ర ఆసక్తిని కలిగిస్తున్నది. పోర్‌బందర్ (గుజరాత్) నుంచి పానిపట్ (హర్యానా) వరకు గ్రీన్ బెల్ట్ ఏర్పాటుచేయడం ద్వారా నిస్సార భూములను పునరుజ్జీవింపజేయడంతోపాటు.. పశ్చిమ భారతం, పాకిస్థాన్ ఎడారుల నుంచి వచ్చే దుమ్ము, ధూళిని అడ్డుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఇందులో భాగంగా గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ వరకు విస్తరించిన ఆరావళి పర్వత శ్రేణుల గుండా అడవులను పెంచనున్నారు.

**ఆరావళి శ్రేణి గుండా..**

'భారత్‌లో ఇటీవల నిర్వహించిన యూఎన్‌సీసీడీ (ఎడారీకరణను ఎదుర్కొనేందుకు ఐక్యరాజ్యసమితి సమ్మేళనం- కాప్14) సదస్సు ఎజెండాలో భాగమే గ్రీన్ బెల్ట్ ఏర్పాటు యోచన. అయితే ఇందుకు ఇంకా తుది అనుమతి రాలేదు' అని ఒక అధికారి వెల్లడించారు. 2030 నాటికి 26 మిలియన్ హెక్టార్ల నిస్సార భూములను సారవంతం చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా జాతీయ ప్రాధాన్యత కింద భారత్ గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు యోచిస్తున్నది. ప్రాజెక్టుకు ఆమోదం లభించగానే, రైతులను, ఇతర ప్రైవేట్ భూముల యజమానులను కలుపుకొని నిస్సారమైన అటవీ భూముల్లో అటవీకరణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. 26 మిలియన్ హెక్టార్ల నిస్సార భూమిని సారవంతం చేయాలన్న భారత లక్ష్యసాధనలో ఆరావళి జోన్ ప్రధానమైనది. దేశంలో ప్రస్తుతం 96.4 మిలియన్ హెక్టార్ల నిస్సార భూమి ఉన్నది. దేశం మొత్తం భూభాగంలో ఇది 29.3 శాతం. 2016లో ఇస్రో రూపొందించిన ఎడారీకరణ అట్లాస్ ప్రకారం.. దేశంలోని మొత్తం నిస్సార భూమిలో 50 శాతం భూభాగం గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీలోనే ఉన్నట్లు వెల్లడైంది.

**ఉత్తర, దక్షిణ కొరియాలు కూడా..**

గ్రేట్ గ్రీన్ వాల్‌ను సాకారం చేసేందుకు సహకరించాలని కాప్14 సందర్భంగా ఆఫ్రికన్ దేశాలు అంతర్జాతీయ సమాజాన్ని కోరాయి. యూఎన్‌సీసీడీ, ప్రపంచబ్యాంకు, యూరోపియన్ కమిషన్ సహకారంతో దశాబ్దం కిందట ఆఫ్రికన్ యూనియన్ ఈ ప్రాజెక్టును చేపట్టింది. అయితే ఇప్పటివరకు 15% మాత్రమే పూర్తయింది. గ్రేట్ గ్రీన్ వాల్ తరహాలో ఉత్తర కొరియా, దక్షిణకొరియాలు సైనిక రహిత జోన్ సహా ఇరు దేశాల ఘర్షణాత్మక ప్రాంతాల్లో పీస్ ఫారెస్ట్ ఇనిషియేటివ్(పీఎఫ్‌ఐ) పేరిట అడవులను అభివృద్ధి చేయాలని నిర్ణయించాయి. పెరు, ఈక్వెడార్ కూడా పీస్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాయి.

### ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా బాంబు దాడులు.. 30 మంది మృతి

**కాబూల్:** ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్లకు చెందిన మాదక ద్రవ్యాల కేంద్రాలపై ఈ ఏడాది మే 5న అమెరికా జరిపిన బాంబు దాడుల వల్ల 30 మంది పౌరులు మరణించారని ఆఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ (యూఎన్‌ఏఎంఏ) తెలిపింది. 'బాంబు దాడులపై దర్యాప్తు జరిపాం. 30 మంది పౌరులు చనిపోయారు' అని పేర్కొంది. ఫర్హా రాష్ట్రంలోని బక్వా జిల్లాపై, నిమ్రోజ్ రాష్ట్రంలోని డెలారం జిల్లాపై ఈ దాడులు జరిగాయని వెల్లడించింది.

### రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా: షెహ్లా రషీద్

**న్యూఢిల్లీ:** కొద్దికాలం కిందట జమ్ముకశ్మీర్ పీపుల్స్ పార్టీలో చేరిన జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం మాజీ నాయకురాలు షెహ్లా రషీద్ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు బుధవారం ప్రకటించారు. కశ్మీర్‌లో త్వరలో బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (బీడీసీ) ఎన్నికలు నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు.



వైమానిక దినోత్సవంలో తేజస్ యుద్ధవిమానం విన్యాసాలు (ఇన్‌సెట్‌లో) సైనికుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న వాయుసేన చీఫ్ ఆర్కేఎస్ భదౌరియా

### ఉగ్రపోరులో భారత విధానం మారింది

వాయుసేన దినోత్సవం సందేశంలో ఎయిర్‌ఫోర్స్ చీఫ్ భదౌరియా

**ఘజియాబాద్:** ఉగ్రవాదుల దాడులను ఎదుర్కోవడంలో, ఉగ్రవాదానికి ఊతమిచ్చే వారిని శిక్షించడంలో భారత విధానం మారిందని, ఇందుకు బాలాకోట్‌పై జరిపిన దాడులే నిదర్శనమని వాయుసేన అధిపతి ఆర్కేఎస్ భదౌరియా చెప్పారు. భవిష్యత్తులో భారత్ చేపట్టేబోయే అన్నిరకాల సైనిక చర్యలు విజయవంతమయ్యేందుకు వాయుసేన తన సాయుధ సంపత్తితో సదా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వాయుసేన 87వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భదౌరియా తన దళానికి సందేశమిచ్చారు. బాలాకోట్‌పై జరిపిన దాడి భారత ప్రభుత్వ రాజకీయ నిశ్చయతను, వైమానిక దళం సామర్థ్యాన్ని తెలియజేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలాకోట్‌పై జరిగిన దాడుల్లో పాల్గొన్న రెండు స్క్వాడ్రన్లు, ఒక సిగ్నల్ యూనిట్‌ను వాయుసేన ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో సత్కరించింది. ఈ సందర్భంగా వాయుసేన యుద్ధ విమానాలతో విన్యాసాలను ప్రదర్శించింది. బాలాకోట్‌పై దాడి తదనంతర ఘటనల్లో పాక్ యుద్ధ విమానాన్ని కూల్చేసిన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ కూడా ఒక విమానాన్ని నడుపుతూ ఈ విన్యాసాలలో పాల్గొన్నారు.

## దేవరగట్టు రక్తసిక్తం

**కర్నూలు:** ఏపీలోని కర్నూలు జిల్లా హోళగుంద మండలం దేవరగట్టులో ఏటా దసరా రోజు నిర్వహించే కర్రల సమరం(బన్నీ ఉత్సవం)లో 50 మందికి పైగా గాయపడగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని ఆదోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తమ ఇలవేల్పును దక్కించుకొనేందుకు ఐదు గ్రామాల ప్రజలు రెండు వర్గాలుగా ఏర్పడి కర్రలతో తలపడ్డారు. ఇందులో ఇరువర్గాలకు తీవ్ర గాయలయ్యా. ఈ ఉత్సవాలను తిలకించేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు రాగా, కలెక్టర్ వీరపాండియన్, ఎస్పీ ఫకీరప్ప పరిస్థితిని పర్యవేక్షించారు.



## ఆస్ట్రేలియాలో టీటా అలాయ్ బలాయ్

- టీటా ఆస్ట్రేలియా అధ్యక్షుడిగా నరేశ్ లాలా
- ప్రకటించిన టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మక్తాలా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆస్ట్రేలియాలో బుధవారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటా ఆస్ట్రేలియా నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా నరేశ్ లాలాను నియమిస్తున్నట్టు టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మక్తాలా ప్రకటించారు. ఈ సందర్భంగా సందీప్ మక్తాలా మాట్లాడుతూ.. యువత అమెరికా తర్వాత ఆస్ట్రేలియావైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారన్నారు. కెనడాలోని విద్యార్థులకు కొత్త టెక్నాలజీపై ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇస్తున్నామని, ఆస్ట్రేలియాలోనూ ఈవిధమైన శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. స్టార్టప్ ప్రారంభించాలనుకొనే వారు టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో భాగస్వామ్యం పొందవచ్చని సూచించారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా అరుణ్ కే సింగారి, పవన్ కే సింగారి, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్ కే గోరెంక, కార్యదర్శిగా సాయికుమార్ చనమోల, సంయుక్త కార్యదర్శిగా గోకుల్ కీర్తి, కోశాధికారిగా ప్రదీప్ కొల్లూరును ఎన్నుకొన్నారు.



ఆస్ట్రేలియాలో అలాయ్ బలాయ్ కార్యక్రమంలో టీటా నూతన కార్యవర్గ సభ్యులు




గతంలో హతమార్చిన చిరుతతో వేటగాడు షఫత్ అలీ


కుమారుడు అస్గర్‌అలీతో షఫత్ అలీ

## బందీపూర్‌కు హైదరాబాద్ వేటగాడు

- నరభక్ష పెద్దపులి వేట.. కాల్చివేతకు ఆదేశాలు
- నగరం నుంచి వేటకు వెళ్లిన షఫత్‌అలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కర్ణాటక బందీపూర్ అభయారణ్యంలో నరమాంసానికి అలవాటుపడిన పెద్దపులి కోసం వేట మొదలైంది. పెద్దపులిని బంధించాలని లేకపోతే కాల్చిచంపాలని కర్ణాటక అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు పెద్దపులుల వేటలో ఆరితేరిన హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ షూటర్ నవాబ్ షఫత్ అలీ ఖాన్, ఆయన కొడుకు అస్గర్‌అలీ బందీపూర్‌కు బయలుదేరివెళ్లారు. అత్యాధునిక ట్రాంక్విలైజర్లు, తుపాకులను కలిగి ఉన్న షఫత్‌అలీ దేశంలో ఎక్కడ పెద్దపులులు, ఏనుగులు, ఇతర క్రూరమృగాలతో సమస్య తలెత్తినా తానున్నాంటూ అక్కడ ప్రత్యక్షమవుతారు. కర్ణాటక బందీపూర్ అభయారణ్యంలో ఒక పెద్దపులి చౌదనహళ్లి, హుండిపురాలో ఇద్దరు మనుషులను వేటాడి చంపడం కలకలం సృష్టిస్తున్నది. పెద్దపులుల దాడుల నేపథ్యంలో స్థానిక ప్రజలు ఆందోళన చేస్తున్నారు. అధికారులను ఘెరావ్ చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పెద్దపులిని ట్రాంక్విలైజ్ చేసి (మత్తుమందు ఇచ్చి) బంధించడం లేదా కాల్చిచంపాలని అధికారులు నిర్ణయించారు. పెద్దపులి సమస్యను వెంటనే పరిష్కరించడానికి ప్రజలు తమతో సహకరించాలని మహారాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ కోరారు. ఈ క్రమంలో షఫత్ అలీ బృందం అక్కడికి చేరుకొన్నది. షఫత్‌అలీ, అతని కొడుకును అనుమతించరాదని పర్యావరణ, జంతుప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు షఫత్‌అలీ దాదాపు 300 క్రూరమృగాలను చంపడం లేదా బంధించి రికార్డు సృష్టించారు. ఇదేక్రమంలో ఇటీవల మహారాష్ట్రలోని యావత్‌మల్‌లో అవని అనే పెద్దపులిని కాల్చిచంపడం దేశవ్యాప్తంగా వివాదాన్ని రేపింది. పెద్దపులిని బంధించే అవకాశమున్నా తండ్రీకొడుకులు కాల్చిచంపుతున్నారని ఆరోపణలున్నాయి. దీంతో మొదట షఫత్‌అలీని ఆహ్వానించిన అటవీశాఖ అధికారులు వెనకడుగువేశారని సమాచారం. తాము మత్తుమందిచ్చి పట్టుకుంటామని అంతవరకు ఎలాంటి చర్య చేపట్టవద్దని షఫత్‌అలీకి స్పష్టంచేసినట్లు బందీపూర్ ఫీల్డ్ డైరెక్టర్ బాలచంద్ర తెలిపారు.

## భూమా అఖిలప్రియ భర్త భార్గవపై కేసు

- గచ్చిబౌలి పీఎస్‌లో నమోదు

**శేరిలింగంపల్లి:** ఏపీకి చెందిన మాజీమంత్రి భూమా అఖిలప్రియ భర్త భార్గవ రామానాయుడుపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలు జిల్లా జోర్నిపాడు మండలం కొండాపురానికి చెందిన పైడేల శివరామరెడ్డి, ఆళ్లగడ్డకు చెందిన భూమా శోభా నాగిరెడ్డి కలిసి 2012లో ఆళ్లగడ్డ పెద్ద కందుకూరులో క్రషర్ ఇండస్ట్రీని స్థాపించారు. శోభా నాగిరెడ్డి తదనంతరం ఆమె వాటా కుమార్తె భూమా అఖిలప్రియకు ఇచ్చారు. గత నెల 14న అఖిలప్రియ భర్త భార్గవ పది మంది అనుచరులతో కలిసి వెళ్లి సదరు క్రషర్ ఇండస్ట్రీని తనకు అప్పగించాలని శివరామిరెడ్డితోపాటు ఉద్యోగులు, సిబ్బందిని బెదిరించడంతోపాటు దాడికి పాల్పడ్డాడు. ఈ నెల 1న బాధితుడు శివరామిరెడ్డి భార్య భార్గవి లత ఫిర్యాదు మేరకు ఆళ్లగడ్డ రూరల్ ఎస్సై రమేశ్ కుమార్.. భార్గవతోపాటు పది మంది అనుచరులపై కేసు నమోదుచేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏ1 నిందితుడిగా ఉన్న భార్గవను పట్టుకొనేందుకు ఎస్సై రమేశ్ ఈ నెల 7న రాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు గచ్చిబౌలి నానక్‌రాంగూడలో నిఘా పెట్టారు. నలుపు రంగు ఫార్చునర్ కారును నడుపుకొంటూ వెళ్తున్న భార్గవను గమనించిన ఎస్సై తన బృందంతో అతన్ని ఆపేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన భార్గవ వారిని ఢీకొట్టినట్టు చేసి, భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో ఎస్సై ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు భార్గవపై 353, 336 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు.

# స్వైన్‌ఫ్లూపై సమరం

- 33 జిల్లాల్లోని 39 దవాఖానల్లో ప్రత్యేక వార్డులు
- అందుబాటులో మందులు, వైద్య పరికరాలు
- మూడుచోట్ల పరీక్షాకేంద్రాలు


స్వైన్‌ఫ్లూ సోకిన రోగికి వైద్యం చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా స్వైన్‌ఫ్లూ (హెచ్1 ఎన్1) వ్యాధి ప్రబలితే సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్యశాఖ సర్వం సిద్ధం చేసుకున్నది. 33 జిల్లాల్లోని 39 దవాఖానల్లో హెచ్1 ఎన్1 వ్యాధికి సంబంధించిన వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు. ఆరోగ్యశాఖ అంచనా ప్రకారం నవంబర్‌లో నెలకొనే వాతావరణానికి అనుగుణంగా హెచ్1 ఎన్1 సోకే ప్రమాదం ఉన్నదని, దీనిని నియంత్రించేందుకు చేపట్టిన ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా దవాఖానల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేయడంతోపాటు మందులు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచారు. 15 లక్షల ఒసాల్డోవీర్ యాంటీ వైరల్ క్యాప్సుల్స్, సిరప్‌లను దవాఖానలకు పంపిణీచేశారు. 3,540 యాంటీ స్వైన్‌ఫ్లూ పిడియాట్రిక్ సిరప్, 11,570 డబుల్ ప్రొటెక్షన్ మాస్కులు, 4,275 హెచ్1 ఎన్1 నిర్ధారణ కిట్లు, 12,200 వైరల్ ట్రాన్స్‌పోర్టు మీడియా కిట్లు, శానిటైజర్లు అందుబాటులో ఉంచారు. హెచ్1 ఎన్1 నిర్ధారణ కోసం నారాయణగూడలోని ఐపీఎం కేంద్రంతోపాటు ఉస్మానియా, గాంధీ దవాఖానల్లో కూడా హెచ్1 ఎన్1 నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ప్రైవేట్ దవాఖానల్లో కాకుండా ఈ మూడు పరీక్షా కేంద్రాల్లో స్వైన్‌ఫ్లూ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది.

### ప్రత్యేక వార్డుల ఏర్పాటు

స్వైన్‌ఫ్లూ వైద్యసేవలను అందించేందుకు 33 జిల్లాల పరిధిలో 39 దవాఖానల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటుచేశారు. అందులో 487 బెడ్లను అందుబాటులో ఉంచారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, ఫీవర్, నిలోఫర్, కింగ్‌కోటి జిల్లా దవాఖాన, నాంపల్లి, మలక్‌పేట్ ఏరియా దవాఖానల్లో 167 బెడ్లను అందుబాటులో ఉంచారు. మిగిలిన 32 జిల్లాల్లోని జిల్లా దవాఖానల్లో ప్రత్యేక వార్డులను విభజించి ఒక్కో దవాఖానలో ప్రస్తుతం 10 బెడ్ల చొప్పున 320 అందుబాటులో ఉంచారు. హెచ్1 ఎన్1కు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు, ఆయా వైద్యవిభాగాలు తెలుసుకొనేందుకు, తెలియజేసేందుకు రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూంను ఏర్పాటుచేశారు. హెచ్1 ఎన్1 నిర్వహణకు సంబంధించిన సమస్యలు, వాటి పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందం పనిచేస్తుంది. ఈ రాష్ట్రస్థాయి బృందంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని కమ్యూనికబుల్ డిసీజెస్ విభాగం అదనపు డైరెక్టర్ పీఎన్ శోభాదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ శివబాల్‌రాజ్ రెడ్డి, సీహెచ్‌వోలు ఎన్ సునీల్‌రాజ్, విజయ్ కుమార్, మల్లేశం, ఎంపీహెచ్‌ఈవోలు బసంత్, ఎంఏ బారి, మైక్రోబయాలజిస్ట్ పీ ముక్కంటేశ్వర్ ఉన్నారు.

## నియమావళిని పాటించాల్సిందే

- హుజూర్‌నగర్‌లో ప్రచారం పిటిషన్‌పై హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నికల్లో పోటీచేయడం, ప్రచారం చేసుకోవడం చట్టబద్ధమైన హక్కు అని, అయితే, ఎన్నికల నియమావళి ప్రకారం సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకొని ప్రచారం చేసుకోవచ్చని హైకోర్టు స్పష్టంచేసింది. తనను హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో ప్రచారం చేసుకోకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని తీన్మార్ మల్లన్న అలియాస్ నవీన్‌కుమార్ హైకోర్టులో బుధవారం హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల తరపున ప్రభుత్వ న్యాయవాది టీ శ్రీకాంత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) నిర్ధారించిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ను పిటిషనర్ పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంసీసీ ప్రకారం సభలు, సమావేశాలు, ప్రచారానికి అవసరమైన అనుమతులను సంబంధిత అథారిటీ నుంచి పొందాలని అన్నారు. ప్రచారానికి పిటిషనర్ అనుమతి తీసుకోలేదని తెలిపారు. అనుమతి తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదని పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఎంసీసీ ప్రకారం వ్యవహరించాలని, సరైన అనుమతులు తీసుకొని ప్రచారం చేసుకోవాలని, అనుమతులు ఉంటే ప్రచారం విషయంలో జోక్యం చేసుకోవద్దని సూచించింది. చట్టం ప్రకారం నడుచుకోవాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

## క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ పురస్కారాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన క్రిస్టియన్ మైనార్టీ సామాజిక వర్గానికి చెందినవారికి 2019 సంవత్సరానికిగాను పురస్కారాలు అందజేయనున్నట్టు క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతివెస్లీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, వైద్యం, విద్య, సాహిత్యం, ఫైన్‌ఆర్ట్స్, క్రీడలు వంటి రంగాల్లో కనీసం పదేండ్లు పనిచేసిన వారు, ఆరోగ్య, విద్య, సామాజిక సేవా సంస్థల్లో కనీసం 30ఏండ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారు మాత్రమే ఈ పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేస్తామని, ఈ నెల 10 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం www.tscmfc.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# పంట రుణాల్లో బ్యాంకుల నిర్లక్ష్యం

- వానకాలం లక్ష్యంలో 59శాతం దాటని రుణాలు
- లక్ష్యం రూ.29,244 కోట్లు.. సెప్టెంబర్ 23నాటికి ఇచ్చింది రూ.17,087కోట్లు
- లక్ష్యాన్ని నెరవేర్చకుండానే యాసంగిలో ఇస్తామని ఎస్సెల్బీసీలో హామీ!

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు పంట రుణాలివ్వడంలో బ్యాంకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు ఎస్సెల్బీసీ సమావేశాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా పంట రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా.. బ్యాంకులకు అవేమీపట్టడం లేదు. వానకాలం ముగుస్తున్నా ఇప్పటికీ బ్యాంకులు ఇచ్చిన పంట రుణాలు 59శాతం కూడా దాటలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ వానకాలం పంట రుణలక్ష్యం రూ.29,244కోట్లు కాగా, సెప్టెంబర్ 23వరకు కేవలం రూ.17,087కోట్లు మాత్రమే పంపిణీచేశాయి. లక్ష్యంలో కేవలం 58.84శాతం మాత్రమే పంపిణీ చేసినట్టు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి నివేదిక ద్వారా స్పష్టమవుతున్నది. ప్రభుత్వరంగ బ్యాంకులు 18 ఉంటే వీటిలో రెండు బ్యాంకులు మాత్రమే లక్ష్యాన్ని మించి పంట రుణాలు ఇచ్చాయి. ఇందులో కెనరా, ఇండియన్ బ్యాంకులున్నాయి. మిగిలిన 16 బ్యాంకుల రుణాలు 75శాతం దాటలేదు. ప్రధాన బ్యాంక్ కావడంతోపాటు ఎస్‌ఎల్‌బీసీ లీడ్ బ్యాంక్‌గా ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణాల పంపిణీ లక్ష్యం రూ.7,986కోట్లు కాగా గత నెల 23 వరకు ఇచ్చినవి కేవలం రూ.4,667కోట్లు (58.44 శాతం) మాత్రమే ఇచ్చింది. ఇక ప్రైవేట్ సెక్టార్‌లో మొత్తం 16 బ్యాంకులకుగాను ఒకే ఒక బ్యాంకు మాత్రమే లక్ష్యాన్ని మించి పంట రుణాలు ఇచ్చింది. ప్రైవేట్ బ్యాంకుల వానకాలం పంట రుణ లక్ష్యం రూ.2,433కోట్లు కాగా, ఇచ్చింది సగం దాటలేదు. కేవలం రూ.1,249 కోట్లు మాత్రమే పంపిణీచేశాయి. కో-ఆపరేటివ్ బ్యాంకుల పరిస్థితి కొంత పర్వాలేదు. రుణ పంపిణీ లక్ష్యం రూ.3,335కోట్లు కాగా, రూ.2,092 కోట్లు (62శాతం) ఇచ్చాయి. వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీ రుణాల చెల్లింపుపై ప్రభుత్వం త్వరలోనే బకాయిలు చెల్లిస్తామని బ్యాంకర్లకు స్పష్టంచేసింది. అయినా చాలాచోట్ల బ్యాంకులు ముక్కుపిండి రైతుల నుంచే వడ్డీ వసూలు చేస్తున్నాయి. పావలా వడ్డీకి రుణాలు, వడ్డీలేని రుణాల కింద ప్రభుత్వం నుంచి బ్యాంకులకు రూ.1,043కోట్లు ఇవ్వాల్సి ఉన్నది.



### 60శాతం రైతులకు అందని రుణాలు

రాష్ట్రంలో 57 లక్షల మంది రైతులు ఉన్నారని వ్యవసాయశాఖ లెక్కలు చెప్తున్నాయి. ఇప్పటి వరకు పంట రుణాలు తీసుకున్న రైతులు 19.22 లక్షల మంది మాత్రమే. అంటే 37.78లక్షల మంది రైతులకు బ్యాంకులు మొండిచేయి చూపాయి. ఇక అగ్రిమెంట్ టర్మ్ రుణాలు ఇప్పటివరకు 14.66శాతమే ఇచ్చారు. ఈ ఏడాది వ్యవసాయ టర్మ్ రుణాలు రూ.11,445 కోట్లు, అనుబంధరంగాలకు రూ.8,410 కోట్లు పంపిణీ లక్ష్యంగా ఉండగా, సెప్టెంబర్ చివరినాటికి రూ.2,911కోట్లు మాత్రమే ఇచ్చాయి.

# పిడుగుపాటుకు పదిమంది మృతి

- ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో బీభత్సం
- పలువురికి తీవ్ర గాయాలు
- మూగజీవాలు మృత్యువాత
- గ్రేటర్‌లో మూడురోజులు అప్రమత్తం
- మొదలైన రుతుపవనాల తిరోగమనం


ఖమ్మం జిల్లా ముదిగొండలో పిడుగుపాటుతో మృతిచెందిన బలంతు ప్రవీణ్, ఇరుకు శ్రీను, గుద్దేటి నవీన్,
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మృతులు వెంకటయ్య, కుమ్మరి శ్రీను, అనురాధ (ఫైల్‌ఫొటోలు)

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** పండుగ పూట రాష్ట్రంలో పిడుగుల మోత మోగింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానతోపాటు, పలుచోట్ల పిడుగులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల పిడుగులు పడి పదిమంది మృత్యువాత పడ్డారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పదుల సంఖ్యలో మూగజీవాలు బలయ్యాయి. ఖమ్మం జిల్లాలో నలుగురు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఐదుగురు, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మృతిచెందారు. గాయాలపాలయినవారు దవాఖాల్లో చికిత్స పొందుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ముదిగొండ మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ సమీపంలోని వేపచెట్టుపై మంగళవారం సాయంత్రం పిడుగు పడటంతో దానికింద ఉన్న ఇరుకు శ్రీను(20), గుద్దేటి నవీన్ (19), బలంతు ప్రవీణ్(19) అక్కడికక్కడే మృతిచెందారు. ఉసికల గోపికి తీవ్రగాయాలయ్యాయి. కారేపల్లి మండలం చిన్నకట్టుగూడెం గ్రామానికి చెందిన లకావత్ రవి(33) పక్క గ్రామం మల్లన్నగూడెంలో ఓ రైతు మిర్చితోటలో పాటుచేయడానికి వెళ్లాడు. పిడుగుపడడంతో రవి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌లో పిడుగు పడటంతో పొలంవద్ద ఉన్న వెంకటయ్య (50) మృతిచెందాడు. టంకర గ్రామంలో అంజిలయ్యకు చెందిన ఎద్దు మృతి చెందింది. భూత్పూరు మండలం తాటిపర్తికి చెందిన కుమ్మరి శ్రీను (26) పశువులను మేతకు తీసుకెళ్లగా.. సాయంత్రం పిడుగుపాటుకు బలయ్యాడు. నవాబ్‌పేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కర్నెగొళ్ల గోపాల్ (58) సాయంత్రం తన వ్యవసాయ పొలంలో చెట్టు కింద కట్టేసిన ఎద్దును ఇంటికి తీసుకెళ్లే క్రమంలో అకస్మాత్తుగా ఈదురుగాలులు రావడంతో చెట్టుపై పిడుగు పడింది. దీంతో గోపాల్‌తోపాటు ఎద్దు కూడా మృతిచెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సింగవట్నంకు చెందిన చుక్కా బాలస్వామి కూతురు అనురాధ(23) ఎద్దులను కొట్టంలో కట్టేందుకు వెళ్లగా అదే సమయంలో పిడుగుపడింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన ఆమెను కొల్లాపూర్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రానికి చెందిన కుంటోళ్ల శివ (22) బుధవారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందగా, ఆయన తండ్రి బాలయ్య ప్రమాదం నుంచి బయటపడ్డాడు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బోడంపహాడ్‌కు చెందిన మంగళి నరేశ్(17) పిడుగు పాటుకు మృతి చెందగా, చాకలి అంజయ్య(29), ముజాఫర్(18)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లిలో మంగళవారం రాత్రి పిడుగు పడి తాళ్ల అశోక్ గౌడ్‌కు చెందిన మూడు ఆవులు, ఒక లేగ దూడ మృత్యువాత పడ్డాయి. ఆమనగల్లు మండలంలోని శంకర్‌కొండ తండా పంచాయతీ పరిధిలో ఇస్లావత్ లాలుకు చెందిన పాడి ఆవు, చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామంలో రైతు యాదయ్యకు చెందిన బర్రె, షాద్‌నగర్‌మండలం విఠ్యాల గ్రామానికి చెందిన టీకే నాయక్‌కు చెందిన ఆవు మృతిచెందాయి. మొయినాబాద్ మండలం సురంగల్-నజీబ్‌నగర్ రెవెన్యూ శివారులో పిడుగు పడి పశువుల మేత దహనమయింది. ఏపీలోని గుంటూరు జిల్లా మండలం వెదుళ్లపల్లె రైల్వేట్రాక్ సమీపంలో పిడుగుపడి 150 గొర్రెలు మృతిచెందాయి.

### గ్రేటర్ హైదరాబాద్‌లోనూ..

రాజధాని హైదరాబాద్‌లోనూ పలుచోట్ల పిడుగులు పడ్డాయి. చాదర్‌ఘాట్‌లోని ఇల్లు పిడుగుపాటుకు పూర్తిగా దెబ్బతిన్నది. మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 వరకు గ్రేటర్‌లోని ఉప్పల్‌లో అత్యధికంగా 6 సెం.మీలు, అల్కాపురి, నాగోల్‌లలో 4.6 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. ఖైరతాబాద్ మెట్రోస్టేషన్‌లోకి వరద నీరు చేరింది. పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పిల్లర్ నం.180-190 మధ్య ఉన్న ర్యాంప్ వద్ద వరద నీరు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

## నెలాఖరుదాకా నైరుతి ప్రభావం!

వచ్చే రెండురోజుల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర కోస్తాంధ్ర పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 3.6 కిలోమీటర్ ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. అక్కడి నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్‌ల ఎత్తులో కామెరూన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. దీనిప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. వాయవ్య భారతదేశంలో పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల నుంచి బుధవారం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం మొదలైంది. తెలంగాణలో రుతుపవనాల తిరోగమనం మూడోవారంలో మొదలై ఈ నెలాఖరులో పూర్తవుతుందని అధికారులు అంచనావేస్తున్నారు.


పట్టాలు తప్పిన క్రషర్ మిషన్ రైలింజిన్

## పట్టాలుతప్పిన రైలింజిన్

- కర్నూలు -కాచిగూడ మార్గంలో ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- పలు రైళ్ల దారిమళ్లింపు.. మరికొన్ని పాక్షికంగా రద్దు

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/నమస్తే తెలంగాణ:** మహబూబ్‌నగర్ సమీపంలోని మన్యంకొండ స్టేషన్ దగ్గర క్రషర్ మిషన్ ఇంజిన్ రైలు పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కానీ, కాచిగూడ-కర్నూలు మార్గంలో రైళ్లన్నీ ఆలస్యంగా నడుస్తున్నాయి. పట్టాల మరమ్మతులకు ఉపయోగించే బలాస్ట్ క్లీనింగ్ మెషిన్ (బీటీఎం) రైలు మన్యంకొండ స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం పట్టాలు తప్పడంతో కాచిగూడ - కర్నూలు మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని మహబూబ్‌నగర్ స్టేషన్ మేనేజర్ ప్రసన్నకుమార్ చెప్పారు. పలు రైళ్లను సమీప స్టేషన్లలో ఆపేశామని, మరికొన్ని రైళ్లను దారి మళ్లించామని తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఆక్సిడెంట్ రిలీఫ్ వెహికిల్ (ప్రత్యేక రైలు) సిబ్బంది పట్టాలు తప్పిన రైలును ట్రాక్‌పైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రైలును ట్రాక్‌పైకి తీసుకొచ్చేందుకు అర్ధరాత్రి వరకు సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బీటీఎం రైలును అక్కడినుంచి తరలించిన తర్వాత రైళ్ల రాకపోకలకు అనుమతి ఇవ్వనున్నారు.

### నిలిచిన తుంగభద్ర ఎక్స్‌ప్రెస్

సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో బీటీఎం రైలు పట్టాలు తప్పడంతో ఆ సమయంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలును మన్యంకొండ వద్ద ఆపేశారు. రవాణా, పోలీసు శాఖాధికారులు పది ప్రత్యేక బస్సుల ద్వారా పలువురు ప్రయాణికులను హైదరాబాద్ తరలించారు. మిగతావారికి మ్యాక్సి క్యాబ్ ఏర్పాటు చేసి తరలించే ప్రయత్నంచేశారు. రైల్వే డీఆర్‌ఎం సీతా రాంప్రసాద్ ఘటన స్థలానికి చేరుకొని మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

### రైళ్ల దారి మళ్లింపు

కాచిగూడ వైపు నుంచి గద్వాల, కర్నూలు మీదుగా తిరుపతి, బెంగళూరు వైపు వెళ్లాల్సిన పలు రైళ్లను వికారాబాద్, రాయచూరు, గుంతకల్ మీదుగా దారి మళ్లించారు. తిరుపతి, చిత్తూరు, బెంగళూరు వైపు నుంచి కాచిగూడ రావాల్సిన రైళ్లను గుంతకల్, రాయచూర్, వికారాబాద్ మీదుగా దారి మళ్లించారు. కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ స్టేషన్ వరకు వచ్చిన కాచిగూడ - గుంటూరు ప్యాసింజర్ రైలు, కాచిగూడ - కర్నూలు హంద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను మహబూబ్‌నగర్ వరకు నడిపి తిరిగి కాచిగూడ తిప్పి పంపించారు. కర్నూలు - కాచిగూడ తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ దేవరకద్ర రైల్వేస్టేషన్‌లోనే ఆపేశారు. రాయచూర్- కాచిగూడ డెమో రైలును గద్వాల స్టేషన్‌లో నిలిపేశారు. ఎక్కడి రైళ్లు అక్కడే ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరా పండుగ ముగించుకొని గమ్యస్థానాలకు చేరుకొనే క్రమంలో చిన్నపిల్లలతో తల్లులు అవస్థలు పడ్డారు. రవాణాశాఖ, పోలీసులు సత్వరం స్పందించి ప్రత్యేక బస్సులుఏర్పాటు చేయడం వల్ల కొద్ది మేర ఇబ్బందులు తగ్గాయి.

మొదటిపేజీ తరువాయి...

చొప్పున పునరావాస ప్యాకేజీని వర్తింపజేయాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. పీవోకే నుంచి వచ్చి దేశంలోని పలు ప్రాంతాల్లో స్థిరపడిన ఆ కుటుంబాలకు ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌లో పునరావాసం కల్పించింది. ఈ కుటుంబాలకు రూ.5.5 లక్షల ఆర్థిక సాయం అందుతుందని మంత్రి జవదేకర్ తెలిపారు. 1947లో పాకిస్థాన్ దురాక్రమణ సందర్భంగా పీవోకే నుంచి 31,619 కుటుంబాలు జమ్ముకశ్మీర్‌కు వలస వచ్చాయి. వీటిలో 26,319 కుటుంబాలు జమ్ముకశ్మీర్‌లో స్థిరపడగా, ఇతర కుటుంబాలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లాయి. ఆ తరువాత 1965, 1971లో జరిగిన భారత్-పాక్ యుద్ధం సందర్భంగా ఛాంబ్-నియాబత్ ప్రాంతానికి చెందిన 10,065 కుటుంబాలు నిర్వాసితులయ్యాయి. మొత్తంగా 36,384 నిర్వాసిత కుటుంబాలకు కేంద్ర క్యాబినెట్ 2016, నవంబర్ 30న ఒక ప్యాకేజీని ప్రకటించింది. జమ్ముకశ్మీర్‌లో స్థిరపడిన ఈ కుటుంబాలకు మాత్రమే ఆ ప్యాకేజీని అమలు చేసింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన 5,300 కుటుంబాలను మాత్రం ఈ ప్యాకేజీలో చేర్చలేదు. కాగా తాజాగా ఆ కుటుంబాలకు కూడా కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీని వర్తింపజేయాలని నిర్ణయించినట్టు జవదేకర్ తెలిపారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా లబ్ధి పొందేందుకు రైతులు తమ ఆధార్‌ను అనుసంధానం చేసే గడువును ప్రభుత్వం నవంబర్ 30వ తేదీ వరకు పొడిగించింది. రైతులకు అవసరమైన వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రూ.6,000 నగదును అందజేస్తున్న సంగతి తెలిసిందే. దేశంలోని 14 కోట్ల మంది రైతులకు ప్రభుత్వం మూడు విడుతలుగా నగదు మొత్తాన్ని విడుదల చేస్తున్నది. ఈ ఏడాది ఆగస్టు అనంతరం పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకున్న రైతులు తప్పనిసరిగా తమ ఆధార్‌ను అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నవంబర్ 30వ తేదీలోగా ఆధార్‌ను అనుసంధానించాలని ప్రభుత్వం తాజాగా గడువు విధించింది.

## కేంద్ర ఉద్యోగులకు డీఏ 5%


తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు మునిసిపల్ ఇంజినీరింగ్ శాఖ
నం. EE/PH/KMM/TUFIDC/ఇల్లందు/2019-20/03 ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన తేది: -10-2019
పనిపేరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మునిసిపాలిటీలో TUFIDC సహాయం క్రింద CCరోడ్లు (05పనులు) వేయుట. టెండరుకు పుంచిన అంచనా వ్యయం: రూ.60,38,389/- బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 9-10-2019న ఉ.10.00 గం. నుండి. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ:17-10-2019 మ.3.00 గం.వరకు. స్వీకరణకు ఆఖరి తేదీ, సమయం: 17-10-2019న సా.5.00 గం.వరకు. తెరచు తేదీ: 18-10-2019న ఉ.11.00 గం.నుండి మ.12.00 గం.వరకు. సంబంధిత EE పేరు, చిరునామా: శ్రీ వి.రంజిత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ప్రజారోగ్య డివిజన్, ఖమ్మం. తదుపరి వివరాలకు www.eprocurement.gov.in వద్ద గల ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో 9-10-2019న ఉ.10.00 గం నుండి చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ప్రజారోగ్య డివిజన్, ఖమ్మం.
DIPR RO. No. 1355-DP/CL/Advt/1/2019-20, Dt:09/10/2019



వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీభద్రకాళి అమ్మవారికి తెప్పోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. అమ్మవారి తెప్పోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. -మట్టెవాడ (వరంగల్)



దేశంలోనే ఐదో శక్తిపీఠం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని తుంగభద్ర నదిలో మంగళవారం రాత్రి ఆదిదంపతులకు (జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరులు) హంసవాహనంలో తెప్పోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. సంధ్యవేళలో నదీహారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. - అలంపూర్, నమస్తే తెలంగాణ



దసరా సంబురాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో మంగళ వారం సాయంత్రం ఉత్సవమూర్తుల పెద్దసేవ అంగరంగవైభవంగా సాగింది. పెద్దసేవపై ఉత్సవమూర్తుల ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. - వేములవాడ కల్చరల్



దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో ఉగ్ర, యోగ లక్ష్మీనరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దేవస్థానం నుంచి నందిచౌక్, చింతామణి చెరువుగట్టు మీదుగా శమీవృక్ష వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. - ధర్మపురి, నమస్తే తెలంగాణ



# అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు

- స్పీకర్ పోచారం



కామారెడ్డి జిల్లా పోచారంలో డబుల్ బెడ్రూం ఇంటిని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ రూరల్:** రాష్ట్రంలోని అర్హులందరికీ తెలంగాణ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇండ్లు మంజూరు చేస్తున్నదని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్పీకర్ స్వగ్రామం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం పోచారంలో 50 డబుల్‌బెడ్రూం ఇండ్లను ఆయన సతీమణి పుష్పతో కలిసి ప్రారంభించారు. అనంతరం పోచారం మాట్లాడుతూ నిరుపేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన డబుల్‌బెడ్‌రూం పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. రాష్ట్రంలో 3 లక్షల ఇండ్లను మంజూరుచేశారనీ, బాన్సువాడలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.



బుధవారం గద్వాలలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

# విజయ డెయిరీకే పాలు అమ్మండి

- రైతులకు మద్దతు ధర అందిస్తాం
- ఆర్థికమంత్రి తన్నీరు హరీశ్‌రావు
- గద్వాలలో సబ్సిడీ ఆవుల పంపిణీ

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** త్వరలోనే గద్వాలలో విజయ డెయిరీ ద్వారా పాలశీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామనీ, రైతులందరూ అక్కడే పాలు విక్రయించి ప్రభుత్వం నుంచి రూ.4 అదనంగా పొందాలని ఆర్థికమంత్రి తన్నీరు హరీశ్‌రావు కోరారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో మంత్రి లబ్ధిదారులకు పాడి పశువులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతలను త్వరలోనే పూర్తిచేస్తామని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రంలో ధాన్యం దిగుబడి అధికంగా పెరుగబోతున్నదని చెప్పారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా గద్వాలలో 411 ఆవులు రైతులకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలంపూర్, దేవరకద్ర ఎమ్మెల్యేలు వీఎం అబ్రహం, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కలెక్టర్ శశాంక, వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామంలోని మురుగు కాల్వను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

# ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

- 30 రోజుల కార్యాచరణతో పల్లెల్లో ఎంతో మార్పు
- ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

**బోయినపల్లి:** ముప్పై రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పల్లెల్లో ఎంతోమార్పు కనిపిస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సంతోషం వ్యక్తంచేశారు. దసరాను పురస్కరించుకొని అత్తగారి ఊరైన బోయినపల్లి మండలం కోరెం గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. తొలుత వెంకట్రావ్‌పల్లిలో పర్యటించారు. గ్రామాల్లోనాటిన మొక్కలను ప్రజాప్రతినిధులు తప్పకుండా సంరక్షించాలని కోరారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేదిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తున్నదని కొనియాడారు. ఆ స్ఫూర్తితోనే 30 రోజుల ప్రణాళికను నిత్యం అమలుచేస్తామన్నారు. అనంతరం కోరెం గ్రామంలో నిర్వహించిన దసరా వేడుకల్లో వినోద్‌కుమార్ -మాధవి దంపతులు పాల్గొన్నారు. వారిని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టీఆర్‌ఎస్ నాయకులు గజమాలతో సన్మానించారు.

# చకచకా మూసీ గేటు పనులు

- డ్యాంవద్దకు చేరిన స్టాప్‌లాగ్ గేట్లు
- పర్యవేక్షిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి
- నేడు గేటు బిగించే అవకాశం



హైదరాబాద్ మియాపూర్‌లో పూర్తి కావచ్చిన స్టాప్‌లాగ్ గేట్లు

**కేతేపల్లి :** మూసీ ప్రాజెక్టు రెగ్యులేటెడ్ గేటు మరమ్మతు పనులు చకచకా జరుగుతున్నాయి. ఇటీవల నీటి ఒత్తిడితో పక్కకు జరిగిన గేటు స్థానంలో నూతన గేటును ఏర్పాటు చేసేందుకు అవసరమైన రెండు స్టాప్‌లాగ్ గేట్లను ఏపీలోని చిత్తూరు జిల్లా కళ్యాణి డ్యాం నుంచి అధికారులు తీసుకొచ్చారు. తాత్కాలిక ప్రాతిపదికన గేటును ఏర్పాటు చేసేందుకు అవసరమైన భాగాలను యుద్ధప్రాతిపదికన తీసుకురావాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి జగదీశ్‌రెడ్డి ఇక్కడి అధికారులను పురమాయించారు. గేటు ఏర్పాటుకు అవసరమైన మిగిలిన కొన్ని భాగాలు హైదరాబాద్ మియాపూర్ నుంచి తీసుకొస్తున్నారు. గురువారమే గేటును ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాగా, మంగళవారం మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రాజెక్టు వద్ద గేటును పరిశీలించారు. ఆయకట్టు రైతులెవరూ అధైర్యపడవద్దని, ప్రాజెక్టును నింపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు.

# ప్లాస్టిక్‌రహిత సమాజానికి పాటుపడాలి

సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే

**బోథ్, నమస్తే తెలంగాణ:** ప్లాస్టిక్‌రహిత సమాజం కోసం యువత పాటుపడాలని ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే పిలుపునిచ్చారు. దసరా సందర్భంగా మంగళవారం రాత్రి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కుచ్లాపూర్ క్రాస్‌రోడ్డులోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర ఆలయం వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆయన జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్ బ్యాగులు, పేపర్ కవర్లు వాడాలని ఆయన సూచించారు.

# బంద్‌లేదు.. రందీలేదు

- ఐదోరోజు యథావిధిగా తిరిగిన బస్సులు
- రాష్ట్రవ్యాప్తంగా కనిపించని ఆర్టీసీ సమ్మె ప్రభావం
- ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు
- అధికారులతో రవాణాశాఖ మంత్రి అజయ్ సమీక్ష



బుధవారం ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ :** ప్రజలకు పండుగ వేళ ప్రయాణ కష్టాలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. సమ్మె ప్రభావం కనిపించకుండా మంగళ, బుధవారాలు సైతం బస్సులు నడిచాయి. పండుగ పూర్తవడంతో తిరుగు ప్రయాణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్నిరూట్లలో ఎప్పటికప్పుడు సరిపడా బస్సులను పంపించింది. సక్రమంగా గమ్యస్థానాలకు చేరవేయడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

✦ కరీంనగర్ రీజియన్‌లోని నాలుగు జిల్లాల్లో బుధవారం యథావిధిగా నడిచాయి. బుధవారం 346 ఆర్టీసీ, 203 అద్దె బస్సులు నడిపారు. 32 పాఠశాల, 50 కాం ట్రాక్టు క్యారియర్ బస్సులు, 245 మ్యాక్స్‌క్యాబ్‌లు తిరిగాయి. ఉదయం పదింటికే 530 బస్సులు డిపోల నుంచి బయలుదేరి వివిధ రూట్లలో నడిచాయి. ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ, ఆర్టీఏ, పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. బ్రీత్ ఎనలైజర్ మిషన్లతో పరీక్షలు నిర్వహించి మరీ తాత్కాలిక డ్రైవర్లకు బస్సులు ఇస్తున్నారు. అలాగే, వివిధ రూట్లలో నడుస్తున్న ఆర్టీసీ, అద్దె బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో అధికారులు చర్యలకు దిగుతున్నారు. అధిక చార్జీలు వసూలు చేస్తే తదుపరి విధుల్లోకి తీసుకోబోమని ఆర్‌ఎం పీ జీవన్‌ప్రసాద్ స్పష్టం చేశారు.. మంచిర్యాల జిల్లాలో బుధవారం 179 వాహనాలు నడిచినట్టు కలెక్టర్ భారతి హోళికేరి వెల్లడించారు.

**ఐదో రోజు యథావిధిగా..**

సమ్మె ఐదోరోజు అన్ని జిల్లాల్లో బస్సులు యథావిధిగా తిరిగాయి. వరంగల్ రీజియన్ పరిధిలో 530 బస్సులు రోడ్డెక్కాయి. దాదాపు 69.28 శాతం ప్రయాణికులకు ఆర్టీసీ చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అందుబాటులోకి వచ్చాయి. 309 మంది డ్రైవర్లు, 530 మంది కండక్టర్లతో 530 బస్సుల్ని ఆర్టీసీ నడిపింది. బస్సులకు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు డిపోల వద్ద ముందస్తు చర్యలు తీసుకున్నారు.

**ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రైట్‌రైట్**

భద్రాద్రి కొత్తగూడెం భద్రాచలం, మణుగూరు డిపోల పరిధిలో బస్సులు నడిచాయి. పండుగపూట ప్రజలందరినీ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్న లక్ష్యంతో ఉదయం నుంచే వాహనాలు రోడ్డెక్కాయి. ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వెళ్తుండటంతో 500 వాహనాలను నడిపింది. ఇందులో 119 ఆర్టీసీ బస్సులతోపాటు 65 అద్దెబస్సులున్నాయి. రవాణాశాఖామంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్‌శైనీ, ఎస్పీ సునీల్ దత్, ఆర్‌టీవో రవీందర్, డీవీఎం శ్రీకృష్ణలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోలతోపాటు ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరుగుతూ ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చాయి. బుధవారం వివిధ డిపోల నుంచి ఉదయం 4 గంటలకు బస్సులు బయటికి వచ్చాయి. ఖమ్మం డిపోలో 79 సంస్థ, 57 అద్దె, సత్తుపల్లి డిపోలో 64 సంస్థ, 31 అద్దె, మధిర డిపోలో 32 సంస్థ 21 అద్దె బస్సులను ఆర్టీసీ అధికారులు పోలీసుల సహకారంతో విజయవంతంగా నడిపారు.

**ఉమ్మడి నల్లగొండలో 276బస్సులు**

నల్లగొండ జిల్లాలో 276 బస్సులు ప్రయాణికులను ఆటంకం లేకుండా గమ్యస్థానాలకు చేరవేశాయి. నల్లగొండ డిపో నుంచి 42 ఆర్టీసీ, 35ప్రైవేటు, దేవరకొండ డిపో నుంచి 36 ఆర్టీసీ, మరో 26 ప్రైవేటు బస్సులు, నార్కట్‌పల్లి డిపో నుంచి 40 ఆర్టీసీ, 14 ప్రైవేటు, మిర్యాలగూడ డిపో నుంచి 46ఆర్టీసీ, 37ప్రైవేటు బస్సుల చొప్పున మొత్తం 276బస్సులు నడిపించారు. సూర్యాపేట, కోదాడ రెండు డిపోల పరిధిలో ఆర్టీసీ, హైర్ బస్సులు 210 బస్సులు ఉండగా 171 బస్సులు తిరుగుతున్నాయి. సూర్యాపేట డిపోలో 119 బస్సులకుగాను 53 ఆర్టీసీ, 45 అద్దె బస్సులు.. కోదాడలో 91 బస్సులకుగాను 42 ఆర్టీసీ, 31 అద్దె బస్సులు ఉన్నాయి. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల్లో దాదాపు 80 వేల మంది ప్రయాణించారు. వీటికి తోడు జిల్లాలో 45 స్కూల్ బస్సులు, 10 కాంట్రాక్ట్ క్యారియర్ వాహనాలు, 152 మ్యాక్సీ క్యాబ్‌లు, 250 వరకు మోటార్ క్యాబ్‌లు నడుస్తున్నాయి.

**యాదగిరిగుట్టలో నిరాంటంకంగా..**

పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు ఇక్కట్లు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. యాదగిరిగుట్ట డిపోలో 95 బస్సులు, మరో15 బస్సులు అద్దె బస్సులు నడుస్తుండగా బుధవారం 45 ఆర్టీసీ బస్సులు, 15 అద్దె బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలతో కలిపి మొత్తం 155 వాహనాలు నడిపించారు.



సూర్యాపేట బస్టాండ్‌లో ప్లాట్‌ఫారాలపై సిద్ధంగా ఉన్న బస్సులు



కరీంనగర్ బస్టాండ్ నుంచి బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికులు



హన్మకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్సులు

# ఉత్తమ్‌కు గుణపాఠం చెప్పాలి

- టీఆర్‌ఎస్‌కు ఓటేస్తే అభివృద్ధిని చూపిస్తాం
- ఎన్నికల ప్రచారంలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



మేళ్లచెర్వు మండలం హేమ్లాతండా రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి, ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే గాదరి కిశోర్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

**మేళ్లచెర్వు:** హుజూర్‌నగర్‌లో ఐదేండ్లుగా అభివృద్ధి జరుగకపోవడానికి బాధ్యుడైన ఉత్తమ్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మేళ్లచెర్వు మండలం హేమ్లాతండాలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సుభిక్షంగా ఉంటే హుజూర్‌నగర్‌లో మాత్రం ఉత్తమ్ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి దూరమైందన్నారు. సీఎం అవుతానని ఒకసారి, కేంద్ర మంత్రి అవుతానని మరోసారి ఓట్లను దండుకొని.. నమ్ముకున్న నియోజకవర్గ ప్రజలను ఉత్తమ్ నట్టేట ముంచాడని విమర్శించారు. దేవుడు వరమిచ్చినా పూజారి కూడా వరమివ్వాలని, ప్రస్తుతం ఇక్కడ పూజారిస్థానంలో ఉన్న యువకుడు, స్థానికుడైన సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, 24 గంటల విద్యుత్, ఆసరా పింఛన్లు తదితర పథకాలను అమలు చేస్తున్న ఘనత టీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అందిస్తోన్న సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్యయాదవ్, గ్యాదరి కిశోర్‌కుమార్, శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఉప ఎన్నికల్లో విజయం మాదే :పల్లా**

**హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో విజయం తమదేనని టీఆర్‌ఎస్ ఉప ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌కు గులాబీ కండువా కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌కు ఉప ఎన్నిక అభివృద్ధి కోసం వచ్చిందని, ఎన్నికల్లో విజయం సాధించి రాబోయే నాలుగున్నరేండ్లలో అభివృద్ధి పథకాలను చేపట్టి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 40 గ్రామా ల్లో ప్రచారం పూర్తయిందని, సైదిరెడ్డి గెలుపు కోసం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఐదేండ్లు అభివృద్ధికి దూరమైన హుజూర్‌నగర్‌కు ఈసారి ఎన్నికల్లో గెలిచి అభివృద్ధి అంటే ఏమిటో రుచి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ దవాఖానలో బాలిక ప్రసవం

**శక్కర్‌నగర్:** నిజామాబాద్ జిల్లా బోధన్ ప్రభుత్వ దవాఖానలో బుధవారం తెల్లవారుజామున 14 ఏండ్ల బాలిక ఆడశిశువుకు జన్మనివ్వగా.. ఆ శిశువు విక్రయానికి తెరతీశారు. బోధన్‌లోని బెల్లాల్‌లోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలిక నిజామాబాద్‌లో ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని జీవనం సాగించేది. బాలికను నిజామాబాద్‌కు చెందిన ఫైజ్ అనే ఆటో డ్రైవర్ పెండ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. గర్భం దాల్చిన బాలికకు పురిటినొప్పులు రావడంతో బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు బాలికకు ప్రసవంచేయగా.. ఆడపిల్ల జన్మించింది. దవాఖానలో శిశువును అమ్మేందుకు యత్నిస్తున్నారని ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, బోధన్ ఆదర్శ యువతి మహిళా మండలి అధ్యక్షురాలు పద్మాసింగ్‌లకు సమాచారం అందింది. వారు దవాఖానకు చేరుకొని ఆరాతీయగా విషయం బయటపడింది. వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. శిశువును ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, సౌభాగ్య స్వాధీనం చేసుకున్నారు.

# శ్రీరాంసాగర్ @ 77టీఎంసీలు

- 14,810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జూరాలకు స్వల్పంగా వరద
- నాగార్జునసాగర్‌కు 88,897 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**మెండోరా:** ఉత్తర తెలంగాణ వరప్రదాయని నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటినిల్వ 77 టీఎంసీలకు చేరుకున్నది. ఎగువ నుంచి 14,810 క్యూసెక్కుల వరద వస్తుండటంతోనీటిమట్టం క్రమేపి పెరుగుతున్నది. బుధవారం ఉదయం 6 గంటలకు 8,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మధ్యాహ్నం 14,810 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరిగిందని ప్రాజెక్టు ఏఈఈ మహేందర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (90.313 టీఎంసీలు)కాగా, బుధవారం సాయంత్రానికి 1088.30 అడుగులు (77.383 టీఎంసీలు) నీటి నిల్వ ఉందని చెప్పారు. ప్రాజెక్టు నుంచి 771 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నదని తెలిపారు.

**కృష్ణాబేసిన్‌లో కొనసాగుతున్న వరద**

కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న ఓ మోస్తరు వానలకు ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు వరద వచ్చి చేరుతుండటంతో జూరాలకు వరద స్థిరంగా వస్తున్నది. దీంతో జూరాల స్పిల్‌వే గేటు ఒకటి తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో 10 స్పిల్ వే గేట్లను ద్వారా15,370 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**శ్రీశైలం నుంచి దిగువకు**

జూరాల నుంచి భారీగా వస్తున్న వరద కారణంగా ఈ సీజన్లలో నాలుగోసారి శ్రీశైలం ప్రాజెక్టు ఒక గేట్ ఎత్తి నీటిని దిగువకు వదిలారు. బుధవారం సాయంత్రం 80,760 క్యూసెక్కులు నీళ్లు శ్రీశైలం ప్రాజెక్టుకు వస్తుండగా, ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 884 అడుగులకు చేరి 214 టీఎంసీలకు చేరుకున్నది. ప్రాజెక్టు ఒక గేటు ద్వారా 28,029 క్యూసెక్కుల నీళ్లు నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి 88,897 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్ నాలుగు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు. బుధవారం ఎన్నెస్పీ అధికారులు నాలుగు క్రస్టుగేట్లను ఎత్తి 46,226 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

# తల్లికి కొరివిపెట్టని తనయుడు

దహన సంస్కారాలు నిర్వహించిన యాకూబీ



శ్యామలమ్మకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న మహ్మద్ యాకూబీ, ఆఫ్రీన్ పర్వేజ్

**సిద్ధార్థనగర్ (వరంగల్):** వృద్ధాప్యంలో తల్లికి అండగా నిలువాల్సిన కొడుకు ఆమెను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు.. చనిపోయిన తల్లికి అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా ముందుకురాలేదు. దీంతో ఆశ్రమ నిర్వాహకులే తలకొరివి పెట్టి మానవత్వం చాటుకున్నారు. హన్మకొండలోని రెడ్డికాలనీకి చెందిన గూడూరు శ్యామలమ్మ (72)కు కుమారుడు గూడూరు వెంకటేశ్వర్లు ఉన్నాడు. ఇతడు ఆర్టీసీలో క్లర్క్. తల్లిని పోషించకపోగా చిత్రహింసలకు గురిచేయడంతో స్థానికుల సమాచారం మేరకు గత జూన్ 24న స్థానిక సహృదయ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులు మహ్మద్ యాకూబీ స్పందించి శ్యామలమ్మను తమ ఆశ్రయానికి తీసుకెళ్లారు. అనారోగ్యంతో బాధపడుతున్న శ్యామలమ్మ బుధవారం మృతిచెందారు. ఈ విషయం ఆమె కుమారుడు వెంకటేశ్వర్లుకు చెప్పినా రాలేదు. యాకూబీ అన్నితానై హన్మకొండలోని శివ ముక్తి ధాంలో హిందూ సంప్రదాయ ప్రకారం తలకొరివిపెట్టింది.

epaper.ntnews.com

# పుణె పటాకా ఎవరిదో..!




నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా రెండో టెస్టు

జోరుమీదున్న టీమ్ఇండియా.. అడ్డుకోవాలని డుప్లెసిస్ సేన..

**ఓపెనర్ల విజృంభణ, మిడిలార్డర్ నిలకడ, స్పిన్నర్ల జోరు, పేసర్ల తోడుతో తొలి టెస్టు నెగ్గిన టీమ్ఇండియా.. పుణెలోనూ అదే సీన్ రిపీట్ చేయాలని చూస్తున్నది. సుదీర్ఘ ఫార్మాట్‌లో తొలిసారి ఓపెనింగ్ చేసిన రోహిత్ పరుగుల వరద పారించడంతో విశాఖ టెస్టులో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన విరాట్ సేన.. ఒక్క సెషన్ మినహా సఫారీలను తమ కబంద హస్తాల్లో బంధించి ఉంచింది. అయితే ఇక్కడ ఆడిన చివరి టెస్టులో ఘోర పరాజయం టీమ్ఇండియాను కాస్త ఇబ్బంది పెడుతున్నది. ఈ మ్యాచ్‌తో దాన్ని చెరిపేయాలని భారత్ భావిస్తుంటే.. గత పర్యటన మాదిరిగా వైట్‌వాష్ కాకుండా చూసుకోవాలని దక్షిణాఫ్రికా పట్టుదలతో ఉంది.**

**పుణె:** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విశాఖలో చక్కటి విజయాన్నందుకున్న టీమ్ఇండియా.. అదే జోరు కొనసాగిస్తూ మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ చేజిక్కించుకోవాలనే పట్టుదలతో పుణె టెస్టుకు సిద్ధమైంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో కోహ్లీ సేనకు పెద్దగా సమస్యలు లేకపోయినా.. పుణె టెస్టులో ఆడిన చివరి మ్యాచ్‌లో ఘోర పరాజయం కాస్త కలవరపెడుతున్నది. స్వదేశంలో చివరిసారిగా భారత బ్యాటింగ్ లైనప్ పూర్తిగా చేతులెత్తేసింది ఇక్కడే. రెండేండ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో టీమ్ఇండియా రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 105, 107 పరుగులకే ఆలౌటైంది. ఆ తర్వాత ఎదురులేకుండా సాగుతున్న భారత్‌కు సఫారీలు ఏ మేరకు పోటీనిస్తారో చూడాలి. విశాఖ తొలి ఇన్నింగ్స్ పోరాటమిచ్చిన స్ఫూర్తితో ఈసారి మెరుగైన ప్రదర్శన చేసి సిరీస్‌లో సజీవంగా ఉండాలని దక్షిణాఫ్రికా కృతనిశ్చయంతో ఉంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఓపెనర్‌గా కొత్త అవతారమెత్తిన రోహిత్ వైజాగ్‌లో శతకాల మోత మ్రోగిస్తే.. స్పిన్నర్లు మిగిలిన పని పూర్తిచేశారు. కీలక సమయంలో షమీ తన రివర్స్ స్వింగ్ పదును చూపెట్టడంతో భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో బోణీ కొట్టడంతో పాటు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. అదే జోరు ఇక్కడ కూడా కొనసాగించి రాంచీకి ముందే భారత్ సిరీస్ కైవసం చేసుకోవాలని చూస్తున్నది.

**మార్పుల్లేకుండా..**

చాలా కాలంగా భారత్‌ను వేధిస్తున్న ఓపెనింగ్ సమస్యకు విశాఖపట్నంలో విరుగుడు లభించినట్లైంది. కర్ణాటక ఆటగాడు మయాంక్ అగర్వాల్ డబుల్ సెంచరీతో అదరగొడితే.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ వరుస శతకాలతో ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు. జిడ్డు ఆటగాడిగా గుర్తింపు పొందిన చతేశ్వర్ పుజారా రెండో ఇన్నింగ్స్‌లో ధాటైన బ్యాటింగ్‌తో తనలోనూ విధ్వంసకారి ఉన్నాడని నిరూపించాడు. రోహిత్, రహానే, విహారి వైజాగ్‌లో పెద్దగా రాణించకున్నా.. అవసరమైనప్పుడు సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. సాహా, అశ్విన్, జడేజా రూపంలో చివరి వరుసలోనూ బ్యాటింగ్ చేయగలవారుండటం టీమ్ఇండియాకు అదనపు బలం. బౌలింగ్‌లో మహమ్మద్ షమీ, ఇషాంత్ శర్మ తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. టెస్టు ఫార్మాట్‌లో టీమ్ మేనేజ్‌మెంట్ తొలి ప్రాధాన్యత స్పిన్ జోడీ అశ్విన్, జడేజా ప్రత్యర్థిని తిప్పేయడంలో ఏమాత్రం పట్టు సడలించడం లేదు. అవసరమైనప్పుడు చేంజ్ బౌలర్లుగా విహారి, రోహిత్ కూడా ఓ చేయి వేయడానికి సిద్ధంగా ఉన్నారు.

**అదనపు పేసర్‌తో సఫారీలు..**

పచ్చికతో కూడిన పిచ్‌పై పేస్‌తో భారత్‌ను పడగొట్టాలని దక్షిణాఫ్రికా ప్రణాళికలు రచిస్తున్నది. అందుకు తగ్గట్లే మరో పేసర్ లుంగి ఎంగ్డీని తుది జట్టులోకి తీసుకోనుంది. స్పిన్నర్లు ముత్తుస్వామి, డెన్ పీట్ విశాఖపట్నంలో భారత బ్యాట్స్‌మెన్‌ను పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోవడంతో.. మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. అయితే వీరిద్దరిలో ఎవరిని తప్పిస్తారో చూడాలి. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీలతో ఆకట్టుకున్న డీన్ ఎల్గర్, క్వింటన్ డికాక్‌తో పాటు కెప్టెన్ డుప్లెసిస్‌పైనే మరోసారి బ్యాటింగ్ భారం పడనుంది. మార్‌క్రమ్, బవుమా, డిబ్రుయన్ స్థాయికి తగ్గట్లు రాణించాల్సిన అవసరం ఉంది. గత మ్యాచ్‌లో 13 సిక్సర్లతో ప్రపంచ రికార్డు సృష్టించిన రోహిత్‌ను అడ్డుకుంటే మ్యాచ్‌పై పట్టు సాధించవచ్చని భావిస్తున్న ప్రొటీస్.. ఆ దిశగా పావులు కదుపుతున్నది.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** కోహ్లీ (కెప్టెన్), రోహిత్, మయాంక్, పుజారా, రహానే, విహారి, సాహా, అశ్విన్, జడేజా, ఇషాంత్, షమీ.

**దక్షిణాఫ్రికా:** డుప్లెసిస్ (కెప్టెన్) మార్‌క్రమ్, ఎల్గర్, డిబ్రుయన్, బవుమా, డికాక్, ముత్తుస్వామి, ఫిలాండర్, కేశవ్, రబాడ, ఎంగ్డీ.

**పిచ్, వాతావరణం**

పచ్చికతో కూడిన పిచ్ పేస్‌కు అనుకూలంగా కనిపిస్తున్నది. కానీ మ్యాచ్ సాగే ఐదురోజులు పేసర్లకు సహకరించకపోవచ్చు. ఉదయం పూట విపరీతమైన ఉక్కపోత ఉండి.. సాయంత్రం సమయాల్లో వర్షం కురిసే సూచనలున్నాయి. ఈ వికెట్‌పై జరిగిన చివరి టెస్టులో ఆసీస్ స్పిన్నర్ స్టీవ్ ఓ కీఫ్ 12 వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు.

ఉ.9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



## ఆటాడుకున్న స్టీవ్ ఓ కీఫ్..

రెండేండ్ల క్రితం ఇక్కడ జరిగిన టెస్టు మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. భారత స్పిన్నర్లు విజృంభించారనుకుంటే పొరపాటే.. ప్రత్యర్థి స్పిన్నర్ ధాటికి మనవాళ్లు విలవిల్లాడారు. 2016-17 పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టుకు ఇదే మైదానం ఆతిథ్యమిచ్చింది. టాస్ గెలిచిన అప్పటి ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. రెన్‌షా (68), మిషెల్ స్టార్క్ (61) అర్ధశతకాలు సాధించడంతో కంగారూలు 260 పరుగులు చేశారు. భారత బౌలర్లలో ఉమేశ్ 4, అశ్విన్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 105 పరుగులకే కుప్పకూలింది.రాహుల్ (64) ఒక్కడే జట్టు స్కోరులో సగంకంటే ఎక్కువ పరుగులు చేయగా.. స్టీవ్ ఓ కీఫ్ (6/35) ధాటికి మిగిలిన వారంతా ఘోరంగా విఫలమయ్యారు. రెండో ఇన్నింగ్స్‌లో స్మిత్ (109) సెంచరీతో చెలరేగడంతో 285 పరుగులు చేసిన ఆసీస్.. భారత్ ముందు 441 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కొండంత టార్గెట్ ఛేజింగ్‌లో భారత్ చతికిలబడింది. ఓ కీఫ్ (6/35), లియాన్ (4/53) విజృంభించడం తో 107 పరుగులకు ఆలౌటైంది. ఆ రోజు ఆడిన జట్టులో ఓపెనర్లు మినహా మిగిలిన ప్రధాన ఆటగాళ్లంతా గురువారం కూడా బరిలో దిగనున్నారు.

## విదేశాల్లో గెలిస్తే.. డబుల్ పాయింట్స్!

టెస్టు చాంపియన్‌షిప్‌పై కోహ్లీ

**పుణె:** విదేశాల్లో సాధించే టెస్టు విజయాలకు రెండింతల పాయింట్లు కేటయిస్తే బాగుంటుందని టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అభిప్రాయపడ్డాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ప్రతి సిరీస్‌కు 120 పాయింట్లు కేటాయించిన ఐసీసీ.. విదేశాల్లో ఆడే టెస్టులకు అందుకు రెట్టింపు పాయింట్లు కల్పిస్తే ఇంకా మెరుగ్గా ఉంటుందని అతడు పేర్కొన్నాడు. 'పాయింట్లు కేటాయించే విషయంపై నన్ను సంప్రదిస్తే.. విదేశాల్లో గెలిచిన మ్యాచ్‌లకు డబుల్ పాయింట్లు ఇవ్వాలంటా. తొలి ఎడిషన్ అనంతరం ఈ అంశంపై దృష్టి సారిస్తారనుకుంటున్నా. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ కారణంగా మ్యాచ్‌ల ప్రాధాన్యం పెరిగింది. గతంతో పోల్చుకుంటే 'డ్రా'ల సంఖ్య తగ్గుతున్నది. అన్ని జట్లు పాయింట్లపై దృష్టి పెడుతుండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇది టెస్టు క్రికెట్‌కు శుభపరిణామం' అని కోహ్లీ అన్నాడు. ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆడుతున్న ప్రతి సిరీస్‌కు 120 పాయింట్ల చొప్పున కేటాయించారు. రెండు టెస్టుల సిరీస్‌కూ, ఐదు టెస్టుల సిరీస్‌కు సమానమైన పాయింట్లు కల్పించడంపై కూడా ఇప్పటికే అసంతృప్తి వ్యక్తమవుతుండగా.. తాజాగా కోహ్లీ వ్యాఖ్యలు దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.



బుధవారం తిరువనంతపురంలో అనంత పద్మనాభస్వామి, అటుక్కల్ దేవిని దర్శించుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధు

## క్వార్టర్స్‌లో మేరీకోమ్

జమున, లవ్లీనా కూడా.. మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్



**ఉలన్ ఉదె (రష్యా):** ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీకోమ్ (51 కేజీలు) అలవోక విజయంతో క్వార్టర్స్‌లో అడుగుపెడితే.. జమునా బోరో (54 కేజీలు), లవ్లీనా బోర్గొహైన్ (69 కేజీలు) కూడా క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో జమున 5-0తో ఐదోసీడ్ ఔదాద్ ఫౌత్ (అల్జీరియా)పై.. మూడో సీడ్ లవ్లీనా 5-0తో బెల్ అహబీబ్ (మొరాకో)పై విజయాలు సాధించారు. అంతకుముందు మంగళవారం జరిగిన పోరులో మూడోసీడ్ మేరీకోమ్ 5-0తో జుటామస్ జిట్‌పొంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలిసారి 51 కేజీల విభాగంలో పోటీపడుతున్న మేరీకోమ్ ఎలాంటి తడబాటుకు గురికాలేదు. పదునైన పంచ్‌లతో ప్రత్యర్థిని మట్టికరిపించి ముందడుగు వేసింది. మరో భారత బాక్సర్ సవీటి బూరా (75 కేజీలు) ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ లౌరెన్ ప్రైస్ (వేల్స్) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. గురువారం జరుగనున్న క్వార్టర్ ఫైనల్స్‌లో ఉర్సులా గొట్లోబ్ (జర్మనీ)తో జమున.. కరోలినా కొజెస్కా (పోలాండ్)తో లవ్లీనా తలపడనున్నారు. చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు భారత్ నుంచి ఐదుగురు బాక్సర్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. మేరీకోమ్, జమున, లవ్లీనాతో పాటు మంజు రాణి (48 కేజీలు), కవిత చాహల్ (ప్లస్ 81 కేజీలు) పతకానికి పంచ్ దూరంలో ఉన్నారు. మరొక్క విజయం సాధిస్తే వీరు సెమీస్‌లో అడుగుపెట్టి కనీసం కాంస్య పతకాలు ఖరారు చేసుకుంటారు.

## ఫైనల్లో హుస్సాముద్దీన్

జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్



**బద్దీ:** పురుషుల జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ బాక్సర్ మహమ్మద్ హుస్సాముద్దీన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన 57కిలోల బాంటమ్ వెయిట్ విభాగం సెమీఫైనల్లో హుస్సాముద్దీన్ 5-0 తేడాతో రోషన్ సైన్(రాజస్థాన్)పై అలవోక విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన హుస్సాముద్దీన్..ప్రత్యర్థులపై మెరుపు పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. రింగ్‌లో చురుకుగా కదులుతూ జాబ్స్, హుక్స్‌తో చెలరేగాడు. దీంతో ప్రత్యర్థి బాక్సర్ నుంచి సరైన సమాధానం లేకపోయింది. గురువారం జరిగే తుది పోరులో సచిన్ సివాచ్‌తో హుస్సాముద్దీన్ తలపడుతాడు. మిగతా విభాగాల్లో శివ తాపా(63కి), రోహిత్ తోకాస్(75కి), అంకిత్ ఖాట్నా ఫైనల్లోకి ప్రవేశించారు. అసోం బాక్సర్ శివ తాపా సెమీఫైనల్లో అభిషేక్ యాదవ్‌పై అలవోక విజయంతో ఫైనల్ పోరులో నిలిచాడు. మొత్తంగా ఎనిమిది మంది సర్వీసెస్ బాక్సర్లు, ఐదుగురు రైల్వేస్ బాక్సర్లు పసిడి పోరులోకి ప్రవేశించారు.

## అదితి, రోహన్ ముందంజ

**కజన్ (రష్యా):** బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్లు అదితి భట్, రోహన్ గుర్బానీ ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించారు. బుధవారం జరిగిన వ్యక్తిగత పోటీల్లో అదితి 14-21, 21-14, 22-20తో 13వ సీడ్ అతితయా పోవనోన్ (థాయ్‌లాండ్)పై విజయం సాధించగా.. రోహన్ 21-7, 21-16తో నికోలస్ రూడాల్ఫ్ (ఆస్ట్రియా)ను 23 నిమిషాల్లోనే చిత్తు చేశాడు. తొలి గేమ్ కోల్పోయిన అదితి.. ఆ తర్వాత విజృంభించి ఆడింది. వరుస గేమ్‌లు నెగ్గి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. తదుపరి రౌండ్‌లో నాలుగో సీడ్ పుత్రి కుసుమ (ఇండోనేసియా)తో అదితి.. రెన్ చెంగ్ మింగ్ (చైనా)తో రోహన్ తలపడనున్నారు. ఇతర మ్యాచ్‌ల్లో భారత షట్లర్లు తస్నీమ్ మీర్, త్రిష పరాజయం పాలయ్యారు. తస్నీమ్ 13-21, 19-21తో 12వ సీడ్ హుంగ్ ఎన్ జూ (చైనా) చేతిలో.. త్రిష 16-21, 12-21తో ఆరో సీడ్ వివిన్ సండోర్‌హాజీ (హంగేరి) చేతిలో ఓడారు.

## నిర్మలపై నాలుగేండ్ల నిషేధం




**మొనాకో:** డోపింగ్ టెస్టులో పట్టుబడ్డ భారత స్ప్రింటర్ నిర్మలా షెరాన్‌పై నాలుగేండ్ల నిషేధం పడింది. నిషేధిత ఉత్ప్రేరకాలు వాడిన కారణంగా ఆమెపై బ్యాన్ విధించినట్లు అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. నిషేధం 2018 జూన్ 18 నుంచి అమల్లోకి వస్తుందని అందులో పేర్కొంది. దీంతో 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆమె సాధించిన రెండు స్వర్ణ పతకాలు రద్దయ్యాయి. క్రమపద్ధతిలో రక్త నమూనాలు కూడా సమర్పించని నిర్మలకు ఈ విషయంలో.. వివరణ ఇచ్చుకునేందుకు కూడా ఏఐయూ అవకాశం ఇవ్వలేదు. అంతే కాకుండా 2016 ఆగస్టు నుంచి 2018 నవంబర్ వరకు అంటే డోప్ పరీక్షలకు రెండేండ్ల ముందు ఆమె సాధించిన పతకాలను కూడా రద్దు చేసినట్లు స్పష్టంచేసింది. రియో ఒలింపిక్స్ (2016)లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన నిర్మల.. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల మహిళల విభాగంతో పాటు 4x400 రిలేలో పసిడి పతకాలు గెలిచింది.

## చివరి నుంచి రెండో స్థానం

ముగిసిన తెలుగు టైటాన్స్ ప్రస్థానం.. ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్



**గ్రేటర్ నోయిడా:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ పోరాటం ముగిసింది. పడుతూ లేస్తూ సాగిన ప్రయాణంలో టైటాన్స్ చివరి మ్యాచ్‌లో ఊరట విజయాన్నందుకుంది. గత మూడు మ్యాచ్‌ల్లో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న తెలుగు జట్టు బుధవారం జరిగిన మ్యాచ్‌లో 41-36తో యూపీ యోధాపై గెలుపొందింది. దీంతో పాయింట్ల పట్టికలో కింది నుంచి రెండో స్థానంతో లీగ్‌లో తమ ప్రస్థానాన్ని ముగించింది. మొత్తం 22 మ్యాచ్‌లాడిన టైటాన్స్ 6 విజయాలు, 13 ఓటములు, 3 'డ్రా'లతో 45 పాయింట్లు ఖాతాలో వేసుకొని 12 జట్లలో 11వ స్థానంలో నిలిచింది. చివరి మ్యాచ్‌లో స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ (15 పాయింట్లు) రాణించడంతో టైటాన్స్ గెలుపొందింది. యూపీ తరఫున శ్రీకాంత్, రిశాంక్ చెరో 8 పాయింట్లు సాధించారు. మ్యాచ్ ఆరంభం నుంచే సిద్ధార్థ్ చెలరేగి ఆడటంతో టైటాన్స్ ముందంజలో నిలిచింది. అయితే తామేమి తక్కువ తినలేదన్నట్లు శ్రీకాంత్, రిశాంక్ కూడా గట్టిగా పోరాడటంతో తొలి అర్ధభాగంలోనే టైటాన్స్ ఆలౌటైంది. దీంతో తెలుగు జట్టు 14-20తో ఫస్ట్ హాఫ్‌ను ముగించింది. రెండో సగంలోనూ యోధా జోరు కొనసాగించడంతో రెండోసారి ఆలౌటైన టైటాన్స్ ఒక దశలో 18-32తో ఓటమి దిశగా పయనించింది. అయితే చివరి 10 నిమిషాల్లో చెలరేగి ఆడిన తెలుగు జట్టు వరుసగా పాయింట్లు సాధిస్తూ.. ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లి విజయాన్ని ఖాయం చేసుకుంది. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 33-29తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది.

## ఒలింపిక్స్, ఫిఫా ఆతిథ్యం నా కల: నీతా అంబానీ

**లండన్:** ఒలింపిక్స్, ఫిఫా ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీలకు భారత్ ఆతిథ్యమిస్తే చూడాలన్నది నా కల అని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) సభ్యురాలు నీతా అంబానీ అన్నారు. బుధవారం లీడర్స్ వీక్ సందర్భంగా నీత మాట్లాడుతూ '130 కోట్ల మంది కల్గిన భారత్ లాంటి దేశం నుంచి అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించకపోవడానికి గల కారణాలేంటో నాకు కనిపించడం లేదు. ప్రతిష్ఠాత్మక క్రీడా ఈవెంట్లు అయిన ఒలింపిక్స్, ఫిఫా ప్రపంచ కప్ లాంటి వాటికి భారత్ ఆతిథ్యమివ్వాలన్నది నా కల. ఇందు కోసం ప్రతి ఒక్కరికీ ఆహ్వానిస్తున్నాను. ప్రపంచంలోనే సరికొత్త క్రీడాశక్తిగా భారత్ అవతరించబోతుండటం చాలా సంతోషంగా ఉంది' అని నీతా అంబానీ అంది.

## సమీర్ ముందుకు..

**అల్మెర (నెదర్లాండ్స్):** భారత యువ షట్లర్లు సమీర్ వర్మ, లక్ష్యసేన్ డచ్ ఓపెన్‌లో అదరగొడుతున్నారు. బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్-100 టోర్నీలో ఈ ఇద్దరు ప్లేయర్లు ప్రిక్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. సింగిల్స్‌లో టాప్ సీడ్ సమీర్ వర్మ 21-19, 19-21, 21-13తో కిరణ్‌పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెడితే.. లక్ష్యసేన్ 21-12, 21-12తో ఒస్లెని గుర్రెరో (క్యూబా)పై గెలిచి ముందంజ వేశాడు.

## ప్రియారంభం

అరంగేట్రంలో అదరగొట్టిన పునియా

సిరీస్‌లో 1-0తో ముందంజ




**వడోదర:** సొంతగడ్డపై భారత పురుషుల జట్టు దక్షిణాఫ్రికాపై ఆధిపత్యం కనబరుస్తుంటే.. మహిళల జట్టు సఫారీ మహిళలను ఆటాడుకుంటున్నది. ఇప్పటికే టీ20 సిరీస్ చేజిక్కించుకున్న భారత్.. వన్డే ఫార్మాట్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం ఇక్కడ జరిగిన తొలి వన్డేలో మిథాలీ బృందం 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా మహిళల జట్టును చిత్తుచేసింది. సీనియర్ పేసర్ జులన్ గోస్వామి (3/33), ఏక్తా బిస్త్ (2/28), శిఖా పాండే (2/38), పూనమ్ యాదవ్ (2/32) ధాటికి టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా జట్టు 45.1 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. మారిజన్నె కాప్ (54) అర్ధశతకంతో రాణించడంతో ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. అనంతరం లక్ష్య ఛేదనలో తొలి వన్డే ఆడుతున్న ప్రియా పునియా (124 బంతుల్లో 75 నాటౌట్; 8 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (65 బంతుల్లో 55; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలతో అదరగొట్టడంతో.. భారత్ 41.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మందన కాలి బొటనవేలి గాయం కారణంగా మొత్తం సిరీస్‌కు దూరం కావడంతో ఆమె స్థానంలో బరిలో దిగిన ప్రియా అరంగేట్రంలోనే ఫిఫ్టీ కొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు అందుకుంది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే శుక్రవారం జరుగనుంది.

### మిథాలీ @20 ఏండ్లు



గత నెలలో పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్ ఈ మ్యాచ్‌తో అరుదైన ఘనత సొంతం చేసుకుంది. అరంగేట్రం చేసిన తర్వాత రెండు దశాబ్దాలుగా (20 ఏండ్ల 105 రోజులు) ఆటలో కొనసాగుతున్న మహిళా ప్లేయర్‌గా మిథాలీ చరిత్రకెక్కింది. 1999లో భారత్ తరఫున తొలి మ్యాచ్ ఆడిన హైదరాబాదీ మిథాలీ ఇప్పటి వరకు 204 వన్డేలు, 10 టెస్టులు, 89 టీ20లు ఆడింది. మహిళల క్రికెట్‌లో అత్యధిక వన్డేలు ఆడిన ప్లేయర్‌గానూ మిథాలీ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఇంగ్లండ్ క్రికెటర్ చార్లొట్ ఎడ్వర్డ్స్ (191), జులన్ గోస్వామి (178) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

## భారత్ శుభారంభం

**థింపు:** దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-15 బాలికల చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 4-1తో నేపాల్‌ను చిత్తుచేసింది. స్ట్రయికర్ లిండా కోమ్ సెర్తో (38వ, 56వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో మెరువగా.. సుమతి (7వ ని.లో), ప్రియాంక (66వ ని.లో) చెరో గోల్ చేశారు. నేపాల్ తరఫున మన్ మయా దమాయ్ (62వ ని.లో) ఏకైక గోల్ చేసింది. మ్యాచ్ ఆరంభంలోనే సుమతి గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత లిండా వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో మన అమ్మాయిలు 3-0తో ముందంజలో నిలిచారు. రెండో అర్ధభాగంలో కాస్త పోటీనిచ్చిన నేపాల్ దమాయ్ గోల్‌తో ఖాతా తెరిచినా.. ఆ తర్వాత అదే జోరు కొనసాగించలేక ఓటమి పాలైంది.

## పాక్ వైట్ వాష్

3-0తో సిరీస్ చేజిక్కించుకున్న లంక



**లాహోర్:** సొంతగడ్డపై శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ ఘోర పరాజయం మూటగట్టుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడి వైట్‌వాష్‌కు గురైంది. సీనియర్ల గైర్హాజరీలో యువకులతో కూడిన లంక జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు నెగ్గి 3-0తో సిరీస్ చేజిక్కించుకుంది. బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో లంక 13 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 147 పరుగులు చేసింది. ఫెర్నాండో (78 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. అనంతరం లక్ష్య ఛేదనలో పాక్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 134 పరుగులే చేసి ఓడింది.

## పటిష్ఠ బలగంతో బరిలోకి..



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** రానున్న ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్)లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్(ఎఫ్‌సీ) పటిష్ఠ బలగంతో బరిలోకి దిగుతున్నది. మెరికల్లాంటి యువకులకు తోడు అనుభవజ్ఞుల మేళవింపుతో హైదరాబాద్ జట్టు మిగతా జట్లకు తీసిపోని రీతిలో కనిపిస్తున్నది. తాము ఆడబోతున్న తొలి సీజన్‌లోనే సత్తాచాటేందుకు హైదరాబాద్ జట్టు పక్కా ప్రణాళికను ఎంచుకున్నది. బుధవారం జరిగిన మీడియా డే ఈవెంటులో హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు సభ్యులు పాల్గొని సందడి చేశారు. స్టార్ స్ట్రైకర్ రాబిన్ సింగ్‌కు తోడు గుర్‌తేజ్‌సింగ్, కోచ్ ఫిల్ బ్రౌన్, మార్సెలో లీటె పెరెరా, రాఫెల్ లోపెజ్ గోమెజ్ ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ 'ప్రతిభ కల్గిన యువకులను వెలికి తీసేందుకు ఐఎస్ఎల్ మంచి వేదిక. లీగ్‌లో సత్తాచాటిన ప్లేయర్లకు జాతీయ జట్టులో చోటు దక్కించుకునే అవకాశం లభిస్తుంది. ఈ క్రమంలో ఆటగాళ్లందరూ కష్టపడేందుకు సిద్ధంగా ఉన్నారు' అని ఫిలిప్ అన్నాడు.

# వాణిజ్య

WWW.NTNEWS.COM

నమస్తే తెలంగాణ

గురువారం 10 అక్టోబర్ 2019 [ కరీంనగర్ ]




| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 38,178 | 11,313 |
| ↗646 | ↗187 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 58.47 డాలర్లు

**బంగారం ధరలు**

న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 39,325 |
| 22 క్యారెట్లు | 39,010 |
| వెండి (కిలో) | 47,330 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 67.35 | 72.85 |
| యూరో | 73.50 | 80.50 |
| బహ్రెయిన్ దినార్ | 176.00 | 190.00 |
| కువైట్ దినార్ | 224.00 | 230.00 |
| సౌదీ రియాల్ | 17.50 | 19.30 |
| యూఏఈ దిర్హామ్ | 17.90 | 19.90 |

## ఆర్ ఇన్‌ఫ్రాలోకి అన్మోల్, అన్షుల్

**ముంబై, అక్టోబర్ 9:** ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీ ఇద్దరు కుమారులు అన్మోల్, అన్షుల్ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బోర్డులోకి చేరారు. అలాగే ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్(రిటైర్‌మెంట్)ను కూడా తీసుకున్నారు. 27 ఏండ్ల వయస్సు కలిగిన అన్మోల్ ఇప్పటికే ఆర్‌క్యాపిటల్ విదేశీ ఆర్థిక వ్యవహారాలు చూస్తున్నారు. ఆగస్టు 2016లోనే బోర్డు సభ్యుడిగా చేరారు. మరోవైపు 24 ఏండ్ల వయస్సు కలిగిన అన్షుల్ ఈ ఏడాది జనవరిలో రిలయన్స్ గ్రూపులో చేరారు.

## టిగోర్ ఈవీలో సరికొత్త వెర్షన్




**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** దేశీయ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటర్స్..ఎలక్ట్రిక్ వాహన పరిధిని మరింత విస్తరించుకోవడంలో భాగంగా టిగోర్ ఈవీని సరికొత్తగా విడుదల చేసింది. వ్యక్తిగతంగా ఉపయోగపడే విధంగా రూపొందించిన ఈ కారు ధర రూ.9.44 లక్షలుగా నిర్ణయించింది(ఢిల్లీ షోరూం ధరలు). ఫేమ్-2 నిబంధనలకు లోబడి కమర్షియల్‌గా ఉపయోగిస్తే ఈ కారుపై ప్రత్యేక రాయితీలు పొందవచ్చును. మూడు రకాల్లో రూపొందించిన ఈ కారు దేశవ్యాప్తంగా 30 నగరాల్లో లభించనున్నదని కంపెనీ ఎలక్ట్రిక్ వాహన బిజినెస్ హశ్రీడ్ అశేష్ ధార్ తెలిపారు. గతంలో ఒక్క రీచార్జికి 142 కిలోమీటర్లు మైలేజ్ ఇవ్వనుండగా, ఈ సరికొత్త వాహనం 214 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

# జోరు.. హుషారు..

## భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 646, నిఫ్టీ 187 పాయింట్ల లాభం

### బ్యాంక్, ఆర్థిక సేవల షేర్లకు డిమాండ్

**ముంబై, అక్టోబర్ 9:**

దలాల్ స్ట్రీట్‌లో దీపావళి పటాకులు ముందేపేలాయి. వరుసగా ఆరు రోజులపాటు భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జోష్ కనిపించింది. దసరా మరుసటి రోజే బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లకు మదుపరుల నుంచి వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాలతో కొనసాగిన సూచీలు..ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి పండుగ బొనాంజను అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటనతో సెన్సెక్స్ మళ్లీ 38 వేల మార్క్‌ను దాటింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 645.97 పాయింట్లు(1.72 శాతం) లాభపడి 38,177.95కు చేరుకోగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 186.90 పాయింట్లు అధికమై 11,313.30 వద్ద ముగిసింది. కరువు భత్యం పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ ప్రకటన మదుపరుల్లో సెంటిమెంట్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. బ్యాంకింగ్, ఆర్థిక, టెలికం రంగ షేర్లలో భారీగా క్రయవిక్రయాలు జరిగాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 5.45 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, కొటక్ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు షేర్లు కొనుగోలుదారులను ఆకట్టుకున్నాయి.



**యెస్ బ్యాంక్‌కు తప్పని తిప్పలు**

స్టాక్ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోతుంటే యెస్ బ్యాంక్ మాత్రం పాతాళంలోకి పడిపోతున్నది. బ్యాంక్ ప్రమోటర్లు తమ వాటాను విక్రయిస్తుండటం, ఆర్థిక పరిస్థితులు నీరుగారుతుండటంతో గత పదిహేను రోజులుగా బ్యాంక్ షేరు భారీగా క్షీణించింది. బుధవారం కూడా బ్యాంక్ షేరు మరో 5.26 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. హీరో మోటోకార్ప్, హెచ్‌సీఎల్ టెక్, ఐటీసీ, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటోల షేర్లు మూడు శాతం వరకు పతనం చెందాయి. చాలా రోజుల తర్వాత స్టాక్ మార్కెట్లో కొనుగోళ్లు కనిపించాయని, ముఖ్యంగా నిఫ్టీ 11,300 పాయింట్ల పైకి చేరుకున్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. నిధుల లభ్యతను పెంచడానికి మరోదఫా వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయన్న సంకేతాలు మార్కెట్లు పుంజుకోవడానికి దోహదం చేశాయన్నారు. కార్పొరేట్ల ఫలితాలు ఆశాజనకంగా ఉండనున్నట్లు మదుపరులు భావిస్తున్నారు. రంగాల వారీగా చూస్తే టెలికం అత్యధికంగా 4.92 శాతం లాభపడగా, బ్యాంకింగ్ 3.67 శాతం, ఫైనాన్స్ 2.84 శాతం, మెటల్ 2.12 శాతం, రియల్టీ 1.99 శాతం, బేసిక్ మేటిరియల్స్ 1.95 శాతం, ఇంధనరంగ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఐటీ, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లు మాత్రం నష్టపోయాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 1 శాతం పెరిగి 58.77 డాలర్లు పలికింది. కాగా, వివిధ ఆర్గనైజేషన్ల నుంచి 300 బస్సుల ఆర్డర్ వచ్చినట్లు బీఎస్ఈకి సమాచారం ఇవ్వడంతో జేబీఎం ఆటో షేరు ఏకంగా 20 శాతంవరకు లాభపడింది. చివరకు 19.73 శాతం ఎగబాకి రూ.224.55 వద్ద ముగిసింది. యూఎస్‌ఎఫ్‌డీఏ పరిశీలనలో లేవనెత్తిన అంశాలపై స్పష్టత నివ్వడంతో అరబిందో ఫార్మా షేరు మూడు శాతం లాభపడింది.

**హెచ్‌డీఐఎల్ షేరు ఢమాల్**

హౌజింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ షేరు ఢమాల్‌మన్నది. కంపెనీ షేరు ధర ఐదు శాతం పడిపోవడంతో తక్కువ సర్క్యూట్‌ను తాకినట్లు అయింది. షేరు ధర 4.73 శాతం పతనం చెంది రూ.3.02కి జారుకున్నది. 52 వారాల తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. గడిచిన 17 సెషన్లలో కంపెనీ షేరు ధర 52.8 శాతం క్షీణించింది. డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేరు కూడా 9.86 శాతం తగ్గి తక్కువ సర్క్యూట్‌ను తాకింది.

## రూపాయికి స్వల్ప నష్టం



స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకుంటే రూపాయికి మాత్రం చిల్లులు పడ్డాయి. వాణిజ్యంపై అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చే అవకాశాలు ఉండటంతో అనూహ్యంగా డాలర్‌కు డిమాండ్ పెరిగింది. ఫలితంగా ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు తగ్గింది. 71.20 వద్ద ప్రారంభమైన కరెన్సీ విలువ ఒక దశలో 70.94కి చేరుకోగా, చివరకు 71.07 వద్ద ముగిసింది.

# తెగ కొనేశారు..

## పండుగ సీజన్‌లో రూ.39 వేల కోట్ల అమ్మకాలు

### ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌ల ఆఫర్లకు కస్టమర్లు ఫిదా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** ఈ-కామర్స్ కంపెనీలు ప్రకటించిన ఆఫర్లకు కొనుగోలుదారులు ఫిదా అయ్యారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ దిగ్గజాలు ప్రకటించిన ప్రత్యేక ఆఫర్లతో 6 బిలియన్ డాలర్లు లేదా రూ.39 వేల కోట్ల విలువైన వస్తువులు అమ్ముడయ్యాయి. ఈ విషయాన్ని ప్రముఖ కన్సల్టెన్సీ రెడ్‌సీర్ వెల్లడించింది. తొలి విడుత నిర్వహించిన పండుగ విక్రయాల్లో ఈ-కామర్స్ కంపెనీలు 3 బిలియన్ డాలర్లు లేదా రూ.19 వేల కోట్లు ఉంటుందని అంచనావేస్తున్నాయి. గతేడాది ఇదే సమయంలో నమోదైన దాంతో పోలిస్తే ఇది 30 శాతం అధికం. ఈ ఏడాది తొలి విడుత పండుగ సేల్ 3.7 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని రెడ్‌సీర్స్ అంచనావేసింది. మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గ్రాస్ మర్చేండైజ్ వాల్యు(జీఎంవీ) 3 బిలియన్ డాలర్లకు ఎగబాకిందని, ఆన్‌లైన్ షాపింగ్‌లో కొనుగోలు చేసేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నదని రెడ్‌సీర్ కన్సల్టింగ్ ఫౌండర్, సీఈవో అనిల్ కుమార్ తెలిపారు. సర్వేలోని పలు ముఖ్య అంశాలు..

- దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో అమ్ముడైన వస్తువుల్లో గ్రామీణ ప్రాంతాల వాటా క్రమంగా పెరుగుతున్నది
- రాయితీలు, రిటర్నులు, రద్దు, క్యాష్ బ్యాక్ ప్రొడక్టులు అత్యధికంగా అమ్ముడయ్యాయి.
- కొనుగోలుదారులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ సంస్థలు ఇలా ప్రత్యేక ఆఫర్లను తెరపైకి తీసుకొస్తున్నాయి.
- విక్రయాల్లో మొబైల్ ఫోన్ల వాటా అత్యధికంగా 55 శాతంగా ఉన్నది.
- సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లు ప్రకటించిన ప్రత్యేక రాయితీ ఆఫర్ల మొత్తం సేల్స్‌లో వీటి వాటా 90 శాతం.
- 'గ్రేట్ ఇండియన్ ఫెస్టివెల్‌లో అమెజాన్‌లో 51 శాతం విక్రయాలు జరిపింది.
- 50 నగరాల్లో 1.90 లక్షల మంది డిజిటల్ యూజర్ల నుంచి సేకరించిన సమాచారంగా ఈ సర్వేను నిర్ణయించింది.

## మీ డబ్బుకు ఢోకాలేదు..: ఎల్‌ఐసీ

**ముంబై, అక్టోబర్ 9:** ఆర్థిక పరిస్థితి దిగజారినట్లు సామాజిక సైట్లలో వస్తున్న మోసపూరిత వార్తలను కొట్టిపారేసింది బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్‌ఐసీ). పాలసీదారుల డబ్బుకు ఎలాంటి ఢోకా లేదని ఒక ప్రకటనలో వెల్లడించింది. కార్పొరేషన్ భారీ నష్టాల్లో కూరుకుపోయిందని, కోటి మంది పాలసీదారుల డబ్బుపై ఆందోళన వ్యక్తమవుతున్నదని పలు సామాజిక సైట్లలో వార్త హల్‌చల్ చేస్తుండటంపై ఎల్‌ఐసీ ఈ స్పష్టతనిచ్చింది. ఈ తప్పుడు వార్తలతో పాలసీదారులు జాగురుకత వహించాలని, కంపెనీ ఆర్థిక వనరులకు వచ్చిన పెనుముప్పు లేదని పేర్కొంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో పాలసీదారులకు రూ.50 వేల కోట్ల బోనస్ చెల్లింపులు జరిపింది తమ సంస్థేనని చెప్పారు. ఆగస్టు 31నాటికి ఎల్‌ఐసీకి 72.84 కోట్ల మంది పాలసీదారులు ఉన్నారు. తొలి ప్రీమియం వసూళ్ళలో మార్చి నాటికి 66.24 శాతంగా ఉండగా, ఆగస్టు నాటికి ఇది 73.06 శాతానికి చేరుకున్నది.

# ఎస్బీఐ రుణాలు మరింత చౌక

- వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్
- డిపాజిట్లపై కూడా 25 బేసిస్ పాయింట్లు కోత

**ముంబై, అక్టోబర్ 9:**

బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) తన ఖాతాదారులకు మరోసారి ఊరట కల్పించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్(ఎంసీఎల్ఆర్)ని 10 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించిన వారం రోజుల్లో ఎస్బీఐ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం విశేషం. వీటితోపాటు లక్ష రూపాయల లోపు పొదుపు డిపాజిట్లపై వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రేటు 3.25 శాతానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(ఏప్రిల్ నుంచి) ఇప్పటి వరకు వడ్డీరేట్లను బ్యాంక్ తగ్గించడం ఇది ఆరోసారి. తగ్గించిన ఎంసీఎల్ఆర్ రేటు గురువారం(అక్టోబర్ 10) నుంచి అమలులోకి రాగా, పొదుపు ఖాతాలపై డిపాజిట్ రేట్ల తగ్గింపు నవంబర్ 1 నుంచి అమలులోకి రానున్నదని తెలిపింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై చెల్లించే వడ్డీరేటు 8.15 శాతం నుంచి 8.05 శాతానికి తగ్గనున్నది. కానీ, ఈ రుణాలు అక్టోబర్ 1 నుంచి రెపో రేటుతో అనుసంధానం అయి ఉండాలి. ప్రస్తుత పండుగ సీజన్‌లో ఖాతాదారులకు ఆర్థిక ప్రయోజనాలను కల్పించాలనే ఉద్దేశంతో అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లను 10 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించినట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. వీటితోపాటు పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను కూడా 3.50 శాతం నుంచి 3.25 శాతానికి తగ్గించింది. ఈ నెల 10 నుంచి అమలులోకి వచ్చేలా రిటైల్, బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను కూడా 10 బేసిస్ పాయింట్ల నుంచి 30 బేసిస్ పాయింట్ల వరకు కుదించింది. కాగా, గతవారంలో రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో రుణ రేటు పదేండ్ల కనిష్ఠ స్థాయి 5.15 శాతానికి తగ్గింది.

## రాష్ట్రంలో మరో 15 దవాఖానలు

### భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న మ్యాక్సివిజన్




**హైదరాబాద్, అక్టోబర్ 9:** హైదరాబాద్ కేంద్రస్థానంగా హెల్త్‌కేర్ సేవలు అందిస్తున్న మ్యాక్సివిజన్..వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. కంటి ఆరోగ్య సంరక్షణ ఆసుపత్రుల విభాగంలో ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవడానికి వరంగల్ కేంద్రస్థానంగా పనిచేస్తున్న శరత్ లేజర్ ఐ ఆసుపత్రిని కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ ఐ హాస్పిటల్స్ చైర్మన్ జీఎస్‌కే వేలు మాట్లాడుతూ..ఈ నూతన జాయింట్ వెంచర్‌తో తెలుగు రాష్ట్రాల్లో కంటి సంహరక్షణ ఆసుపత్రుల రెండో అతిపెద్ద సంస్థగా అవతరించినట్లు చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా 2021 నాటికి మరో 15 హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. వీటిలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మిర్యాలగూడ్‌లలో నెలకొల్పుతున్న ఆసుపత్రులు ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానుండగా, మిగతావి వచ్చే ఏడాది చివరినాటికి ప్రారంభించబోతున్నట్లు ఆయన మీడియాకు చెప్పారు. రాబోయే ఐదేండ్లకాలంలో మ్యాక్సివిజన్‌ను రూ.500 కోట్ల కంపెనీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు, దీంట్లోభాగంగా వ్యాపారాన్ని తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళకు కూడా విస్తరించాలనుకుంటున్నట్లు తెలిపారు.

## బెయిల్ ఇవ్వద్దు.. జైలుకే పంపండి

### పీఎంసీ బ్యాంక్ కేసులో ఆర్బీఐ చర్యలను తప్పుపట్టిన ఖాతాదారులు




**ముంబై, అక్టోబర్ 9:** పంజాబ్, మహారాష్ట్ర సహకార(పీఎంసీ) బ్యాంక్ ఖాతాదారులు ఆందోళనబాట పట్టారు. బ్యాంక్ ఆర్థిక సంక్షోభానికి కారణమైన వారిపై రిజర్వు బ్యాంక్ తీసుకుంటున్న చర్యలను తప్పుపట్టిన వీరు.. ముంబైలోని ప్రత్యేక కోర్టు ముందు గుమ్మిగుడి వీరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ భారీ మోసానికి పాల్పడిన వారికి బెయిల్ ఇవ్వవద్దని..జైలుకే పంపాలని వాళ్లు డిమాండ్ చేశారు. కోపోద్రిక్తులైన పలువురు కోర్టు ఆవరణలో ఉన్న వాహనాలపై దాడులు చేశారు. ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ము బ్యాంకు విత్‌డ్రాలో పరిమితి విధించడంతో ఇరుక్కుపోయాయని, మా పొదుపు సొమ్మును వెంటనే ఇవ్వాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు హెచ్‌డీఐఎల్ డైరెక్టర్లు సారంగ్, రాకేశ్ వాద్వాన్‌లను ఈ నెల 14 వరకు పోలీస్ కస్టడిలో ఉండాలని కోర్టు ఆదేశించింది.

## మాంద్యం భారత్‌కే ఎక్కువ

› మొదటిపేజీ తరువాయి...

తగ్గించింది. మానిటరీ పాలసీని తెలివిగా వినియోగించాలని, ఆర్థిక స్థిరత్వాన్ని పెంచాలని జార్జివా పిలుపునిచ్చారు. నిర్మాణాత్మక సంస్కరణలు ఉత్పాదకతను, అపారమైన ఆర్థిక ఫలితాలను అందిస్తాయన్న ఐఎంఎఫ్ తాజా పరిశోధనను ప్రస్తావిస్తూ.. మాధ్యమికంగా, దీర్ఘకాలికంగా గణనీయ వృద్ధిని సాధించేందుకు ఈ మార్పులు కీలకం కానున్నాయని చెప్పారు. సరైన సంస్కరణలు, సరైన దిశగా అమలుచేస్తే వర్ధమాన, అభివృద్ధి చెందుతున్న దేశాలు.. అభివృద్ధి చెందిన దేశాల్లోని జీవన ప్రమాణాలను రెట్టింపు వేగంతో అందుకునే అవకాశం ఉందని ఆమె వివరించారు. అంతర్జాతీయ సహకారం అవసరం పెరుగుతున్నదని, అయితే ఆ దిశగా సంకల్పం మాత్రం కొరవడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 'వాణిజ్యం కీలకాంశం. మనం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉన్నది. ఆర్థిక వ్యవహారాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం దగ్గర నుంచి ఫైనాన్షియల్ రెగ్యులేటరీ రిఫామ్ అజెండా అమలు, మనీ ల్యాండరింగ్, ఉగ్రవాదులకు నిధుల అడ్డుకట్ట వరకు సహకారం అందించుకోవాలి' అని ఆమె పేర్కొన్నారు. పర్యావరణ మార్పులను సంక్షోభంగా పేర్కొన్న జార్జియా..వాటి నిరోధానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కర్బన ఉద్గారాల తగ్గింపులో ఆయా దేశాలకు సహకారం అందిస్తామని చెప్పారు. బల్గేరియాకు చెందిన జార్జియా గత నెలలోనే ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వర్తమాన దేశానికి చెందిన వ్యక్తి ఐఎంఎఫ్ అధిపతి కావడం ఇదే తొలిసారి.

## జియో బాదుడు షురూ!

### ఇతర నెట్‌వర్క్‌లకు కాల్‌చేస్తే నిమిషానికి 6 పైసలు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:**

టెలికం రంగంలోకి అడుగుపెట్టి అనతికాలంలో దూసుకుపోయిన రిలయన్స్ జియో..వినియోగదారులకు షాకిచ్చింది. ఇకపై జియో నెట్‌వర్క్ నుంచి ఇతర నెట్‌వర్క్‌లకు చేసే ప్రతి కాల్స్‌పై నిమిషానికి 6 పైసలు చొప్పున చార్జీ వసూలు చేయనున్నట్లు ప్రకటించింది. అయితే, వినియోగదారులు చెల్లించిన మొత్తానికి బదులుగా డాటాను తిరిగి అందిస్తున్నట్లు ప్రకటించింది. ఐయూసీ చార్జీల విషయం టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ ఇచ్చిన నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే జియో నెట్‌వర్క్‌కు కాల్స్‌కు ఎలాంటి చార్జీలు విధించబోమని స్పష్టంచేసింది. అలాగే ఇన్‌కమ్మింగ్ కాల్స్‌కు, ల్యాండ్ లైన్స్, వాట్సప్ వినియోగం, ఫేస్‌టైం, ఇతర ప్లాట్‌ఫామ్ కింద ఎలాంటి రుసుమూ వసులు చేయబోమని ప్రకటించింది. 2017లో ఇంటర్ కనెక్ట్ యూసేజ్ చార్జీలను నిమిషానికి 14 పైసల నుంచి ఆరు పైసలకు తగ్గించిన ట్రాయ్.. 2020 జనవరి తర్వాత పూర్తిగా రద్దు చేయాలని యోచిస్తున్నది. టెలికం సేవలు ఆరంభించిన మూడేండ్ల నుంచి తన పోటీదారులైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియాలకు ఐయూసీ చార్జీల కింద జియో రూ.13,500 కోట్ల చెల్లింపులు జరిపింది. ఈ నేపథ్యంలో ట్రాయ్ నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ఐయూసీ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ నెల 10 తర్వాత రీచార్జి చేసే వారికి ఈ చార్జీలు వర్తిస్థాయని తెలిపింది. ఇప్పటి వరకు జియో వినియోగదారులు కాల్స్‌కు ఎలాంటి చార్జీలు చెల్లించడం లేదు. కేవలం డాటాకు మాత్రమే చెల్లిస్తున్నారు.

# పోటీతత్వంలో తిరోగమనం

### 10 స్థానాలు దిగజారి 68వ స్థానంలోకి భారత్: వరల్డ్ ఎకనమిక్ ఫోరం




**న్యూఢిల్లీ/జెనివా, అక్టోబర్ 9:** ప్రపంచంలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశాల్లో తొలి వరుసలో నిలిచిన భారత్‌కు పోటీతత్వంలో మాత్రం వెనుకడింది. ప్రస్తుత సంవత్సరానికిగాను విడుదలైన దేశాల జాబితాలో భారత ర్యాంక్ పది స్థానాలు పడిపోయి 68వ స్థానానికి జారుకున్నదని వార్షిక గ్లోబల్ కాంపిటేటివ్‌నెస్ ఇండెక్స్ పేరుతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) తాజా నివేదికను విడుదల చేసింది. పలు దేశాలు ర్యాంక్‌లు మెరుగుపడినప్పటికీ భారత్ ర్యాంక్ పడిపోవడం విస్మయానికి గురిచేస్తున్నది. ప్రపంచంలో అత్యంత పోటీ ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల్లో సింగపూర్ తొలిస్థానాన్ని ఆక్రమించుకున్నది. ఇప్పటి వరకు తొలిస్థానంలో ఉన్న అమెరికా రెండో స్థానంతో సరిపెట్టుకున్నది. గతేడాదిలో భారత్ 58వ స్థానంలో ఉన్నది. ఈ జాబితాలో బ్రిక్స్ దేశాలు ర్యాంకులు మెరుగుపడలేదు. భారత్ కంటే తక్కువగా బ్రెజిల్ 71వ స్థానంతో సరిపెట్టుకున్నది. భారత్ గురించి తాజాగా విడుదలైన నివేదికలో పలు అంశాలు..

- కార్పొరేట్ గవర్నెన్స్‌లో భారత ర్యాంక్ 15 స్థానాలు మెరుగుపడి రెండో స్థానానికి ఎగబాకింది.
- మార్కెట్ సైజ్‌లో మూడో స్థానంలో ఉండగా..రెన్యువబుల్ ఎనర్జీ రెగ్యులేషన్‌లోనూ మూడో స్థానం దక్కింది.
- ఇన్నోవేషన్‌లో ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే భారత్ మెరుగుపడింది.
- ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్స్, టెక్నాలజీ రంగాలను ఆపాదించుకునే దేశాల్లో భారత్ దూసుకుపోతున్నది.
- ఆరోగ్యకరమైన ఆయుర్దాయం జాబితాలో భారత్‌కు 109వ స్థానం లభించింది. మొత్తంగా 141 దేశాలు ఉన్నాయి. దక్షిణాసియా దేశాల కంటే దిగువస్థానంలో ఆఫ్రికా ఉన్నది
- మహిళ, పురుషుల కార్మికుల మధ్య అంతరం 0.26 శాతంగా ఉన్నది. ఈ జాబితాలో ర్యాంక్ 128వ స్థానంలో ఉన్నది.
- ప్రతిభావంతులు, ప్రోత్సాహక దేశాల ర్యాంకుల్లో 118వ స్థానంలో ఉండగా, నైపుణ్యంలో 107వ స్థానం లభించింది.
- పొరుగు దేశాల కంటే భారత్ ఉచ్చమైన స్థితిలో ఉన్నది. శ్రీలంక 84వ స్థానంలోనూ, బంగ్లాదేశ్ 105వ, నేపాల్ 108, పాకిస్తాన్ 110వ స్థానంలో నిలిచాయి.
- గడిచిన ఏడాదికాలంలో కొలంబియా, దక్షిణాఫ్రికా, టర్కీ దేశాల ర్యాంకులు మెరుగుపడి భారత్‌ను దాటేశాయి.
- అంతర్జాతీయ మందగమన పరిస్థితులు భారత్‌పై తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతున్నాయని నివేదిక పేర్కొంది.
- సింగపూర్ తొలి స్థానం వరించగా, రెండో స్థానంలో అమెరికా, ఆ తర్వాతి స్థానంలో హాంకాంగ్, నెదర్లాండ్స్‌కు 4వ స్థానం, స్విట్జర్లాండ్‌కు ఆ తర్వాతి స్థానం వరించింది.
- కొరియా, జపాన్, ఫ్రాన్స్, చైనాల ఆర్థిక స్థితిగతులు బలపడ్డాయి.
- బ్రిక్స్ దేశాల నుంచి చైనా ఒక్కటే 28వ స్థానం లభించింది.

# మారుతి ప్రొడక్షన్ కట్

### వరుసగా ఎనిమిదో నెల తగ్గించిన సంస్థ




**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** ఆటోమొబైల్ రంగంలో మందకొడి పరిస్థితులు కొనసాగుతున్నాయి. ప్రస్తుత పండుగ సీజన్‌పై గంపెడు ఆశ పెట్టుకున్న సంస్థలకు నిరాశే ఎదురైంది. దీంతో చేసేదేమి లేకపోవడంతో ఉత్పత్తిని తగ్గించుకుంటున్నాయి. కార్ల తయారీ దిగ్గజం మారుతి కూడా వరుసగా ఎనిమిది నెలలో సెప్టెంబర్‌లోనూ తన ఉత్పత్తిని 17.48 శాతం తగ్గించుకుఉన్నది. గత నెలలో సంస్థ కేవలం 1,32,199 యూనిట్లను ఉత్పత్తి చేసింది. ఏడాది క్రితం ఇదే నెలలో 1,60,219 కార్లను ప్రొడ్యూస్ చేసినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. వీటిలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి 1,57,659 యూనిట్ల నుంచి 1,30,264 యూనిట్లకు పడిపోవడంతో కంపెనీ ఉత్పత్తిపై భారీ దెబ్బ తీసింది. మినీ, కాంప్యాక్ట్ సెగ్మెంట్ కార్లైన ఆల్టో, న్యూ వ్యాగన్ ఆర్, సెలేరియో, ఇగ్నిస్, స్విఫ్ట్, బాలెనో, డిజైర్‌ల ఉత్పత్తి 1,15,576ల నుంచి 98,337లకు తగ్గించింది. వీటితోపాటు విటారా బ్రెజ్జా, ఎర్టిగా, ఎస్-క్రాస్ మోడళ్ల ఉత్పత్తి కూడా 17.05 శాతం తగ్గించుకున్న సంస్థ..మధ్యస్థాయి సెడాన్ సియాజ్‌ను 2,350 యూనిట్లు ప్రొడ్యూస్ చేయగా, లైట్ కమర్షియల్ వాహనమైన సూపర్ కెర్రీలను కూడా తగ్గించుకున్నది. కాగా, మరో సంస్థ టాటా మోటర్స్ కూ డా 63 శాతం ఉత్పత్తిని తగ్గించుకున్నట్లు ఇదివరకే ప్రకటించింది. గత నెలలో మారుతి, హ్యుందాయ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, టయోటా, హోండా విక్రయాలు రెండంకెల స్థాయిలో పడిపోయాయి.

## తొమ్మిది నెలల్లో అమ్ముడైన ఒకే ఒక నానో కారు



**ఎంతో** ప్రతిష్ఠాత్మకంగా మార్కెట్లోకి టాటా మోటర్స్ ప్రవేశపెట్టిన నానో కారు కాలగర్భంలో కలిసిపోయేటట్లు కనిపిస్తున్నది. ప్రస్తుత సంవత్సరంలో తొమ్మిది నెలల్లో ఎలాంటి ఉత్పత్తి చేయకపోగా, కేవలం ఒకటంటే ఒక్క యూనిట్‌ను విక్రయించింది. అయినప్పటికీ ఈ కారును ఉపసంహరించుకోవడం లేదని ప్రకటించకపోవడం విశేషం. ఈ నానో కారును బీఎస్-6 ప్రమాణాలతో తయారు చేస్తున్నట్లు తెలుస్తున్నది. గతేడాది 297 యూనిట్లను ఉత్పత్తి చేయగా, 299 యూనిట్ల విక్రయాలు జరిపింది.



వేములవాడలో స్వాత్మానందేంద్రసరస్వతీస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, ఆలయ అధికారులు

# రాజన్న ఆలయంలో ప్రముఖుల పూజలు

- దర్శించుకున్న విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి
- మహారాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి సుధీర్ మునుగంటివార్

**వేములవాడ కల్చరల్:** విజయదశమిని పురస్కరించుకొని వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతిస్వామివారు ఆలయాన్ని సందర్శించారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయఈవో కృష్ణవేణి పాదపూజ చేశారు. రాజరాజేశ్వరస్వామిని మహారాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి సుధీర్ మునుగంటివార్ కుటుంబసమేతంగా సందర్శించారు. ఆయనకు జెడ్పీ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణా రాఘవరెడ్డి, జేసీ యాస్మిన్‌బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు, ఆలయ వేదపండితులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కుటుంబసమేతంగా స్వామివారికి మంత్రి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో కృష్ణవేణి రాజన్న తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు, అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన మరిపెల్లి ప్రవీణ్ ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తూ, అక్కడ అత్యల్ప ఉష్ణోగ్రతల వద్ద సూర్య నమస్కారాలుచేస్తూ రికార్డులు నెలకొల్పుతున్నారు. ప్రవీణ్ బుధవారం ఆస్ట్రియా దేశంలోని సోర్గ్ క్లాఫెన్ పర్వతాన్ని అధిరోహించి 1,635 మీటర్ల ఎత్తులో తొమ్మిది డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 26 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలను పూర్తిచేశారు. గుజరాత్ వడోదరలోని యోగానికేతన్‌లో యోగా శిక్షకునిగా పనిచేస్తున్న ప్రవీణ్ ఇప్పటివరకు తొమ్మిది ఎత్తైన పర్వతాలను అధిరోహించారు.

- మెట్‌పల్లి రూరల్



# కేజీబీవీలకు పెరుగుతున్న ఆదరణ

- ఈ ఏడాది 1.05 లక్షల ప్రవేశాలు నమోదు
- ఎస్సెస్సీ ఫలితాల్లో 97.76 శాతం ఉత్తీర్ణత
- జాయ్‌ఫుల్ లెర్నింగ్, డిజిటల్ టీచింగ్
- బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కొనసాగుతున్న 475 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఆదరణ పెరుగుతున్నది. ఈ విద్యాసంవత్సరం సెప్టెంబర్ నాటికి 1,05,183 మంది బాలికలు ప్రవేశాలు పొందారు. పదోతరగతి వరకు 90,773 మంది బాలికలు, జూనియర్ కళాశాలుగా అప్‌గ్రేడ్ చేసిన 88 కేజీబీవీలలో 14,410 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉచిత యూనిఫారాలు అందజేయడంతోపాటు, హాస్టల్ వసతి, మార్షల్‌ఆర్ట్స్‌లో శిక్షణ, పలురకాల పోటీపరీక్షలకు శిక్షణ, ఒకేషనల్ విద్యావిధానం అందుబాటులోకి తీసుకురావడంతో కేజీబీవీల్లో చేరేందుకు బాలికలు ఆసక్తి చూపిస్తున్నారని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు. 2019 మార్చిలో వెలువడ్డ ఎస్సెస్సీ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు 97.76 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఎనిమిది మంది విద్యార్థినుల 10/10 సాధించగా.. వారిలో ఐదుగురు బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాలు పొందారని చెప్పారు. 1,755 మంది 9.0 జీపీఏ పొందారన్నారు. 2018లో 81.78 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది 15.98 శాతం ఉత్తీర్ణత అధికంగా సాధించారని చెప్పారు.

**విద్యార్థినులకు పోషకాహారం**

కేజీబీవీల్లో హస్టళ్లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు.. పోషక విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థినులకు అందజేస్తున్నారు. బాలికల్లో రక్తహీనతను నివారించడానికి చర్యలు తీసుకుంటున్నారు. రోజూ నెయ్యితోఅన్నం, రాగిజావ, వారానికి నాలుగుసార్లు గుడ్లు, నెలలో నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్, వారంలో ఐదురోజులు పండ్లు, అదనంగా విద్యార్థులకు స్నాక్స్ కూడా పెడుతున్నారు. క్రమం తప్పకుండా బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ.. ఏఎన్ఎం ఆధ్వర్యంలో తగినవైద్యం చేస్తూ.. మందులు అందుబాటులో ఉంచుతున్నారు. 15 రకాల వస్తువులతో కూడిన హెల్త్‌కిట్లను సైతం అందజేస్తున్నారు. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుచేశారు. ప్రతి స్కూల్‌లో పీఈటీ నియమించి క్రీడలపై ప్రత్యేకశిక్షణ ఇస్తున్నారు. మూడుజిల్లాల్లోని కేజీబీవీల్లో శానిటరీ నాప్‌కిన్స్ తయారీయంత్రాలను ఏర్పాటు చేశారు. 475 కేజీబీవీల్లో హరితహారం కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నారు. చాలా పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు, మరికొన్ని స్కూళ్లలో పూలతోటలు నిర్మించారు. పదిహేనురోజులపాటు జాయ్‌ఫుల్ విద్యాబోధన, డిజిటల్ టీచింగ్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు.

**సీసీ కెమెరాలు.. ప్రహరీ నిర్మాణాలు**

కేజీబీవీ విద్యార్థుల రక్షణకోసం ప్రహరీలు నిర్మించి.. సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి రోజు పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా మహిళా సిబ్బందిని వాచ్‌మన్‌గా నియమించారు. సందర్శకుల రాకపోకల వివరాలు నమోదు చేసుకునేందుకు రిజిస్టర్లను కూడా నిర్వహిస్తున్నట్టు కేజీబీవీ అధికారి తెలిపారు.



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్లలో క్షతగాత్రులను దవాఖానకు తరలిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## మానవత్వం చాటుకున్న మంత్రి ఈశ్వర్

- దవాఖానకు క్షతగాత్రుల తరలింపు

**గొల్లపల్లి:** ప్రమాదంలో గాయపడినవారిని వైద్యశాలకు తరలించి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మానవత్వాన్ని చాటుకున్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం వెనుగుమట్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను పోలీసు వాహనంలో జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గొల్లపల్లి- వెనుగుమట్ల మధ్యలో రాఘవపట్నం గ్రామానికి చెందిన బొల్లారపు రాజేశం, గొల్లపల్లికి చెందిన కోమల్ల నరేశ్ ద్విచక్ర వాహనాలపై వచ్చి ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. కాన్వాయ్ నుంచి గమనించిన మంత్రి కొప్పుల ఈశ్వర్ వెంటనే స్పందించి పోలీసు వాహనంలో వైద్యశాలకు తరలించేదాకా దగ్గరుండి చూసుకున్నారు.



కరీంనగర్ జిల్లాలో ఎల్ఎండీ కాలనీలో దసరా వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రులు ఈటల, గంగుల, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించిన రావణవధ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

## తల్వార్లతో దాడి.. నలుగురికి గాయాలు

### మంచిర్యాల జిల్లాలో దసరారోజు ఘర్షణ

**నెన్నెల:** మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. తల్వార్లతో దాడిచేయడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గంగారం గ్రామానికి చెందిన కామెర శ్రీనివాస్, అతడి తమ్ముడు ఆనంద్ మరో ఇద్దరు అదేగ్రామానికి చెందిన మల్లపల్లి శేఖర్‌తో డీజే విషయంలో సోమవారం బతుకమ్మ పండుగ రోజు గొడువపెట్టుకున్నారు. దానిని మనసులో పెట్టుకొని ఆనంద్ అనుచరులు ఇద్దరు రాత్రి డీజేపెట్టి హల్‌చల్‌చేయడంతో స్థానిక ఎంపీపీకి శేఖర్ ఫిర్యాదుచేశారు. దీంతో వారు తల్వార్లతో శేఖర్‌ను చుట్టుముట్టారు. తనను చంపేస్తున్నారంటూ శేఖర్ కేకలువేయగా గ్రామస్థులు వారిని పట్టుకున్నారు. అప్పటికే శేఖర్ తల, చేతికి గాయాలుకాగా, అతడి సోదరుడు శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు కోపోద్రిక్తులై ఆనంద్, శ్రీనివాస్‌లపై దాడిచేశారు. వారినుంచి తల్వార్‌ను లాక్కున్నారు. ఎస్సై మొగిలి ఘటనాస్థలానికి చేరుకొని ఎయిర్ పిస్టల్, తల్వార్లను స్వాధీనం చేసుకున్నారు. గాయపడినవారిని బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు. బుధవారం ఉదయం బెల్లంపల్లి రూరల్ సీఐ జగన్ గంగారంలో ఘటనపై విచారణ చేపట్టారు.




# అంబరాన్నంటిన దసరా సంబురాలు

- వరంగల్‌లో కన్నుల పండువలా రావణవధ
- హాజరైన మంత్రి ఎర్రబెల్లి, ఎంపీలు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నరేందర్



వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించిన రావణవధ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎంపీలు బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తదితరులు

**కరీమాబాద్ (వరంగల్)/ తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ/ కరీంనగర్:** వరంగల్ నగరంలో, కరీంనగర్ జిల్లాలో దసరా వేడుకలు అంబరాన్నంటాయి. వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించిన రావణవధ కన్నుల పండువలా సాగింది. విజయదశమిని పురస్కరించుకొని మంగళవారం ఏర్పాటుచేసిన భారీ రావణ ప్రతిమను దహనం చేశారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు వేలసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. మైదానంలో పేల్చిన తారాజువ్వల వెలుగు కనువిందు చేసింది. ఉత్సవ సమితి అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. చెడుపై మంచి విజయం సాధించడమే విజయదశమి అన్నారు. అనంతరం రావణవధను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎంపీలు డాక్టర్ బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, వరంగల్ మహానగరపాలక సంస్థ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, రాష్ట్ర మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కలెక్టర్ పీజే పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ జిల్లాలో అట్టహాసంగా వేడుకలు**

కరీంనగర్ జిల్లాలో దసరా వేడుకలు అట్టహాసంగా సాగాయి. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామపంచాయతీ పరిధి ఎల్ఎండీ కాలనీ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో మంగళవారంరాత్రి దసరా వేడుకలు నిర్వహించారు. మంత్రులు ఈటల రాజేందర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్సీ రావణ సంహారం కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, తిలకించారు. రసమయి బాలకిషన్ నిర్మాణ సారథ్యంలో బిత్తిరిసత్తి హీరోగా, ప్రియయాదవ్ హీరోయిన్‌గా నటించిన 'తుపాకీ రాముడు' సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. గాయని విజయలక్ష్మి, నటి, యాంకర్ శ్రీవాణి, గాయకులు హన్మంతుయాదవ్, మామిడి మౌనిక, లక్ష్మి, ఆటపాటలతో అలరించారు. డ్రిల్ మ్యాన్ క్రాంతి చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయంలో నిర్వహించిన దసరా వేడుకల్లో మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి హాజరై, శమీ పూజలో పాల్గొన్నారు.



## పర్యాటక కేంద్రంగా కందనూలు

### మినీ ట్యాంక్‌బండ్‌లో బోటు ట్రయల్ రన్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్‌టౌన్:** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుకుందామని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మినీ ట్యాంక్‌బండ్(కేసరి సముద్రం చెరువు)లో ఏర్పాటుచేసిన ట్రయల్ బోటులో షికారు చేశారు.

## కుమ్రంభీం ఆసిఫాబాద్ డీఈవో సరెండర్

**ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారి భిక్షపతిని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆదేశాలు జారీ చేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారుల ఫిర్యాదుమేరకు జిల్లాస్థాయి అధికారి నివేదిక అనంతరం చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబుకు డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం ఉదయ్‌బాబుకు ఉత్తర్వులను సెక్టోరల్ అధికారులు అందజేశారు.

## ప్రాణంతీసిన సెల్ఫీ

- వరంగల్ అర్బన్ జిల్లాలో టెన్త్ విద్యార్థిని మృతి



అర్చన (ఫైల్)

**ధర్మసాగర్:** సెల్ఫీతీసుకుంటుండగా విద్యుదాఘాతంతో టెన్త్‌విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లెలో మంగళవారం చోటుచేసుకున్నది. నర్సింగరావుపల్లెకు చెందిన రాంచందర్ కూతురు అర్చన (15) ధర్మసాగర్‌లోని జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నది. గ్రామ బొడ్రాయి వద్ద దసరా వేడుకలను.. అర్చన సెల్‌ఫోన్‌తో సెల్ఫీ తీసుకుంటుండగా విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురైంది. బాధితురాలిని చికిత్స కోసం తరలించేందుకు యత్నిస్తుండగానే చనిపోయింది.

## దొడ్డిపల్లిలో జవాన్ల హల్‌చల్

- మద్యం తాగి బీరు బాటిల్‌తో యువకుడిపై దాడి

**నవాబ్‌పేట:** మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం దొడ్డిపల్లిలో మంగళవారం రాత్రి ఆర్మీ జవాన్లు మద్యం తాగి హల్‌చల్ సృష్టించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కూచూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు పిట్టల శేఖర్, శివ, విజయ్, రామలింగంతోపాటు స్థానిక యువకులు గోపాల్, నాగరాజు మంగళవారం రాత్రి మద్యం తాగి బైక్‌లపై కేకలువేస్తూ దొడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ కిరాణాషాపు వద్ద జవాన్లు అరుస్తూ బీభత్సం సృష్టిస్తుంటే అదే గ్రామానికి చెందిన వడ్డె రాజు వారిని వారించడానికి ప్రయత్నించగా దాడిచేశారు. బీరు బాటిల్‌లో రాజును కడుపులో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని మహబూబ్‌నగర్‌లోని దవాఖానకు తరలించారు. నలుగురు జవాన్లతోపాటు మరో ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 10 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



# సోయా.. రుచుల మాయ!

మాంసం కంటే ఎక్కువ ప్రొటీన్‌లు పొందాలన్నా..
అధిక మొత్తంలో ప్రోటీన్‌లు లభించాలన్నా..
సోయా అన్నిటిలో బెస్ట్ అంటున్నారు ఆహారనిపుణులు..
కేవలం ఆరోగ్యం విషయంలోనే కాదు..
రుచిలోనూ సోయా వంటలు ది బెస్ట్..
అందుకే ఆ టేస్టీ వంటకాలు మీకోసం..



## సోయా దోశ

**కావాల్సినవి :**

**సోయా :** అర కప్పు
**బియ్యం :** ఒక కప్పు
**మినుపపప్పు :** అర కప్పు
**నూనె, ఉప్పు :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** సోయా బీన్స్‌ని మెత్తని పౌడర్ చేసి పెట్టుకోవాలి. ముందు రోజు రాత్రి మినుపపప్పు, బియ్యం విడివిడిగా నానబెట్టుకోవాలి.
**స్టెప్ 2 :** ఉదయం బియ్యం, మినుపపప్పు, కాస్త ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. దీంట్లో సోయా పౌడర్‌ని వేసి కలుపుకొని పెట్టుకోవాలి.
**స్టెప్ 3 :** పెనం పెట్టి కాస్త నూనె రాసి.. దోశలు పోసుకోవాలి. రెండు వైపులా కాల్చుకొని, ఏదైనా చట్నీతో తింటే టేస్టీగా ఉంటాయి.



## సోయా దహీ వడ

**కావాల్సినవి :**

**సోయా నగ్గెట్స్ :** ఒక కప్పు, **మినుపపప్పు :** అర కప్పు, **పెరుగు :** ఒక కప్పు, **నల్ల ఉప్పు :** అర టీస్పూన్, **సోంపు :** అర టీస్పూన్, **జీలకర్ర పొడి :** చిటికెడు, **కారం :** చిటికెడు, **స్వీట్ చట్నీ :** ఒక టేబుల్‌స్పూన్, **గ్రీన్ చట్నీ :** ఒక టేబుల్‌స్పూన్, **క్యారెట్ తురుము :** ఒక టేబుల్‌స్పూన్, **అల్లం తురుము :** అర టీస్పూన్, **చాట్‌మసాలా :** చిటికెడు, **ఉప్పు, నూనె :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** మినుపపప్పును ముందుగా గంటపాటు నానబెట్టాలి. ఈలోపు సోయా నగ్గెట్స్‌ని వేడి నీటిలో వేసి ఐదు నిమిషాలు ఉంచి తీయాలి. అందులో నీళ్లు లేకుండా చేసుకోవాలి.
**స్టెప్ 2 :** మినుపపప్పును మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. దీన్ని ఒక గిన్నెలో వేసి ఉప్పు, అల్లం తురుము వేసి కలుపాలి. రెండు నిమిషాలు ఆగి సోయా నగ్గెట్స్ వేసుకోవాలి.
**స్టెప్ 3 :** కడాయిలో నూనె పోసి వేడి చేయాలి. మినుపపప్పు మిశ్రమాన్ని చిన్న చిన్న వడల్లా చేసుకొని నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.
**స్టెప్ 4 :** ఒక గిన్నెలో నీళ్లను కాస్త గోరువెచ్చగా మరగబెట్టాలి. ఇందులో కాస్త ఉప్పు వేసి, వేయించుకున్న వడలను ఇందులో వేయాలి. మరో గిన్నెలో పెరుగు, నల్ల ఉప్పు, సోంపు పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలుపాలి.
**స్టెప్ 5 :** ఇందులో నీటిలో ఉంచిన వడలు వేసి కారం, జీలకర్ర పొడి, స్వీట్ చట్నీ, గ్రీన్ చట్నీ వేసి కలుపాలి. చివరగా క్యారెట్ తురుముతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.



**సంజయ్ తుమ్మ**
సెలబ్రిటీ చెఫ్

## సోయా లోబియా టిక్కీస్

**కావాల్సినవి :**

**రాజ్మా :** ఒక కప్పు, **సోయా :** 3/4 కప్పు, **పసుపు :** అర టీస్పూన్, **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** అర టీస్పూన్, **కారం :** ఒక టీస్పూన్, **ధనియాల పొడి :** అర టీస్పూన్, **జీలకర్ర పొడి :** అర టీస్పూన్, **నిమ్మరసం :** రెండు టీస్పూన్స్, **పుల్కాలు :** 4, **ఉల్లిగడ్డ :** 1, **టమాటా :** 1, **ఉప్పు, నూనె :** తగినంత



**తయారీ :**

**స్టెప్ 1 :** సోయా, రాజ్మా రెండింటినీ నీళ్లలో వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం ఉడికించాలి. ఆ తర్వాత రాజ్మాని మాత్రం చేతితో మెత్తగా చేసుకోవాలి.
**స్టెప్ 2 :** ఇందులో పసుపు, కారం, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ధనియాల పొడి, జీలకర్ర పొడి, నిమ్మరసం పోసి బాగా కలుపుకోవాలి.
**స్టెప్ 3 :** దీంట్లో సోయా గింజలు, ఉప్పు వేసి కలుపుకోవాలి. వీటిని చిన్న చిన్న టిక్కీలుగా చేసుకోవాలి.
**స్టెప్ 4 :** కడాయిలో నూనె పోసి వీటిని గోల్డెన్ కలర్ వచ్చేవరకు వేయించుకోవాలి. ఇప్పుడు పుల్కాల మీద వీటిని పెట్టి పైన ఉల్లిపాయ ముక్కలు, టమాటా ముక్కలు వేసి మడిచి తింటే ఆ టేస్టే వేరు.

## సోయా కీమా కచోరీ



**కావాల్సినవి :**

**సోయా గింజలు :** ఒక కప్పు,
**మైదా :** 3/4 కప్పు,
**ఆమ్‌చూర్ పౌడర్ :** పావు టీస్పూన్, **ఉల్లిగడ్డ :** 1,
**ధనియాల పొడి :** అర టీస్పూన్, **గరం మసాలా పొడి :** అర టీస్పూన్,
**కరివేపాకు :** ఒక రెమ్మ,
**కారం :** అర టీస్పూన్,
**ఉప్పు, నూనె :** తగినంత

**తయారీ :**

**స్టెప్ 1 :** వేడినీళ్లలో సోయాగింజలు వేసి ఐదు నిమిషాలు ఉంచి తీసేయాలి. వీటిని ఒక పక్కన పెట్టాలి.
**స్టెప్ 2 :** ఒక గిన్నెలో మైదా, ఉప్పు, కొద్దిగా నూనె పోసి మూత పెట్టేయాలి. కాసేపటి తర్వాత మరికొంత నూనె పోసి మూత పెట్టి పక్కన ఉంచాలి.
**స్టెప్ 3 :** కడాయిలో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, సోయా, ఆమ్‌చూర్ పౌడర్, ధనియాల పొడి, గరం మసాలా పొడి, కారం, కరివేపాకు వేసి వేయించాలి.
**స్టెప్ 4 :** ఇప్పుడు మైదా పిండిని చిన్న చిన్న ఉండలు చేసి అందులో సోయా మిశ్రమాన్ని వేసి చిన్న ఉండలా చేసుకోవాలి. ఇలా పిండి మొత్తం చేసి పెట్టుకోవాల్సి ఉంటుంది.
**స్టెప్ 5 :** కడాయిలో నూనె ఎక్కువగా పోసి.. అందులో వీటిని వేసి సన్నని మంటమీద వేయించాలి. అంతే.. టేస్టీ కచోరీలు రెడీ!

# తక్కువ ఖర్చుతో వ్యవసాయం



**చిన్నప్పుడు తాతయ్యతో కలిసి పొలం దగ్గరకు వెళ్లేది. అతను వ్యవసాయం చేసే విధానాన్ని దగ్గరుండి గమనించేది. అప్పుడప్పుడూ పొలం పనులూ చేసేది. పెళ్లై, పిల్లలు పుట్టినా.. పల్లెటూరిని వదిలేసి నగర జీవితాన్ని అనుభవిస్తున్నా.. ఈమెకు వ్యవసాయంపై మక్కువ తగ్గలేదు. ఆ ఇష్టమే ఆమెను తక్కువ ఖర్చుతో కాయగూరలు పండించే విధానంవైపు నడిపించింది.**

గుజరాత్‌లోని వడోదరకు చెందిన అవనిజైన్‌కు వ్యవసాయమంటే చాలా ఇష్టం. ఒక పంటను పండించి.. దానిని మార్కెట్ చేయడానికి రైతులు పడే కష్టాన్ని ఆమె కళ్లారా చూసింది. విపరీతంగా పురుగుమందులు, రసాయనాలు వాడి నష్టపోతున్న రైతన్నల వ్యథలనూ విన్నది. ఆ విష రసాయనాల ఆహారం తిని.. అనారోగ్యం పాలవుతున్న ఎంతోమందిని దగ్గరగా చూసింది. అందుకే అతితక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన, సేంద్రియ పద్ధతిలో పండించే కాయగూరలను ప్రజలకు అందించాలని సంకల్పించింది. మట్టి అవసరం లేకుండా కొబ్బరి పీచు, సేంద్రియ ఎరువులతో కూడిన ఓ కుండీని రూపొందించింది. తన 'ఉపాజ్' కంపెనీ ద్వారా కొబ్బరి పీచు కుండీ, కాయగూరల విత్తనాలు, సేంద్రియ ఎరువులతో కూడిన కిట్‌ను రూ.299లకు విక్రయిస్తున్నది. ఈ ఉపాజ్ సంస్థ ద్వారా నగరవాసులు ఇంట్లోనే ఆరోగ్యకరమైన కాయగూరలు పండించే విధానంపై అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నది అవని. తన పిల్లలకు వ్యవసాయంపై ఆసక్తిని పెంచడానికి ఇంటి పెరట్లోనే వారితో కూరగాయలు పండిస్తున్నది. అలాగే తన ఉపాజ్ సంస్థ ద్వారా పదిమందికి ఉపాధిని కల్పిస్తున్నది. 'తక్కువ ఖర్చుతో వ్యవసాయం' అనే అంశంపై ఎన్నో వర్క్‌షాపులు నిర్వహించింది కూడా.

# ఈ సమస్యకు కారణమేంటి?



**అడుగండి చెబుతా**

**నా వయసు 19 సంవత్సరాలు. గత కొంతకాలంగా నా ముఖంపై మొటిమలు, అవాంఛిత రోమాలు ఎక్కువగా వస్తున్నాయి. ముఖం జిడ్డుగా కూడా ఉంటున్నది. దీనికి తోడు బరువు కూడా పెరుగుతున్నది. మెడ భాగంలో చర్మం నల్లరంగులోకి మారుతున్నది. నా సమస్యకు పరిష్కారం తెలుపగలరు.**

**- నిఖిల, వరంగల్**

మీరు తెలిపిన వివరాల ప్రకారం మీకు పీసీఓడీ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) సమస్య ఉన్నట్టు అనిపిస్తున్నది. ఇది ఎక్కువగా యుక్తవయసు వారిలో కనబడుతుంది. మీ కుటుంబంలో ఎవరికైనా మధుమేహ వ్యాధి ఉండి, అధిక బరువుతో బాధపడి ఉంటే అవి వంశపారంపర్యంగా మీకు వచ్చే అవకాశం ఉంది. రోగ నిర్ధారణకు టెస్టోస్టిరాన్ హార్మోన్ లెవల్, పెల్విక్ అల్ట్రాసౌండ్ పరీక్షలతో పాటు బ్లడ్ షుగర్, థైరాయిడ్ స్థాయిలను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. మీ సమస్యలకు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే మందులు వాడడంతో పాటు రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజ్‌లు, డైట్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. మీకు అవాంఛిత రోమాలు మరీ ఎక్కువగా ఉన్నట్టయితే దాన్ని లేజర్ చికిత్స ద్వారా పరిష్కరించవచ్చు. ముందు మీరు మీ దగ్గరలోని ఎండోక్రైనాలజిస్టును కలవండి.



**డాక్టర్ సుధాకర్ రెడ్డి**
ఎండోక్రైనాలజిస్ట్
సన్‌షైన్ హాస్పిటల్స్
సికింద్రాబాద్



**చాలామంది అందానికి ప్రాధాన్యం ఇస్తూ వేలకు వేలు ఖర్చు చేస్తారు. అయితే కంటికి కనిపించే శారీరక సౌందర్యం మాత్రమే కాదు. మేలైన గుణగణాలు, వ్యక్తిత్వం కలిగి ఉంటేనే మనిషికి అసలైన అందం. ఈ మానసిక సౌందర్యం వయసుతో పాటు పెరుగుతూ ఉంటుంది. అయితే మానసిక సౌందర్యం అలవడాలంటే ఈ చిట్కాలు పాటిస్తే చాలు.**

# మానసిక సౌందర్యమే అందం

- దాపరికం లేకుండా మాట్లాడాలి. చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా చెప్పాలి. పెదాల మీద చిరునవ్వును ఎప్పుడూ చెరగనీయకూడదు. అందరితో స్నేహంగా ఉండాలి. డిజైనింగ్ దుస్తులు వాడలేకపోయినా శుభ్రంగా ఉన్న దుస్తులు ధరించాలి.
- మాట్లాడే వ్యక్తి కళ్లలోకి సూటిగా చూడడం అలవాటు చేసుకోవాలి. ఎదుటివారు చెప్పేదాన్ని పూర్తిగా విన్న తర్వాత మనోభావాల్ని వ్యక్తీకరించాలి. ఒకరితో మాట్లాడుతున్నప్పుడు మరొకరిని పొగడకూడదు, నిందించకూడదు.
- మాటల్లో వ్యక్తం కాని విషయాలను సున్నితమైన బాడీ లాంగ్వేజ్ ద్వారా చెప్పాలి. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరిపట్లా గౌరవమర్యాదలు ప్రదర్శించాలి. పని విషయంలో క్రమశిక్షణ పాటించాలి. అవసరమైనప్పుడు మృదుబాషణతో ఎదుటి వారి స్పందనను అంచనా వేసి దాన్ని బట్టి మనసులోని భావాలను వెల్లడించాలి.
- అవతలి వారు మనతో మాట్లాడడం ఓ ఆనందకర విషయంగా పరిగణించాలి. ఉన్నంతలో పోషక ఆహారం తీసుకుంటూ రోజూ వ్యాయామం చేయాలి. అబద్ధాలు చెప్పకూడదు. ఎదుటివారిని నొప్పిస్తూ మాట్లాడకూడదు.
- ఉన్నంతలో హుందాగా కనిపించే బట్టలు ధరించాలి. ఒకరి విషయాల్ని మరొకరి దగ్గర ప్రస్తావిస్తే ఎదుటివారికి మనపై నమ్మకం పోతుంది. నిజాయితీగా ఉండడం వల్ల ఎదుటివారిని ఆకర్షించవచ్చు.

# ఓర్చుకొని.. ఒంటరితనాన్ని జయించి..



బెంగళూర్ బస్టాండ్. ఆమె నిస్సహాయ స్థితిలో ఇద్దరు పిల్లలతో ఉంది. రెండు రాత్రులు అక్కడే గడిపింది. ఎవరైనా వచ్చి సాయం చేస్తారేమో అని ఎదురు చూసింది. ఓ వృద్ధురాలు వచ్చి సాయం చేసింది. ఆ సాయం ఆమె జీవితాన్ని మార్చింది. ఆమె జీవితాన్నే కాదు ఎంతోమంది జీవితాలను మార్చడానికి పునాది వేసింది.

సిఫియాకు 16 ఏండ్లప్పుడు పెండ్లయింది. రెండేండ్లలో ఇద్దరికి జన్మనిచ్చింది. 20 ఏండ్లకు భర్త విడాకులిచ్చాడు. దీంతో ఆమె సింగిల్ పేరెంట్ అయింది. పిల్లల కోసమైనా ఇంకో పెండ్లి చేసుకోమని చాలామంది అన్నారు. దీని కోసం ఎవరి మీదా ఆధారపడాలనుకోలేదు. పిల్లలను తీసుకొని బెంగళూర్ వెళ్లింది. అక్కడ తెలిసిన వాళ్లెవరైనా సాయం చేస్తారేమో అనుకుంది. కానీ ఎవరూ చేయలేదు. కొత్త ప్రాంతం, ఎవరిని కలవాలో అర్థం కాని పరిస్థితుల్లో ఆమె పిల్లలతో కలిసి ఓ బస్టాండ్‌లోనే రెండ్రోజులు గడిపింది. గమనించిన ఓ వృద్ధురాలు ఇంటికి తీసుకెళ్లింది. ఆ ఇంట్లోనే ఉండేందుకు అనుమతి ఇచ్చింది. ఇలా రోజులు గడిచాయి. పిల్లలకు ఆ వృద్ధురాలు అమ్మమ్మ అయింది. సిఫియాకు అమ్మగా మారింది. ఈ క్రమంలోనే సిఫియా ఉద్యోగ ప్రయత్నాలు చేసింది. ఓ కాల్‌సెంటర్‌లో చేరింది. పిల్లలను చదివించింది. ఆమె కూడా చదువుకోవాలనుకుంది. అప్పటికే ఇంటర్ చేసిన సిఫియా డిగ్రీలో బీఏ సాహిత్యంలో చేరింది. కాల్ సెంటర్ ఉద్యోగం మానేసి ఓ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా చేరింది. రోజులు సాఫీగా గడుస్తున్నాయి. దీనికి కారణమైన అమ్మమ్మ సాయం గుర్తొచ్చింది. తన లాంటి వారికి ఆమె సాయం చేయాలనుకుంది. 2013 నుంచి ఆమె జీతం నుంచి కొంత వితంతువులకు ఇవ్వడం ప్రారంభించింది. ఆన్‌లైన్ ద్వారా క్రౌడ్‌ఫండింగ్ చేసి వితంతువులను, వారి పిల్లలను ఆదుకుంటున్నది. 2015లో చిల్డ్రన్ చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించింది. సుమారు ఆరువందలకు పైగా కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నది సిఫియా. మరోవైపు ఆమె బీఏ తర్వాత బీఈడీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్లొమా, సోషల్ వర్క్‌లో మాస్టర్స్, ఇప్పుడు సాహిత్యంలో ఎంఏ చేస్తున్నది. ఒకనాడు ఏ దిక్కూ లేని సిఫియా నేడు ఎంతోమందికి పెద్ద దిక్కుగా, దేశంలో సామాజికవేత్తల్లో ఒకరిగా నిలిచింది.



# సీతాఫలం.. ఎంతో బలం

**వర్షాకాలం చివర్లో, చలికాలం ప్రారంభంలో సీతాఫలాలు ఎక్కువగా కాస్తాయి. అధిక ప్రొటీన్లు ఉన్న ఈ పండు తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు. పండు మాత్రమే కాదు చెట్టు వేరు, గింజలు, ఆకులు అన్నీ ఆరోగ్యానికి మంచి చేసేవే.**

- సీతాఫలం ఆకుల రసం తాగితే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. అలాగే చెట్టు వేరుతో పళ్లు తోముకుంటే దంత సమస్యలు తొలగిపోతాయి. దీంట్లోని పీచు పదార్థం అజీర్తిని తగ్గిస్తుంది. ఈ పండులో పొటాషియం, కార్బోహైడ్రేట్లు రక్తప్రసరణ బాగా జరిగేట్లు చూస్తాయి.
- సీతాఫలంలోని మెగ్నీషియం కండర వ్యవస్థను బలపరుస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. సీజన్‌లో రోజుకో సీతాఫలం తింటే అనేక వ్యాధుల్ని దూరం చేసుకోవచ్చు. వందగ్రాముల సీతాఫలంలో వందక్యాలరీలుంటాయి.
- సీతాఫలం గుండె, ఎముక, చర్మ సంరక్షణకు తోడ్పడుతుంది. ఇందులోని మెగ్నీషియం, గుండె నొప్పి, పక్షవాతం వంటివి రాకుండా కాపాడుతుంది. బలహీన గుండె, రక్తప్రసార లోపం, ఒత్తిడి, కండరాల బలహీనత, అధిక బీపీతో బాధపడేవాళ్లకు ఇది ఎంతో మంచిది.
- సీతాఫలం కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. డిప్రెషన్‌కు మందులా కూడా పనిచేస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తినేవారికి కీళ్లనొప్పులు వచ్చే అవకాశం తక్కువ. ఇది కడుపులో మంటను తగ్గిస్తుంది. చిగుళ్ల వ్యాధుల్ని నివారిస్తుంది. దీంట్లోని పీచు పదార్థం కొలెస్ట్రాల్ తగ్గేందుకు, రక్తంలో గ్లూకోజ్ శాతాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది.

II.
నమస్తే తెలంగాణ
రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 10 అక్టోబర్ 2019

raithubadi@ntnews.com



# దుంపజాతి కాయగూరల్లో విత్తనోత్పత్తి

**చలికాలంలో దుంప కూరగాయలు క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్. ఇవి రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. వీటిల్లో సూటిరకాలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. అయితే విత్తన సమస్య ఎక్కువే. అందుకే రైతులే సొంతంగా తమస్థాయిలో వీటిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. చాలా తేలిక కూడా. వీటిలో క్యారెట్, ముల్లంగి, బీట్ రూట్ మూడూ పరపరాగ సంపర్కం చెందే పంటలే. కల్తీల ఏరివేత, వేర్పాటుదూరంతో విత్తన నాణ్యత సాధ్యమవుతుంది.**

రాష్ట్రంలో వాణిజ్యంగా ముల్లంగి, క్యారెట్‌లను రైతులు సాగుచేస్తున్నారు. వీటిలో వాతావరణ అవసరాలను బట్టి రెండు రకాలున్నాయి. మొదటిది శీతల రకాలు లేదా యూరోపియన్ రకాలు. రెండోది ఉష్ణరకాలు. లేదా ఆసియాటిక్ రకాలు. శీతల రకాల విత్తనోత్పత్తి కొండ ప్రాంతాల్లో, ఉష్ణరకాల విత్తనోత్పత్తి మైదాన ప్రాంతాల్లో చేపడితే విత్తన నాణ్యత పెరుగుతుంది.



### విత్తనోత్పత్తికి అనుకూల రకాలు

#### ముల్లంగి

**ఆసియాటిక్ రకాలు:** కాశి శ్వేత, కాశి హ్యాన్స్, పూసా చట్కి, పూసా రశ్మి, జపనీస్ వైట్, కళ్యాణ్‌పూర్ నెం.1, కో-1, అర్క నిశాన్, చైనీస్ పింక్.
**యూరోపియన్ రకాలు:** వైట్ ఐసికుల్, పూసా హిమాని, స్కార్‌లెట్ గ్లోబ్.



#### క్యారెట్

**ఆసియాటిక్ రకాలు:** పూసా కేసర్, పూసా మేఘాలి,
**ఐరోపా రకాలు:** ఎర్లీ నాన్‌టెస్, బౌంటెనీ, జెనో, పూసా యమదగ్ని

#### టర్నిప్

**ఆసియాటిక్ రకాలు:** పూసా కాంచన్, పూసా శ్వేత, పంజాబ్ సఫేద్
**ఐరోపా రకాలు:** పూసా స్వర్ణిమ, పూసా చంద్రిమ, గోల్డెన్ బార్, స్నోబాల్



#### బీట్‌రూట్

కేవలం ఐరోపా రకాలే ఉన్నాయి. డెట్రాయిట్ డార్క్‌రెడ్, క్రింసన్ గ్లోబ్, ఈజిప్షియన్, ఎర్లీ వండర్స్
**విత్తే సమయం:** (మైదాన ప్రాంతాలలో)
**క్యారెట్:** అక్టోబర్ రెండో వారం వరకు
**ముల్లంగి:** (ఆసియాటిక్ రకాలు)
విత్తన మోతాదు, విత్తే దూరం, ఎరువులు
**ముల్లంగి:** హెక్టారుకు 8-10 కిలోలు వాడాలి. వరుసల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 8 సెం.మీ దూరం పాటించాలి. హెక్టారుకు 100 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ పోషకాలనిచ్చే ఎరువులు వాడాలి. అదనంగా హెక్టారుకు 10 కిలోల బోరాన్ వేయాలి.

**క్యారెట్:** హెక్టారుకు 8-10 కిలోల విత్తనం వాడాలి. వరుసల మధ్య 50 సెం.మీ, వరుసలలోని మొక్కల మధ్య 10 సెం.మీ దూరం పాటించాలి. 80 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాలను ఇచ్చే ఎరువులు వాడాలి.

దుంప కూరలలో మైదాన ప్రాంతాలలో ఆసియా రకాల్లో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అదే ఐరోపా రకాలు, శీతల రకాల్లో విత్తనోత్పత్తి కొండ ప్రాంతాల్లో చేపట్టవచ్చు. విత్తనం నుంచి విత్తనం వరకు లేదా వేరు నుంచి విత్తనం పద్ధతిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే భూమి నుంచి వేరును తీసి మళ్లా ప్రధాన పొలంలో నాటే విత్తనం తీసే పద్ధతిలో నాణ్యమైన విత్తనం అందుతుంది. ఎందుకంటే ప్రధాన పొలంలో నాటే సమయంలో జన్యు స్వచ్ఛత కల్గిన వేరు రకాలను ఎంచుకుని నాటుకుని విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. పూర్తిగా మార్కెట్ పరిమాణానికి వచ్చిన దుంపలు ఎంచుకుని, వాటిని భూమిపై అలాగే కింద 2-3 ఇంచులు ఉంచి, మిగతాది కత్తిరించాలి. వాటిని భూమిలో నాటుకోవాలి.

#### కల్తీల ఏరివేత

**క్యారెట్:** విత్తిన 20-30 రోజుల తర్వాత మొదటిసారి, భూమి నుంచి తీసిన తర్వాత రెండోసారి, పూత సమయంలో మూడోసారి, గింజలు ఏర్పడే దశలో కల్తీలు ఏరివేతకు నాలుగుసార్లు క్షేత్ర తనిఖీలు చేపట్టాలి.
**ముల్లంగి, టర్నిప్:** విత్తిన 20-30 రోజులకు, వేర్ల ఎంపికప్పుడు, పూత సమయంలో మూడుసార్లు క్షేత్ర తనిఖీలు చేపట్టాలి.

#### కోత, విత్తన సేకరణ

ముల్లంగిలో కాయలు పసుపు పచ్చ రంగులోకి మారినప్పుడు కోయాలి. తర్వాత ఎండబెట్టి, విత్తనాలు సేకరించాలి. హెక్టారుకు 600-1000 కిలోల విత్తన దిగుబడి వస్తుంది. క్యారెట్‌లో విత్తనాలు 'అంబెల్స్'లో ఏర్పడుతాయి. ప్రధానకాండంపై ఏర్పడే అంబెల్స్ పెద్దగా ఉంటాయి. వీటినే 'కింగ్ అంబెల్స్' అంటారు. కొమ్మల చివర్లలో ఏర్పడేవి ద్వితీయ అంబెల్స్. వీటిలో పై నుంచి కిందికి పూలు ఏర్పడుతాయి. రెండో అంబెల్ కాండం నుంచి తృతీయ అంబెల్స్ ఏర్పడుతాయి. ప్రాథమిక అంబెల్స్‌లోని విత్తనాలు బరువుగా, పరిణితి చెంది, అధిక నాణ్యతతో ఉంటాయి. అయితే అంబెల్స్‌లోని అన్ని గింజలు ఒకేసారి పక్వానికి రావు. అందుకే దఫాలుగా విత్తన సేకరణ చేయాలి. తృతీయ అంబెల్స్ పసుపు పచ్చ రంగులోకి మారిన తర్వాత వాటిని కోసి, నీడలో ఆరబెట్టి విత్తనం తీయాలి. హెక్టారుకు క్యారెట్ విత్తన పంట దిగుబడి 450-500 కిలోలు. టర్నిప్‌లో గోధుమ ఎరుపులోకి మారినప్పుడు కాయ కోత చేపట్టాలి. ఆ తర్వాత విత్తనాలు తీయాలి. విత్తన దిగుబడి హెక్టారుకు 500-600 కిలోలు.



#### విత్తనోత్పత్తికి అనుకూల వాతావరణం

**క్యారెట్‌లో:** క్యారెట్ చలి కాలపు పంట. అయితే ఆసియాటిక్ రకాల్లో 7.2 నుంచి 23.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత విత్తనం మొలకెత్తడానికి ఉపయోగపడుతుంది. మైదాన ప్రాంతాలు, ఉష్ణమండల ప్రాంతాల్లో వీటి విత్తనోత్పత్తి తేలిక. వేసవిలో తక్కువ వర్షపాతమున్న ప్రాంతాలు మేలైనవే. యూరోపియన్ రకాలకు 4.8-10 డిగ్రీల ఉష్ణోగ్రత 4-6 వారాల పాటు వేరు అభివృద్ధి సమయంలో, క్షేత్రంలో అవసరం. పూలగుత్తులు ఏర్పడటానికి 12-21 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం. 28 డిగ్రీల సెల్సియస్‌లో పూలు ఏర్పడవు. కేవలం కొండ ప్రాంతాల్లో, బాగా చలి ఉండే ప్రదేశాల్లో వీటి విత్తనోత్పత్తి చేపట్టాలి.

**ముల్లంగిలో:** శాఖీయ ఉత్పత్తికి వేరు అభివృద్ధికి చల్లని వాతావరణం అవసరం. ప్రధానంగా సాగులో ఉన్న రకాల్లో ఆసియా రకాలు ఎక్కువ వేడిని తట్టుకుంటాయి. అందుబాటులో ఉన్న మూడు రకాల్లో-జపనీస్ లేదా వింటర్ ముల్లంగి చల్లని కొండ ప్రాంతాల్లో మాత్రమే విత్తనాలను ఇస్తుంది. పూతకు చల్లని వాతావరణం అవసరం. రెండోది వైట్ అయిస్ కూల్. రాపిడ్ రెడ్ వైట్ రకాలు చల్లని వాతావరణంలో వస్తాయి. అయితే వేరు అభివృద్ధి చాలా ఎక్కువగా ఉంటుంది. మూడవ రకం-మైదాన ప్రాంతాల్లో విత్తనోత్పత్తి మేలుగా ఉంటుంది. కొండ ప్రాంతాల్లో సైతం విత్తనోత్పత్తి సాధ్యమే. తక్కువ ఉష్ణోగ్రత పూతకు అత్యంత కీలకం. జపనీస్ రకాల్లో పూల అభివృద్ధికి 25-30 రోజుల పాటు తక్కువ ఉష్ణోగ్రత ఉండాలి. గింజలు ఏర్పడే దశ త్వరగా ఉంటుంది. ఎక్కువ గింజల ఉత్పత్తి సాధ్యం. 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉంటే పుప్పొడి రేణువులు మొలకెత్తవు. కీలాగ్రం ఎండిపోతుంది. కాబట్టి నాణ్యమైన విత్తనోత్పత్తికి ఎక్కువ గాలిలో తేమ, చల్లని వాతావరణం అవసరం.

**డాక్టర్ పిడిగెం సైదయ్య**
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322



## మిద్దె తోట సాగు సూచనలు

కాంక్రీట్ జంగిల్‌లుగా మారుతున్న నగరాలు, పట్టణాల్లో అటు పచ్చదనానికి, ఆరోగ్యాన్ని పెంచే అద్భుత వ్యాపకంగా మిద్దె తోటలు ఉన్నాయి. తాజా కూరగాయలు పండించటంతోపాటు రసాయనాలు లేని ఆహారం సొంతంగా తయారుచేసుకొనే ఈ తరహా తోటలు పెంచుకోవటానికి పలువురు పట్టణవాసులు ఆసక్తి చూపుతున్నారు. నెమ్మదిగా ఈ పద్ధతి జిల్లా కేంద్రాలు, పురపాలక, మండల కేంద్రాలకు కూడా వ్యాపించటం సంతోషించదగ్గ విషయం. మిద్దె తోటలు ఏర్పాటు చేసుకోవాలనుకొనేవారికి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పిడిగం సైదయ్య అందిస్తున్న వివరాలు..



### ఎలాంటి గృహాలు మిద్దె తోటల సాగుకు అనుకూలం?

పక్కా ఇల్లు అయి ఉండి దృఢంగా ఉండాలి. భీమ్‌పైన మట్టి తొట్లు పెడితే వాటి బరువును తట్టుకొని నిలబడేలా ఉండాలి. భవనంపై సూర్యరశ్మి పుష్కలంగా ఉండాలి. తోటలు పెంచుకోవటానికి మిగతా అన్ని వనరులు అందుబాటులో ఉన్నా సూర్యరశ్మి అందకపోతే పంటలు మందకొడిగా ఎదుగుతాయి. పురుగులు, తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తాయి. ఎక్కువకాలం శాఖీయ దశలోనే ఉండిపోతాయి. ముఖ్యంగా పండ్లతోటలు, పండ్లు, కాయలనిచ్చే కూరగాయల పెంపకానికి సూర్యరశ్మి పుష్కలంగా అందాలి. కుండీలు, తొట్లు, మట్టితోకూడిన నిర్మాణాల నుంచి వచ్చే మురుగునీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేందుకు అనువుగా ఉండాలి. ప్రధాన రహదారులు, ఫ్యాక్టరీలకు దగ్గరగా ఉన్న గృహాలపై ప్రదేశంలో దుమ్ము ఎక్కువగా పడుతుంది. దాంతో కిరణజన్యసంయోగ క్రియ తక్కువగా జరిగి మొక్కల పెరుగుదల తక్కువగా ఉంటుంది. అందువల్ల ఇలాంటి గృహాలపై తోటలను పెంచకపోవటం మేలు.

### రైతుబడికి ఆహ్వానం

రైతు పంట పొలాలే జీవితంగా వ్యవసాయంలో రేయింబవళ్లు పనిచేస్తాడు. తమవైన అనుభవాలు, గుణపాఠాలతో మెరుగైన, మేలైన పంట విధానాలకు జీవం పోస్తాడు. ఇలాంటి అనుభవాలు పదిమందితో పంచుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుంది. కాబట్టి రైతులు తమవైన అనుభవాలు, గుణపాఠాలతో పాటు, తమ సృజనాత్మక పనిలో భాగంగా కొత్తగా ఆవిష్కరించిన పనిముట్ల గురించి రైతుబడికి రాసి పంపించగలరు.

రచనలు పంపవలసిన చిరునామా:
**8-2-603/1/7,8,9, కృష్ణాపురం,
రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.**
raithubadi@ntdaily.news, Fax-040-23291118

---

## వివిధ తోటల్లో వృద్ధి నియంత్రకాలతో దిగుబడి పెరుగుదల



పంటల పెరుగుదల, దిగుబడులలో వాటిలో సహజంగా ఉండే వృద్ధి నియంత్రకాలది ప్రధాన పాత్ర. కృత్రిమంగా తయారుచేసిన వృద్ధి నియంత్రకాల రాకతో వాటి వాడకం పెరిగింది. వాణిజ్య పంటలలో వీటి వాడకం వల్ల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. వృద్ధి నియంత్రకాలలో 'ఆక్సిన్'లు పూత శాతాన్ని, పండ్లు, గింజలు నిండటానికి ఉపయోగపడుతాయి. పూలు, మొగ్గలు, పిందెలు రాలకుండా ఉపయోగపడుతాయి. పండ్ల పరిమాణం, నాణ్యత పెరుగుదలలోనూ ఉపయోగపడుతాయి. అఫ్తా నాఫ్తైల్ అసిటిక్ అమ్లం కృత్రిమంగా ఎక్కువగా వాడబడుతున్న వృద్ధి నియంత్రకం. పంట మొక్కలలో సహజంగా వృద్ధి అయ్యే 'ఎథిలీన్' వాయువును మందగింఊప జేసి 'అబ్‌సిసిన్' లేయర్ అభివృద్ధి చెందకుండా చేస్తుంది. తద్వారా మొగ్గలు, పూలు, పిందెలు చెట్ల నుంచి రాలిపోకుండా ఉంటాయి.

**వాడే విధానం:** సాధారణంగా పంటలలో ఎన్‌ఎఎ వాడకాన్ని పీపీఎంల సిఫార్సు చేస్తారు. సాధారణంగా 10 పీపీఎం, 10 పీపీఎంలలో సిఫార్సు చేయబడుతుంది. 4.5 లీటర్ల నీటిలో ఒక మి.లీ. ఎన్‌ఏఏ (NAA) కలిపితే 10 పీపీఎం, 10 మి.లీ. కలిపితే 100 పీపీఎం ద్రావకరం తయారవుతుంది. దీనిని పొద్దుగాల లేదా సాయంత్రం పూట మాత్రమే పిచికారీ చేయాలి. వృద్ధి నియంత్రకాన్ని మాత్రమే పంటలపై పిచికారీ చేస్తే ఫలితాలు బాగుంటాయి.

| పంట | సిఫార్సు మోతాదు లీటరుకు |
|---|---|
| టమాటా | 45 పీపీఎం |
| మిరప | 10 పీపీఎం |
| మామిడి | పిందెలకు 20 పీపీఎం |
| | మాల్ ఫార్మేషన్ తగ్గించడానికి 200 పీపీఎం |
| ద్రాక్ష | ద్రాక్ష పరిమాణం పెరగడానికి 10 పీపీఎం |
| పైనాపిల్ | కాయ పరిమాణం పెంచడానికి 199 పీపీఎం |
| | పక్వతను పెంచడానికి 60 పీపీఎం |
| పత్తి | 10-20 పీపీఎం |

#### వివిధ పంటలలో NAA వాడకం

మిరప: పూత సమయంలో మొదటిసారి పిచికారీ చేయాలి. 20-30 రోజుల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి.
**టమాటా:** పూతకు వచ్చే ముందు ఒకసారి, పూత వచ్చిన తర్వాత మరోసారి పిచికారీ చేయాలి.
**మామిడి:** మామిడి పిందెలు బఠాని పరిమాణంలో ఉన్నప్పుడు ఒకసారి పిచికారీ చేయాలి. 'మాల్ ఫార్మేషన్' సమస్య ఉన్నప్పుడు పూతకు మూడు నెలల ముందు ఒకసారి, పిందె ఎదిగే దశలో మరోసారి పిచికారీ చేయాలి.
**ద్రాక్ష:** మొదటి పిచికారీ కత్తిరింపులప్పుడు; పూత మొదలయ్యే దశలో రెండోసారి పిచికారీ చేయాలి. ద్రాక్ష పండ్లు రాలకుండా ఉండేందుకు, గుత్తులు కోతకు 10-15 రోజుల ముందు ముదిరిన గుత్తులపై పిచికారీ చేయాలి.
**పైనాపిల్:** పూత దశకు ముందు ఒకసారి పిచికారీ చేయాలి. మొత్తం పండును ద్రావణంలో ఒక సెకను పాటు ముంచాలి. కోతకు రెండువారాల ముందు మరోసారి పిచికారీ చేయాలి. పూతకు -10 పీపీఎం.
**పత్తి:** పూత సమయం నుంచి 15 రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారీ చేయాలి.

**డాక్టర్ అమరపల్లి గీత**
అసిస్టెంట్ ప్రొఫెసర్
వ్యవసాయ కళాశాల,
పాలెం



## పాలకూర సాగు సులభం లాభాలు అధికం

**ఆరోగ్యానికి ఆకుకూరలు మంచివి అంటారు నిపుణులు. అయితే ఆకుకూరల్లోని పాలకూరలో మంచి పోషక విలువలు ఉంటాయి. దీంతో ఈ ఆకు కూరకు అధిక ప్రాధాన్యం ఉన్నది. దీని సాగుకు నీరు తక్కువగా అవసరం. దీంతోపాటు సులభ పద్ధతిలో సాగు చేసుకునే అవకాశం ఉన్నది. అంతే కాదు మార్కెట్‌లో కూడా ఈ ఆకు కూరకు మంచి గిరాకీ ఉన్నది. అందుకే రైతులు ఈ సాగు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చునని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పాలకూర సాగు గురించి వారు తెలిపిన వివరాలు..**



సాధారణంగా పాలకూరను సారవంతమైన మురుగునీరు పోయే నేలలు అనుకూలం. చౌడునేలల్లోనూ పాలకూరను పండించవచ్చు. సాధారణంగా మన ప్రాంతంలో దీనిని అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పండించవచ్చు.

**నాటుకునే విధానం:** ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం. విత్తనాలను 20X10 సెంటీమీటర్ల దూరంలోను, 3-4 సెంటీమీటర్ల లోతులో నాటుకోవాలి. ఇలా విత్తుకున్న విత్తనాలు 8-10 రోజులలో మొలకెత్తుతాయి.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరాకు 6-8 టన్నుల మాగిన పశువుల ఎరువు లేదా 1.5 టన్నుల వానపాముల ఎరువు, 4 కిలోల అజోస్పైరిల్లమ్, 4 కిలోల ఫాస్ఫో బాక్టీరియంలు వేయాలి.

**రసాయన ఎరువులు:** ఎకరాకు 10 కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌లను వాడాలి. ప్రతి కోత తర్వాత 10 కిలోల నత్రజని వేయాలి.

**నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే నీటి తడి ఇవ్వాలి. భూమిలో తేమను బట్టి ప్రతి 7-10 రోజులకు ఒక్కసారి నీటి తడి ఇవ్వాలి. తుంపర పద్ధతిలో నీటిని అందిస్తే నీటిని పొదుపు చేయడంతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో పంటను సాగు చేయవచ్చు.

**సస్యరక్షణ:** ఆకుకూరలకు తక్కువ సాంద్రత గల పురుగు మందులను మాత్రమే వాడాలి. పేనుబంక, ఆకులు తినే గొంగళి పురుగుల నివారణకు లీటరు నీటికి 2 మి.లీ.ల మలాథిన్ కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును కలిపి పిచికారీ చేయాలి. మందును పిచికారీ చేసిన తర్వాత పదిరోజుల సమయం గడిచిన తర్వాతే ఆకులు కోయాలి.

**ఆకుల కోత:** విత్తిన 3-4 వారాలకు మొదటి కోతకు వస్తుంది. తర్వాత 7-10 రోజులు వ్యవధిలో 4-6 కోతలు తీసుకోవచ్చు.
**దిగుబడి:** పాలకూరలో ప్రధానంగా ఆల్‌గ్రీన్, పూసాజ్యోతి, ఊటి నెంబర్-1 అనే రకాలు ఉన్నాయి. వీటిలో ఆల్‌గ్రీన్ అనే రకం ఎకరాకు ప్రతి 15 రోజులకు ఒకసారి కోత చొప్పున 6,7 కోతలలో 5 టన్నులు, పూసాజ్యోతి 6-8 కోతలలో 16-19 టన్నులు, ఊటి నెంబర్-1 రకం 4 కోతలలో 24 టన్నుల దిగుబడి వస్తుంది. దీంతో ఎకరా పాలకూర తోటలో రైతులకు అన్ని పెట్టుబడులు పోగా రూ. 3లక్షలకు పైనే ఆదాయం ఉంటుంది.

### మంచి లాభాలు



పాలకూరలో పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి దీనివల్ల మార్కెట్‌లో దీనికి మంచి డిమాండు ఉంటుంది. కాబట్టి రైతులు ఈ ఆకు కూరను సాగు చేసి మంచి లాభాలు పొందవచ్చు. ఈ పంట సాగు తేలిక. మంచి విత్తనాలను ఎంచుకున్న తర్వాత వాటిని సరైన పద్ధతులలో నాటు పెట్టి సకాలంలో నీటి తడులు అందించాలి. మోతాదు ప్రకారం ఎరువులు వేస్తూ.. అవసరానికి తగ్గట్టుగా మందులను వాడితే మంచి దిగుబడులు వస్తాయి.

-సీహెచ్.నరేష్, 9603268682
కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

**నట్టె కోటేశ్వర్‌రావు**, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా



**ఉగాండాలో సద్దుల బతుకమ్మ సంబురాలు**
ఉగాండా రాజధాని కంపాలలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఉగాండా ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఆడబిడ్డలు



తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో అమెరికాలోని అట్లాంటా సౌత్ ఫోర్సిత్ మిడిల్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న ప్రవాస తెలంగాణ మహిళలు, యువతులు. అనంతరం వారు దసరా సంబురాల్లో పాల్గొన్నారు.



తెలంగాణ ఎన్నారై ఆధ్వర్యంలో ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, యువతులు, చిన్నారులు



# నోబెల్ 'త్రయం'

- రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్ర విభాగాల్లోనూ ముగ్గురు చొప్పున విజేతలు
- లిథియం అయాన్ బ్యాటరీల సృష్టికర్తలకు రసాయన నోబెల్
- 'విశ్వం పుట్టుక.. వ్యాప్తి' అన్వేషణకు భౌతికశాస్త్ర పురస్కారం
- ప్రకటించిన నోబెల్ కమిటీ

**స్టాక్‌హోం, అక్టోబర్ 9:** ఈ ఏడాది నోబెల్ బహుమతుల్లో 'త్రయం' పరంపర కొనసాగుతున్నది. ఇప్పటికే వైద్యం విభాగంలో ముగ్గురికి సంయుక్తంగా నోబెల్ వరించగా.. మంగళ, బుధవారాల్లో ప్రకటించిన భౌతికశాస్త్ర, రసాయన శాస్త్ర నోబెల్ బహుమతులకు కూడా ముగ్గురు చొప్పున ఎంపిక చేయడం విశేషం. లిథియం అయాన్ బ్యాటరీల అభివృద్ధి పరిచిన అమెరికా, బ్రిటన్, జపాన్‌కు చెందిన శాస్త్రవేత్తల త్రయానికి బుధవారం రసాయన నోబెల్ ప్రకటించగా, కృష్ణ పదార్థం, విశ్వం పుట్టుకపై అన్వేషణ జరిపిన ముగ్గురు పరిశోధకులకు మంగళవారం భౌతిక శాస్త్ర పురస్కారం వరించింది. ఒక్కో విభాగ విజేతలకు సంయుక్తంగా రూ. 6,48,72,978 (914,000 డాలర్లు) నగదు బహుమతి ఇవ్వనున్నారు. విజేతలు ఈ పురస్కారాన్ని ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో కింగ్ కార్ల్-16 గుస్టాఫ్ చేతుల మీదుగా అందుకోనున్నారు.

## విశ్వంపై అవగాహన పెంచారు



జేమ్స్ పీబుల్స్, డిడియర్ క్వెలోజ్, మైఖేల్ మేయర్

ముగ్గురు ఖగోళ శాస్త్రవేత్తలు.. కెనడియన్-అమెరికన్ జేమ్స్ పీబుల్స్(84), స్వీడన్‌కు చెందిన మైఖేల్ మేయర్(77), డిడియర్ క్వెలోజ్(53)కు భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతి అందించనున్నట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్స్ మంగళవారం ప్రకటించింది. వారు విశ్వం పుట్టుక, వ్యాప్తిపై మన అవగాహనను పెంచారని అభినందించింది. నగదు బహుమతిలో సగం పీబుల్స్‌కు, మరో సగాన్ని మిగతా ఇద్దరికి అందిస్తామని తెలిపింది. బిగ్‌బ్యాంగ్ అనంతరం విశ్వం ఎలా వ్యాప్తిచెందిందో పీబుల్స్ మనకు వివరించారని, మన పాలపుంతలో సూర్యుడి వంటి మరో నక్షత్రం చుట్టూ తిరుగుతున్న సౌరకుటుంబేతర గ్రహాలను (ఎక్సోప్లానెట్స్) మొదటిసారిగా 1995లో మైఖేల్, క్వెలోజ్ గుర్తించారని నోబెల్ కమిటీ పేర్కొన్నది. వీరి పరిశోధనలు విశ్వంపై మనకున్న ఆలోచనలను, అవగాహన స్థాయిని పూర్తిగా మార్చివేశాయని కొనియాడింది. విశ్వంపుట్టుకకు కారణమైన 'బిగ్ బ్యాంగ్' అనంతర పరిస్థితులపై పీబ్లెస్ దీర్ఘకాలం పరిశోధనలు చేశారు. ఐన్‌స్టీన్ ఆలోచనలకు సిద్ధాంత రూపం ఇచ్చారు. బిగ్‌బ్యాంగ్ అనంతరం అంతరిక్షంలోకి వెలువడిన రేడియేషన్ ఉష్ణోగ్రత, అది సృష్టించిన పదార్థ పరిమాణం మధ్య సంబంధాన్ని గుర్తించారు. మొత్తం విశ్వంతో పోల్చితే మనకు తెలిసిన గ్రహాలు, నక్షత్రాలు వంటి పదార్థాల పరిమాణం కేవలం ఐదు శాతం మాత్రమేనని, మిగతాభాగం మనకు తెలియని కృష్ణ పదార్థం (డార్క్ మ్యాటర్), కృష్ణ శక్తితో (డార్క్ ఎనర్జీ) నిండి ఉన్నదని పీబ్లిస్ సిద్ధాంతీకరించారు. పీబుల్స్ ప్రస్తుతం అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో, మైఖేల్, క్వెలోజ్.. యూనివర్సిటీ ఆఫ్ జెనీవాలో పనిచేస్తున్నారు. వారిద్దరూ 1995 నుంచి దక్షిణ ఫ్రాన్స్‌లోని తమ అబ్జర్వేటరిలో పరిశోధనలు చేస్తున్నారు. సూర్యుడి నుంచి 50 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఒక నక్షత్రం చుట్టూ బృహస్పతి పరిమాణంలో ఉన్న ఒక గ్రహం తిరుగుతున్నదని, ఇది పూర్తిగా వాయువులతో నిండి ఉన్నదని వీరిద్దరూ గుర్తించారు. దీనిని '51 పెగసస్ బీ' అని పిలుస్తున్నారు. వీరి పరిశోధన ఖగోళ శాస్త్రంలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టిందని నోబెల్ కమిటీ ప్రశంసించింది. వీరి స్ఫూర్తితో ఇప్పటివరకు శాస్త్రవేత్తలు మన నక్షత్ర మండలంలో నాలుగువేలకు పైగా సౌరకుటుంబేతర గ్రహాలను గుర్తించారని కొనియాడింది. ఇది ఇంకా కొనసాగుతున్నదని పేర్కొన్నది.

## జీవనశైలినే మార్చేశారు



అకిరా యోషినో, స్టాన్లీ విట్టింగమ్, జాన్ గుడ్‌ఎనఫ్,

లిథియం అయాన్ బ్యాటరీలను అభివృద్ధి పరిచి స్మార్ట్‌ఫోన్ విప్లవానికి నాంది పలుకడంతోపాటు, శిలాజ ఇంధన వినియోగ రహిత సమాజం దిశగా బాటలు వేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్స్ బుధవారం 'రసాయనశాస్త్ర నోబెల్' బహుమతిని ప్రకటించింది. అమెరికాకు చెందిన జాన్ గుడ్‌ఎనఫ్ (97), బ్రిటన్‌కు చెందిన స్టాన్లీ విట్టింగమ్(77), జపాన్‌కు చెందిన అకిరా యోషినో(71) సంయుక్తంగా ఈ బహుమతిని అందుకోనున్నారు. వీరిలో జాన్ గుడ్‌ఎనఫ్.. నోబెల్‌ను అందుకోనున్న అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు సాధించనున్నారు. 'తేలికైన, శక్తివంతమైన, రీచార్జ్ చేసుకోగలిగే లిథియం అయాన్ బ్యాటరీలను ఇప్పుడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, విద్యుత్ వాహనాలు వంటివాటిలో విరివిగా వినియోగిస్తున్నాం. అంతేకాదు.. సౌర, పవనశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చి వీటిల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పించింది. తద్వారా శిలాజ ఇంధన వినియోగం లేని సమాజానికి బాటలు పడ్డాయి' అని కమిటీ పేర్కొన్నది. లిథియం అయాన్ బ్యాటరీలు 1991లో మార్కెట్‌లోకి వచ్చాయని, అవి మన జీవనశైలిని మార్చేశాయని పేర్కొన్నది. వీటిని అభివృద్ధి పరుచడం ద్వారా ముగ్గురు శాస్త్రవేత్తలు మానవజాతికి అత్యంత మేలు చేశారని ప్రశంసించింది. 1970ల్లో ప్రపంచం తీవ్ర విద్యుత్ కొరతతో అల్లాడుతున్న సమయంలో బ్రిటన్ శాస్త్రవేత్త విట్టింగమ్ ప్రత్యామ్నాయ విధానాలపై పరిశోధనలు చేశారు. 'లిథియం' అనే లోహంలో శక్తిని నిల్వ చేసుకోవచ్చని గుర్తించారు. తర్వాత లిథియంతో బ్యాటరీ వంటి దానిని రూపొందించారు. ఎలక్ట్రాన్ల ద్వారా శక్తిని బదిలీ చేయడాన్ని గుర్తించారు. అయితే శక్తి ప్రవాహం అస్థిరంగా ఉండేది. ఆ తర్వాత అమెరికా శాస్త్రవేత్త గుడ్‌ఎనఫ్.. విట్టింగమ్ నమూనాపై పరిశోధనలు చేసి, దానికి ప్రత్యేకమైన మిశ్రమాన్ని కలిపి నాలుగు వోల్టుల విద్యుత్‌ను నిలువ చేయగలిగేలా అభివృద్ధి చేశారు. ఇది ఆధునిక బ్యాటరీల ఆవిష్కరణకు బాటలు వేసింది. 1985లో జపాన్‌కు చెందిన యోషినో ఈ బ్యాటరీల్లో లిథియం అయాన్లను నిల్వ చేయగలిగే కార్బన్‌తో తయారైన లోహాన్ని అమర్చి విజయం సాధించారు. ఫలితంగా బ్యాటరీలు మార్కెట్‌లోకి వచ్చాయి. ముగ్గురి పరిశోధనల వల్ల తేలికైన, శక్తివంతమైన, రీచార్జ్ చేసుకోగలిగే లిథియం అయాన్ బ్యాటరీలు అందుబాటులోకి వచ్చాయి. యోషినో ప్రస్తుతం జపాన్ రాజధాని టోక్యోలోని అసాహి కసెయ్ కార్పొరేషన్‌లో, నగోయాలోని మెయిజో యూనివర్సిటీలో పనిచేస్తున్నారు. గుడ్‌ఎనఫ్ ప్రస్తుతం అమెరికాలోని ఆస్టిన్‌లో ఉన్న టెక్సాస్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విభాగాధిపతిగా కొనసాగుతున్నారు. విట్టింగమ్.. బింగ్‌హామ్టన్ యూనివర్సిటీ, న్యూయార్క్ యూనివర్సిటీల్లో పనిచేస్తున్నారు. వీరు స్వీడన్‌లో డిసెంబర్ 10వ తేదీన నోబెల్ బహుమతులను అందుకోనున్నారు

## శాంతి పురస్కారం.. గ్రెటాకేనా?



గ్రెటా థన్‌బర్గ్

ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి ఎవరిని వరిస్తుందనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఈ ఏడాది వచ్చిన నామినేషన్లలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 301 మంది వ్యక్తులు, సంస్థల పేర్లు ఉన్నాయి. అయితే వీరిలో తుది జాబితాలో ఎవరు ఉన్నారనే విషయాన్ని నోబెల్ కమిటీ బహిర్గతం చేయదు. ప్రస్తుత పరిస్థితులు మాత్రం పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్‌కు అనుకూలంగా ఉండగా, నిపుణులు మాత్రం ఇతరులకు ఓటేస్తున్నారు. స్వీడన్‌కు చెందిన 16 ఏండ్ల గ్రెటా ప్రపంచవ్యాప్తంగా సుపరిచితురాలు. పర్యావరణ మార్పులపై స్వీడన్ పార్లమెంట్ నిరసన తెలుపడం ద్వారా ఆమె తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఒంటరిగా మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. కోట్లాది మంది ఆమెకు మద్దతునిస్తున్నారు. అనేక అంతర్జాతీయ వేదికలపై గ్రెటా ప్రసంగించింది. ఇటీవల ఐక్యరాజ్యసమితిలో 'హౌ డేర్ యూ?' అంటూ ప్రపంచ దేశాల అధినేతలను నిలదీసింది. ఆమెను ఇప్పటికే పలు అవార్డులు, రివార్డులు వరించాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, ప్రత్యామ్నాయ నోబెల్‌గా పిలిచే.. ద రైట్ లైవ్లీహుడ్ అవార్డ్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై విపరీతమైన చర్చ జరుగుతున్నదని, ఈ నేపథ్యంలో గ్రెటాకే నోబెల్ శాంతి బహుమతి వరించే అవకాశం ఉన్నదని అధికశాతం మంది భావిస్తున్నారు. అయితే నిపుణులు మాత్రం.. గ్రెటా చేసిన కృషి అద్భుతమని ప్రశంసిస్తూనే, ఆమె వయసు దృష్ట్యా ఇప్పుడే నోబెల్ ఇవ్వడం సరికాదని పేర్కొంటున్నారు. మిగతా రంగాల్లో కృషి చేసినవారిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అంటున్నారు. కొందరు ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ పేరును సూచిస్తున్నారు. నిత్యం ఘర్షణలు, అంతర్యుద్ధంతో రావణకాష్టంలా మండుతున్న ఇథియోపియాలో, ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలో అబే అహ్మద్ మార్పు తీసుకొచ్చారని, ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా శాంతి నెలకొన్నదని చెప్పారు. మరికొందరు విశ్లేషకులు ఐదుగురు సభ్యుల అంతర్జాతీయ కమిటీ, రిపోర్టర్స్ విత్‌ఔట్ బార్డర్స్ (ఆరెస్సెఫ్), కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే), యూఎన్‌హెచ్‌సీఆర్ వంటి పేర్లను సూచిస్తున్నారు.

## రేపు జిన్‌పింగ్ రాక

- రెండ్రోజులపాటు భారత్ పర్యటన
- ప్రధాని మోదీతో సమావేశం కానున్న చైనా అధ్యక్షుడు



జిన్‌పింగ్

**బీజింగ్, అక్టోబర్ 9:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శుక్ర, శనివారాల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, సమకాలీన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వీరు చర్చించనున్నారు. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హువా చున్యింగ్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 'మా దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ రెండు రోజులపాటు (11,12 తేదీల్లో) భారత్‌లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా చెన్నై సమీపంలోని మామల్లాపురం ప్రాంతంలో భారత ప్రధాని మోదీతో సమావేశమవుతారు. పర్యటన అనంతరం 13వ తేదీన నేపాల్‌కు వెళ్తారు' అని తెలిపారు. భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ మధ్య జరుగనున్న భేటీ వారిద్దరి మధ్య జరిగే రెండో అనధికార సమావేశమని, ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చించనున్నారని పేర్కొంది. కాగా మోదీ, జిన్‌పింగ్ మధ్య తొలి అనధికార సమావేశం గతేడాది జరిగింది. అప్పట్లో డోక్లాం సమస్య ఇరుదేశాల మధ్య తీవ్రంగా ఉన్నప్పుడు వీరిద్దరు చైనాలోని హుహన్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం డోక్లాం సమస్య పరిష్కారమైంది. ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ మంగళవారం ఆ దేశ ప్రధాని లీ కిక్యాంగ్‌తో సమావేశమయ్యారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం.. దానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ మద్దతు కూడగట్టడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఇమ్రాన్‌ఖాన్ చైనా పర్యటనలో ఉండటం.. ఇదే సమయంలో మోదీ, జిన్‌పింగ్ భేటీకి సన్నాహాలు మొదలుకావటం ప్రాధాన్యం సంతరించుకున్నది.

## ఎల్వోసీ వెంట ఉగ్ర శిబిరాలు

మళ్లీ ప్రారంభించిన పాకిస్థాన్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట పాకిస్థాన్ కనీసం 20 ఉగ్రవాద శిక్షణ శిబిరాలను, మరో 20 ల్యాంచ్‌ప్యాడ్ (చొరబాట్లకు సహకరించే కేంద్రం)లను మళ్లీ ప్రారంభించిందని అధికారులు తెలిపారు. ఒక్కో ఉగ్రవాద శిబిరం, ఒక్కో చొరబాటు కేంద్రంలో కనీసం 50 మంది ఉగ్రవాదులు ఉన్నారని పేర్కొన్నారు. గత ఫిబ్రవరిలో పుల్వామాలో సీఆర్పీఎఫ్ బస్సుపై ఉగ్ర దాడి అనంతరం భారత వాయుసేన పాక్‌లోని బాలాకోట్ ఉగ్ర శిబిరంపై ప్రతీకార దాడి చేసిన నేపథ్యంలో సరిహద్దు వెంట ఉన్న పలు ఉగ్రవాద క్యాంప్‌లు, చొరబాటు కేంద్రాలు మూతపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం ఆగస్టులో జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదానిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని విభజించిన నేపథ్యంలో పాకిస్థాన్ సంస్థలు భారత్‌లో ఉగ్రదాడులకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. గత రెండు నెలల కాలంలో ఉగ్రవాదులకు భారీ దాడులు చేసే అవకాశాన్ని భద్రతా దళాలు ఇవ్వకపోవడంతో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఉగ్రవాదులను భారత భూభాగంలోకి పంపేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నట్టు నిఘా వర్గాలు తెలిపాయి. భద్రతా దళాలు సదా అప్రమత్తంగా ఉంటూ నిఘాను ముమ్మరంగా కొనసాగిస్తున్నప్పటికీ గత కొన్ని వారాలలో భారీ సంఖ్యలో ఉగ్రవాదులు కశ్మీర్‌లోకి చొరబడినట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. జమ్ముకశ్మీర్‌లో 200 నుంచి 300 వరకు ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నట్టు ఆ రాష్ట్ర డీజీపీ దిల్బాగ్ సింగ్ తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ సరిహద్దులో పాకిస్థాన్ ఉద్ధృతంగా జరుపుతున్న కాల్పుల చాటున ఉగ్రవాదులు దేశంలోకి చొరబడినట్టు ఆయన పేర్కొన్నారు. శీతాకాలం ప్రారంభానికి ముందే మరింత మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు.



కుమ్రం భీం సమాధికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సక్కు, ఆదివాసీ నాయకులు

## కుమ్రంభీం వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

**కెరమెరి:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో కుమ్రంభీం 79వ వర్ధంతి ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎస్పీ మల్లారెడ్డి బుధవారం పరిశీలించారు. 13న వర్ధంతి నిర్వహిస్తున్న సందర్భంగా కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. సభను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. అంతకుముందు భీం సమాధి వద్ద పూజ నిర్వహించి, నివాళులర్పించారు. మ్యూజియాన్ని సందర్శించి, పనులను పరిశీలించారు. ప్రజాదర్బార్ నిర్వహణ స్థలంతో పాటు భోజనశాల, వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వర్ధంతి సభకు తరలివచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సత్యనారాయణను ఎస్పీ ఆదేశించారు. వీఐపీలు వచ్చే అవకాశం ఉన్నందున హెలీప్యాడ్ ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పేందోర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటితో రైతుల్లో ఆనందం

- రైతు మంత్రిగా గర్వపడుతున్నా
- ఆర్టీసీలో సమ్మె విరమించాలి
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



వనపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సాగునీటి కాలువల పరవళ్లతో నేడు రైతుల కండ్లలో ఆనందం వెల్లివిరుస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాలుగు ప్రాజెక్టుల ద్వారా పారుతున్న కాల్వల ద్వారా చెరువులన్నీ అలుగు పారుతున్నాయని, రైతు మంత్రిగా గర్వపడుతున్నానని తెలిపారు. జిల్లా కేంద్రంలోని నివాసంలో మంగళవారం విలేకరులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాడు ఉమ్మడి జిల్లాలో సేద్యం చేసుకునే పరిస్థితులు లేక రైతులు కన్నీటి పర్యంతమయ్యారని చెప్పారు. అదే జిల్లాలో నేడు ఎటుచూసినా చెరువులు అలుగు పారుతున్నాయని పేర్కొన్నారు. ఎంజీకేఎల్ఐతోపాటు భీమా-1,2, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టుల ద్వారా పుష్కలంగా సాగునీరందుతుందని తెలిపారు. సాగునీటి పరవళ్లతో ఎటుచూసినా నీరు-నారు అన్నట్టు సాగుబడులతో పచ్చనిపైర్లు దర్శనమిస్తున్నాయని, ఈ వాతావరణంలో రైతుల కండ్లలో ఆనందం కనిపిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి 11 లక్షల ఎకరాల్లో సేద్యం పనులు కొనసాగుతున్నాయని, ఏటికేడు సాగుబడులు పెరుగుతున్నాయని అన్నారు. రైతుబంధు, ఎరువులు, విత్తనాలు అందించడం వల్ల దేశంలోనే నంబర్-1గా తెలంగాణ నిలిచిందని చెప్పారు.

**చర్చలతోనే ఆర్టీసీ కార్మికులకు మేలు**

ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించాలని మంత్రి నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. సంస్థ బాగోగులపై కార్మికులు కూడా సొంతంగా ఆలోచించాలని కోరారు. చర్చల ద్వారా కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, సంఘాల నాయకులు పట్టించుకోలేదని ఆరోపించాచరు. కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం ఓ కమిటీ వేసిందని, చర్చల ద్వారానే కార్మికులకు మేలుజరిగే అవకాశం ఉన్నదని చెప్పారు. ఇప్పటికైనా కార్మికులు కొందరు నాయకుల తీరుకు బలికావద్దని, సొంతంగా ఆలోచించి సమ్మెను విరమించుకోవాలని సూచించారు. విపక్షాలకు అసలు ఓ విధానమే లేదని, సమ్మెకు మద్దతిచ్చిన కాంగ్రెస్, బీజేపీలు.. వారి పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో ఆర్టీసీని అక్కడి ప్రభుత్వంలో ఎందుకు విలీనం చేయలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా రాష్ట్రంలో పాలన సాగిస్తుంటే.. వారంతా దిక్కుమొక్కు లేనట్టుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి



సుధ (ఫైల్)

**ధర్మపురిరూరల్:** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దోనూర్‌లో బుధవారం అంకం సుధ(43) విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. సుధ భర్త చాలాకాలం క్రితమే చనిపోగా, అమ్మమ్మ గ్రామమైన దోనూర్‌లోనే ఇల్లు కట్టుకొని స్థిరపడింది. ఇంటిపక్కన ఉన్న కొంత ఖాళీ స్థలంలో మక్కలు సాగుచేసింది. బుధవారం సాయంత్రం పెరడిలో మక్కకంకి విరుస్తుండగా పైనుంచే వెళ్తున్న 33కేవీ విద్యుత్ వైర్ తీగ తెగి మీద పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సుధకు ఒక కూతురు ఉన్నారు. ఆమెకు నాలుగేండ్ల కిందట వివాహమైంది. సుధ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



## ఉరి వేసుకొని వీఆర్ఏ ఆత్మహత్య

**మద్నూర్:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని మొఘ గ్రామానికి చెందిన వీఆర్ఏ గంగారాం(42) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్సై వెంకట్రావు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి ముందు వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఏఎస్సై వెంకట్రావు పేర్కొన్నారు.

## నిన్న ఉల్లి.. నేడు టమాటా

ఢిల్లీలో కిలో టమాటా ధర రూ.80



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** ఉల్లిగడ్డల ధరలు ఇటీవల పెరిగి ఇప్పుడిప్పుడే తగ్గుతుండగా.. ప్రస్తుతం టమాటా ధరలు భగ్గుమంటున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం కిలో టమాటా ధర రూ.80 పలికింది. టమాటాలను పంపించే రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసి రవాణాకు తీవ్ర అంతరాయం కలుగడంతోనే ధరలు భగ్గుంటున్నాయి. ఢిల్లీలోని ప్రధాన మార్కెట్లలో హోల్‌సేల్ ధర రూ.58 పలుకుతుండగా.. రిటైల్ వ్యాపారులు మాత్రం టమాటా నాణ్యతను బట్టి రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. ఓ వ్యాపారస్థుడు మాట్లాడుతూ 'టమాటా పండే రాష్ట్రాల్లో వర్షాలు కురిసి వరదలు రావడంతో సరుకు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ధరలు గత నాలుగైదు రోజుల నుంచి భగ్గుమంటున్నాయి' అని తెలిపారు. వర్షాలకు పంట దెబ్బతినడం కూడా ధరలు పెరుగడానికి ఒక కారణమని చెప్పారు. మరోవైపు బుధవారం కోల్‌కతాలో కిలో టమాటా ధర రూ.60 పలుకగా, ముంబైలో రూ.54, చెన్నైలో రూ.40 ధర పలికింది.

## విషాహారం తిని 34 గొర్రెల మృత్యువాత

**మానవపాడు:** విషాహారం తిని 34 గొర్రెలు మృతిచెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలపరిధిలో జల్లాపురంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన గొర్ల కాపరులైన మద్దిలేటి, వెంకట్రాముడు, రాముడు, కృష్ణ, మహేశ్, ప్రమీలమ్మలకు చెందిన నాలుగు వందల గొర్రెల మందను మంగళవారం జాతీయరహదారి పక్కనున్న బీడు పొలంలో మేపడానికి వదిలారు. సాయంకాలం వరకు అదే పంటపొలంలో మేపారు. గొర్రెలు ఒక్కసారిగా మృతిచెందడం మొదలైంది. రాత్రివరకు 34 గొర్రెలు మరణించాయని బాధితులు తెలిపారు. బుధవారం వైద్యురాలు హరిక పోస్టుమార్టం నిర్వహించి విషాహారం తినడం వల్లే చనిపోయాయని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం బాధితులను పరామర్శించి ఆదుకుంటామని హామీఇచ్చారు.

## జమ్మిపూజకు వెళ్లి బాలుడు దుర్మరణం

**తిరుమలగిరి, నమస్తేతెలంగాణ:** దసరా పండుగకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన బాలుడు రోడ్డు ప్రమాదంలో గాయాలై మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం ఈదులపర్రె తండాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేటకు చెందిన మూడ జ్యోతికి తొమ్మిదో తరగతి చదువుతున్న కుమారుడు కిషోర్ ఉన్నాడు. దసరా పండుగకు కిషోర్‌తో కలిసి తల్లిగారి ఊరైన జనగాం జిల్లా కొడకండ్ల మండలం రాగ్యాతండాకు వచ్చింది. పక్కనే ఉన్న తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల పర్రెతండాలో జమ్మిపూజకు వెళ్లిన కిషోర్, కాలినడకన రాగ్యతండాకు వెళ్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం బాలుడిని ఢీకొట్టింది. తీవ్రగాయాలైన కిషోర్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. జ్యోతికి భర్త, కుమార్తె ఉన్నారు. పండుగ పూట బాలుడు మృతిచెందడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పండుగపూట విషాదం

వాగులో పడి ఒకరి మృతి

**బయ్యారం:** దసరా పండుగరోజు విషాదం నెలకొంది. ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరు మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. బయ్యారం మండల పరిధి కాచనపల్లి గ్రామానికి చెందిన ఎల్లంకి శ్రీనివాస్ (44) అదే మండలంలోని చెరువుముందు కొత్తగూడెంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం వ్యక్తిగత పనినిమిత్తం సొంత గ్రామమైన కాచపపల్లికి వెళ్లి వస్తున్నక్రమంలో పందిపంపుల వాగుపై ఏర్పాటు చేసిన కర్రల వెంతెన దాటుతుండగా ప్రమాదవశాత్తు పడ్డాడు. బుధవారం శ్రీను మృతదేహం వాగులో తెలియాడుతుండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
గురువారం 10 అక్టోబర్ 2019


'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో మహేష్‌బాబు

విజయదశమి పర్వదినాన్ని సకలశుభాలకు ప్రత్యేకతగా భావిస్తారు. దసరా రోజున తలపెట్టిన ఏ పనైనా నిర్విఘ్నంగా ఫలప్రదమవుతుందని ప్రగాఢంగా విశ్వసిస్తుంటారు.దసరా సెంటిమెంట్‌కు చిత్రసీమలో ఎనలేని ప్రాముఖ్యత ఉన్నది. సరదాలు, విజయాలు, ఉద్వేగానికి చిరునామాగా నిలిచే విజయదశమి రోజున తమ సినిమా విశేషాల ద్వారా పండగ సంబురాన్ని ప్రేక్షకులతో పంచుకొంటుంటారు సినీ వర్గాలు. కొత్త సినిమాల ప్రారంభోత్సవాలు, హీరోల నయాలుక్‌లు, సినిమాల ప్రకటనలతో ఈ దసరా సినీ అభిమానుల్లో ఆనందోత్సాహాల్ని నింపింది. విజయదశమి రోజున మహేష్‌బాబు, అల్లు అర్జున్ తమ కొత్త లుక్‌లతో ఆకట్టుకోగా..చిరంజీవి, నితిన్, సాయితేజ్ తమ సినిమాల్ని ప్రారంభించారు..

# పండగ వేళ ఆనంద హేల


నరసింహా, దిల్‌రాజు, వినాయక్, శిరీష్

దసరా క్లాప్స్

### సీనయ్య మొదలైంది

దర్శకుడు వి.వి.వినాయక్ హీరోగా పరిచయమవుతున్న 'సీనయ్య' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. నరసింహా దర్శకుడు. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు క్లాప్‌నివ్వగా, కొరటాల శివ కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ '1982-84 బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ ఇది. సీనయ్య అనే వ్యక్తి జీవితగమనానికి చక్కటి దృశ్యరూపంగా ఉంటుంది. భావోద్వేగ ప్రధానంగా సాగే ఈ కథకు సరిపోయే హీరో ఎవరైతే బాగుంటుందని ఆలోచిస్తున్న సమయంలో వినాయక్ గుర్తొచ్చాడు. ఆయన కథ విని సినిమా చేస్తున్నానని చెప్పాడు. వినాయక్ ఫస్ట్‌లుక్ అందరూ బాగుందంటున్నారు' అని చెప్పారు. సీనయ్య పాత్ర ప్రధానంగా సాగే కథ ఇదని, ఈ క్యారెక్టర్ కోసం తాను బరువు తగ్గానని వినాయక్ పేర్కొన్నారు. వినాయక్ పుట్టినరోజున సినిమా ప్రారంభించడం ఆనందంగా ఉందని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టి వేసవిలో సినిమాను విడుదలచేస్తామని దర్శకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, అనిల్‌రావిపూడి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: సాయిశ్రీరామ్.

### కొండారెడ్డి సెంటర్‌లో..

కొండారెడ్డి బురుజు సెంటర్‌సాక్షిగా తన తెగువను చూపించబోతున్నారు మహేష్‌బాబు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. దిల్‌రాజు సమర్పణలో రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. దసరా సందర్భంగా కొండారెడ్డి బురుజు ముందు మహేష్‌బాబు గొడ్డలి పట్టుకొని నిల్చొన్న కొత్త లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఈ పోస్టర్‌లో మాస్, క్లాస్ కోణంలో నవ్య పంథాలో మహేష్‌బాబు కనిపిస్తున్నారు. 'ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. నవంబరు నెలాఖరు వరకు తమిళనాడు, కేరళలో జరిగే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. సంక్రాంతికి సినిమాను విడుదలచేస్తాం' అని చిత్రబృందం తెలిపింది. విజయశాంతి, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్, సంగీత, బండ్ల గణేష్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్.

దసరా లుక్స్


పాయల్, వెంకటేష్, నాగచైతన్య, రాశీఖన్నా

### భాగ్యనగరంలో మామాఅల్లుళ్లు..

నచ్చిన నెచ్చెలుల తోడుగా ప్రేమయాత్రకు బయలుదేరారు మామాఅల్లుళ్లు. వెంకటేష్, నాగచైతన్య కథానాయకులుగా నటిస్తున్న చిత్రం 'వెంకీ మామ'. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకుడు. సురేష్ ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాశీఖన్నా, పాయల్ రాజ్‌పుత్ కథానాయికలు. దసరా రోజున చిత్ర టీజర్‌తో పాటు కొత్త లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ట్రాక్టర్ డ్రైవింగ్ సీట్‌లో కూర్చొని వెంకటేష్ చిరునవ్వులు చిందిస్తుండగా ఆయన వెనుక నాగచైతన్య నిల్చున్నారు. వారికి ఇరుపక్కలా రాశీఖన్నా, పాయల్ రాజ్‌పుత్ కనిపిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీసెట్‌లో వెంకటేష్, నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణంపై పాటను చిత్రీకరిస్తున్నామని చిత్రబృందం తెలిపింది.


అల్లు అర్జున్

### బన్నీ యాక్షన్..

అల్లు అర్జున్ యాక్షన్ అవతారమెత్తారు. వస్త్రాన్నే తన ఆయుధంగా మలుచుకొని శత్రుసంహారం చేస్తున్నారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అల వైకుంఠపురములో'. పూజా హెగ్డే కథానాయిక. అల్లు అరవింద్, ఎస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయదశమిని పురస్కరించుకొని అల్లు అర్జున్ కొత్త లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. యాక్షన్ లుక్‌లో స్టైలిష్‌గా కనిపిస్తున్న బన్నీ తాజా లుక్ అభిమానులను ఆకట్టుకుంటున్నది. నిర్మాతలు మాట్లాడుతూ 'త్రివిక్రమ్ శైలి హంగులతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రమిది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుతున్నాం.సంక్రాంతి కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.


షాలిని పాండే, రాజ్‌తరుణ్

### ఇద్దరి లోకం ఒకటే..

రాజ్‌తరుణ్, షాలినిపాండే జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. దిల్‌రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీఆర్ కృష్ణ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విజయదశమి సందర్భంగా చిత్రబృందం విడుదలచేసింది. ఈ పోస్టర్‌లో షాలినీ పాండే బైక్ నడుపుతుండగా వెనక కూర్చున్న రాజ్‌తరుణ్ ఆమె చూస్తూ మైమరచిపోతున్నారు. నవ్యమైన ప్రేమకథతో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. '90 శాతం షూటింగ్ పూర్తయింది. అన్ని కార్యక్రమాల్ని పూర్తిచేసి నవంబర్ రెండో వారంలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్రబృందం తెలిపింది.


కీర్తిసురేష్, నితిన్‌లపై క్లాప్‌నిస్తున్న త్రివిక్రమ్

### ప్రేమ కథతో 'రంగ్ దే'

నితిన్, కీర్తిసురేష్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'రంగ్ దే' దసరా రోజున మొదలైంది. వెంకీ అట్లూరి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు త్రివిక్రమ్ క్లాప్‌నివ్వగా..నిర్మాతలు దిల్‌రాజు, ఎస్.రాధాకృష్ణ దర్శకుడికి స్క్రిప్ట్‌ను అందజేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'కుటుంబ విలువలతో ముడిపడిన ప్రేమకథా చిత్రమిది. ఏకధాటిగా చిత్రీకరణ జరుపుతాం. 2020 వేసవిలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: పీసీ శ్రీరామ్, సంగీతం: దేవిశ్రీప్రసాద్.


చిరంజీవి, రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి, కొరటాల శివ

### కొరటాల శివ దర్శకత్వంలో..

'సైరా' తర్వాత కమర్షియల్ బాట పట్టారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఆయన హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్ర పూజా కార్యక్రమాల్ని విజయదశమి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు.కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.


బీవీఎస్‌ఎన్ ప్రసాద్, సాయితేజ్

### సోలో బ్రతుకే సో బెటర్..

సాయితేజ్, నభానటేష్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'సోలో బ్రతుకే సో బెటర్'. సుబ్బు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్.ఎల్.పి పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. నిర్మాత మాట్లాడుతూ 'వినోదాత్మక కథాంశంతో తెరకెక్కుతున్న ప్రేమకథా చిత్రమిది. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేయనున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి ఆర్ట్: అవినాష్ కొల్ల, సంగీతం: ఎస్.ఎస్.తమన్, సినిమాటోగ్రఫీ: వెంకట్.సి.దిలీప్.

దసరా ప్రకటనలు

### పోలీస్ పాత్రలో శ్రీవిష్ణు


శ్రీవిష్ణు

శ్రీవిష్ణు కథానాయకుడిగా లక్ష్య ప్రొడక్షన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కనున్నది. ఎం.ఎల్.వి సత్యనారాయణ(సత్తిబాబు) ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రదీప్ వర్మ దర్శకుడు మాట్లాడుతూ 'పోలీస్ ఇతివృత్తంతో రూపొందనున్న డిఫరెంట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది. శ్రీవిష్ణు పోలీస్ అధికారిగా కనిపించబోతున్నారు. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. త్వరలో మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడిస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: శేఖర్ వి. జోసఫ్, ఆర్ట్: వివేక్

### కామెడీ థ్రిల్లర్ కథ..


ఆనంద్

'దొరసాని' చిత్రంలో సహజఅభినయంతో తొలి అడుగులోనే ప్రతిభను చాటుకున్నారు ఆనంద్ దేవరకొండ. ఆయన హీరోగా టాంగా ప్రొడక్షన్స్ ఎల్.ఎల్.పి(యూఎస్ఏ) పతాకంపై ఓ చిత్రం తెరకెక్కనున్నది. విజయ్ మట్టపల్లి, ప్రదీప్ ఎర్రబెల్లి నిర్మాతలు. దామోదర అట్టాడ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కామెడీ థ్రిల్లర్ అంశాలతో రూపొందుతున్న కాన్సెప్ట్ బేస్డ్ చిత్రమిది. ఆనంద్ దేవరకొండ పాత్రచిత్రణ, లుక్ వినూత్నంగా ఉంటాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్ని జరుపుతున్నాం. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. త్వరలో ఇతర నటీనటుల వివరాల్ని వెల్లడిస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మదన్ గుణదేవా, సంగీతం: అమిత్ దాసాని, సిద్ధార్థ్ సదాశివుని, రామ్ మిరియాల.









epaper.ntnews.com